
అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
www.navatelangana.com
గురువారం 10-04-2025
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 11 | సంచిక : 99 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

సాధారణ వర్షపాతమే



సీజన్ రెండో భాగం మెరుగు

బలహీనంగా, స్వల్పకాలికంగా లా నినా

దక్షిణ, పశ్చిమ భారత్‌లో తగినంత వర్షాలు

ప్రయివేటు వాతావరణ ఏజెన్సీ స్కైమెట్ అంచనా

న్యూఢిల్లీ : భారత్‌లో ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య సాధారణ వర్షపాతమే నమోదు కానున్నది. ప్రయివేటు వాతావరణ ఏజెన్సీ స్కైమెట్ దీనిని అంచనా వేసింది. స్కైమెట్ అంచనా ప్రకారం.. ఈ పీరియడ్‌లో వర్షపాతం దీర్ఘకాల సగటు 868.6 మిల్లీమీటర్ల కంటే మూడు శాతం అధికంగా నమోదు కానున్నది. దీర్ఘకాలిక సగటులో నాలుగుశాతం వర్షపాతం సాధారణంగా పరిగణించబడుతుంది. "ఈ సీజన్‌లో లా నినా బలహీనంగా, స్వల్పకాలికంగా ఉన్నది. లా నినా కీలక ...13లో

బ్రిటిషర్ల కంటే బీజేపీనే ప్రమాదకరం



గాడ్సే ఆలోచనల్ని మోడీ విస్తరింపజేస్తున్నారు

గాంధేయవాదులు రాహుల్‌కు అండగా నిలవాలి : సీడబ్ల్యూసీ విస్తృతస్థాయి సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

బ్రిటిషర్ల కంటే బీజేపీ నాయకులు అత్యంత ప్రమాదకారులని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. బ్రిటిషర్లను దేశం నుంచి తరిమికొట్టినట్టే, రాహుల్ గాంధీ నాయకత్వంలో బీజేపీని దేశం నుంచి తరిమికొట్టాలని చెప్పారు. దీనికోసం గాంధేయవాదులు రాహుల్‌గాంధీకి మద్దతుగా నిలవాలని కోరారు. గాడ్సే ఆలోచనా విధానాన్ని దేశంలో వ్యాపింపజేసేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. బుధవారం అహ్మదాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. గాడ్సే వారసుల ఆలోచనా ధోరణిని అడ్డుకునేందుకు గాంధీ కుటుంబసభ్యులతో కలిసి దేశం నలుమూలల ఉన్న ప్రజలు మోడీకి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. దేశంలో మోడీ అధికారం చేపట్టినప్పటి నుంచీ విభజన రాజకీయాలు చేస్తున్నారనీ, దానికి వ్యతిరేకంగా ప్రజలను ఏకం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. గాంధీజీ ఆలోచనలకు అనుగుణంగా దేశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు రాహుల్ గాంధీ నాయకత్వంలో ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ప్రధాని మోడీ రైతులకు వ్యతిరేకంగా నల్ల చట్టాలు తెచ్చారనీ, వాటికి వ్యతిరేకంగా రైతులు 14 నుంచి 15 నెలలు ధర్నాలు చేసినా చర్చలకు రాలేదని విమర్శించారు. మణిపూర్‌లో మంటలు రాజేసి, దేశ మూలవాసుల జీవన హక్కుల్ని కాలరాసే ప్రయత్నం చేశారని అన్నారు. దేశ సమగ్రత, ఐక్యత, రాజ్యాంగ పరిరక్షణ కోసం రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు నాలుగు వేల కిలోమీటర్లు పాదయాత్ర చేశారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా కుల గణన, రైతు రుణ మాఫీ, యువతకు ఉద్యోగాల కల్పన, మహిళల సంక్షేమంపై ఆయన వాగ్దానాలు చేశారనీ, ఆ మేరకు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన పది నెలల్లోనే 25 లక్షల కుటుంబాలకు రూ.21 వేల కోట్లు రుణమాఫీ చేశామని తెలిపారు. రాష్ట్రంలో కుల గణన చేసి చూపించామని చెప్పారు. కుల గణనపై రాహుల్ గాంధీ మాట్లాడాతారనే భయంతోనే లోక్‌సభలో మోడీ ఆయనకు మైక్ ఇవ్వలేదని అన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని మోడీ హామీ ఇచ్చారనీ, ఆ ప్రకారం 11 ఏండ్లపాలనలో 20 కోట్లకు పైగా ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉందన్నారు. ఈ విషయంలో యువతరం తీవ్రంగా నష్టపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో మోడీ చెప్పిన ఏ ఒక్క వాగ్దానం కూడా అమలుకు నోచుకోలేదని ఆక్షేపించారు. రైతులు, యువత, మహిళల కోసం సీడబ్ల్యూసీలో ఆసక్తికరమైన చర్చలు సాగాయని ప్రశంసించారు. తెలంగాణలో ఎట్టి పరిస్థితుల్లో బీజేపీకి అవకాశం ఇవ్వబోమన్నారు. తమ ప్రాంతం నిజాం ప్రభుత్వం కింద ఉన్నప్పుడు జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలో సర్దార్ వల్లభాయ్‌పటేల్ నేతృత్వంలో స్వాతంత్ర్యం వచ్చిందనీ, తెలంగాణ స్వరాష్ట్రాన్ని సోనియాగాంధీ తమకు అందించారని వివరించారు. స్వాతంత్ర్య సంగ్రామంలో గాంధీజీ బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా దండి సత్యాగ్రహంతో పాటు 30 ఏండ్లు అనేక పోరాటాలు చేశారనీ, కానీ బ్రిటిషర్లు ఏనాడూ ఆయనపై లాఠీ ప్రయోగం చేయలేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన ...13లో




మోడీ దేశాన్ని అమ్మేస్తారు

ఏఐసీసీ చీఫ్ ఖర్గే

దేశాన్ని ఎక్స్‌రే తీయాలి

రేవంత్ పంపిన బిల్లుపై కేంద్రం చర్యలు తీసుకోవట్లేదు : రాహుల్ గాంధీ



వివరాలు 6లో..

వడ్డీ రేట్లు మరో పావు శాతం తగ్గింపు

జీడీపీపై టారిఫ్ దెబ్బ

ఆర్బీఐ గవర్నర్ మల్హోత్రా వెల్లడి



ముంబయి : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వరుసగా రెండో సారి వడ్డీ రేట్లను తగ్గించింది. మూడు రోజుల పాటు సాగిన మానిటరింగ్ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమీక్షలో రెపోరేటులో 0.25శాతం కోత పెట్టాలని నిర్ణయించామని ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. దీంతో రెపో రేటు 6.25 శాతం నుంచి 6 శాతానికి తగ్గనుందన్నారు. ఇంతక్రితం ఫిబ్రవరిలో జరిగిన ద్వైమాసిక ద్రవ్య పరపతి సమీక్షలోనూ వడ్డీ రేట్లను పావు శాతం తగ్గించిన విషయం తెలిసిందే. స్థిర విధానం నుంచి సర్దుబాటు వైఖరికి మరాలని కమిటీ నిర్ణయించినట్టు తెలిపారు. ఆర్బీఐ తాజా నిర్ణయంలో గృహ, వాహన, వ్యక్తిగత తదితర రుణాలపై వడ్డీ రేట్లు తగ్గనున్నాయి. ప్రస్తుతం నెలకొన్న ఆర్థిక అనిశ్చి తులు పెట్టుబడులు, వినిమయంపై ప్రతికూల ప్రభావం చూపించనున్నాయని సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. భారత జీడీపీపై ...13లో

పెరుగుతున్న ఎండలు

వచ్చే మూడ్రోజులు 40 నుంచి 43 డిగ్రీలు పెరిగే అవకాశం

పలు జిల్లాల్లో వర్ష సూచనలు

వివరాలు 6లో..

ఫ్రాన్స్ నుంచి రాఫెల్ మెరైన్ జెట్‌లు

- 700కోట్ల డాలర్లతో 26 యుద్ధ విమానాలు కొనుగోలు
- భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోద ముద్ర



క్యాబినెట్ వివరాలు వెల్లడిస్తున్న కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్

న్యూఢిల్లీ : భారత నావికాదళం కోసం 700కోట్ల డాలర్లు విలువ చేసే 26 రాఫెల్ మెరైన్ జెట్ యుద్ధ విమానాలను కొనుగోలు చేసేందుకు ఫ్రాన్స్‌తో ఒప్పందానికి భారత్ ఆమోద ముద్ర వేసింది. బుధవారం సమావేశమైన భద్రతా వ్యవహరాల క్యాబినెట్ కమిటీ (సీసీఎస్) ఈ మేరకు నిర్ణయం తీసుకుందని అధికార వర్గాలు తెలిపాయి. ఈ ఒప్పందం కింద 26 రాఫెల్ విమానాలు భారత్‌కు అందుతాయి. వీటిలో 22 సింగిల్ సీటర్ జెట్‌లు కూడా వున్నాయి. విమాన వాహక నౌకల నుండి వీటిని నిర్వహించవచ్చు, మరో నాలుగు ట్విన్ సీటర్ జెట్‌లు వుంటాయి. రెండు ప్రభుత్వాల మధ్య కుదిరిన ఈ ఒప్పందానికి సీసీఎస్ ఆమోద ముద్రే తుది చర్య. ఈ నెలాఖరులో ఫ్రాన్స్ రక్షణ మంత్రి భారత్‌లో పర్యటించనున్నారు. ఆ సందర్భంగా లాంఛనంగా ఒప్పందంపై సంతకాలు జరుగుతాయని భావిస్తున్నారు. ఫ్రాన్స్ నుండే కొనుగోలు చేయాలని భావిస్తున్న మరో మూడు స్కార్పియన్ సాంప్రదాయ జలాంతర్గాములకు కూడా సీసీఎస్ ఆమోదం ఇంకా అందాల్సి వుంది. కాగా ఒప్పందంపై సంతకాలు అనంతరం రాఫెల్ మెరైన్ యుద్ధ విమానాలను నాలుగేళ్ళలో ఫ్రాన్స్, భారత్‌కు అందచేయాల్సి వుంటుంది. భారత నావికా దళానికి చెందిన రెండు విమాన వాహక నౌకల నుండి రాఫెల్-ఎంలను నిర్వహిస్తారు. 2016 సెప్టెంబరు రూ.60వేల కోట్లతో కుదిరిన ఒప్పందంలో భాగంగా భారత వైమానిక దళానికి 36 రాఫెల్ జెట్‌లు అందాయి. 2023 జులై 13న ప్రధాని పారిస్‌కు వెళుతున్న సమయంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ (డీఏసీ) సమావేశం ఈ ఒప్పందం ఆవశ్యకతను గుర్తించింది.

జిరక్‌పూర్ బైపాస్ రోడ్ ప్రాజెక్టుకు ఆమోదం

పంజాబ్, హర్యానాలోని 19.2కిలోమీటర్ల జిరక్‌పూర్ బైపాస్ రోడ్ ప్రాజెక్టుకు కేంద్ర క్యాబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుకు రూ.1878.31కోట్లు ఖర్చవుతుందని భావిస్తున్నారు. ఆరు లైన్లలో ...13లో

శ్రీకాంత్‌కు కన్నీటి వీడ్కోలు

అంతిమయాత్రలో వేలాదిగా ప్రజలు, పార్టీ శ్రేణులు



(ఫైల్)

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ, కార్యదర్శివర్గం సంతాపం
- పొలిట్‌బ్యూరో సభ్యులు అరుణ్‌కుమార్ నివాళి
- పాడె మోసిన అరుణ్, పోతినేని, నున్నా, ఎంపీ వద్దిరాజు
- సంతాప సభలో శ్రీకాంత్ ఔన్నత్యాన్ని స్మరించుకున్న నేతలు
- పార్టీకి తీరని లోటు : జాన్‌వెస్లీ

ఖమ్మంలో సీపీఐ(ఎం) అంటేనే 'యర్రా' కుటుంబం: తమ్మినేని

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

సీపీఐ(ఎం) అఖిల భారత 24వ మహాసభకు ప్రతినిధిగా హాజరై ఆకస్మాత్తుగా మృతిచెందిన యర్రా శ్రీకాంత్‌కు బుధవారం ఖమ్మంలో అంతిమ వీడ్కోలు పలికారు. అంతిమయాత్రకు వేలాదిగా జనం, పార్టీ శ్రేణులు కదిలివచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు హాజరయ్యారు. శ్రీకాంత్ భౌతికకాయంపై సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.అరుణ్ కుమార్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన అంతిమయాత్రలో శ్రీకాంత్ పాడెను అరుణ్ కుమార్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, నున్నా నాగేశ్వరరావు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మోశారు. శ్రీనివాసనగర్‌లోని శ్రీకాంత్ గృహం నుంచి మొదలైన ...3లో

జనాగ్రహం

గ్యాస్ ధర పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలి:

రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసనలు

రోడ్లపై కట్టెల పొయ్యిలు, సిలిండర్లు



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలు దహనం

నవతెలంగాణ- విలేకరులు

కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ సిలిండర్ ధరపై జనాగ్రహం వ్యక్తమవుతోంది. పెంచిన రూ.50 వెంటనే ఉపసంహరించుకోవాలంటూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలు దహనం చేశారు. వంట గ్యాస్ సిలిండర్లు పెట్టి రాస్తారోకోలు చేశారు. పలు చోట్ల సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం మండల కేంద్రంలో గ్యాస్ సిలిండర్‌తో నిరసన తెలిపారు. ఇల్లందు-మహబూబాబాద్ రహదారిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని జప్తి వీరప్పగూడెం, ఉట్లపల్లి, యాదగిరిపల్లి, బాదులాపురం గ్రామాల్లో నిరసన తెలిపారు. నకిరేకల్ పట్టణ కేంద్రంలోని మెయిన్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. నల్లగొండ పట్టణ కేంద్రంలో పొయ్యిపెట్టి నిరసన వ్యక్తం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండల కేంద్రంలో గ్యాస్ సిలిండర్‌తో నిరసన తెలిపారు. సూర్యాపేట జిల్లా మునగాల మండలంలోని మునగాల, జగన్నాధపురం గ్రామాల్లో ధర్నా నిర్వహించారు. మఠంపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఆర్ఐకి వినతిపత్రం అందజేశారు.

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కేఆర్కే కాలనీలో గ్యాస్ బండతో నిరసన తెలుపుతూ నినాదాలు చేశారు. ఆదిలాబాద్ మండలం రాములుగూడలోనూ నిరసన తెలిపారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట గ్యాస్ సిలిండర్లతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో, మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై ఖాళీ గ్యాస్ సిలిండర్లతో ...13లో

శాశ్వత పరిష్కారం చూపండి



తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ అసోసియేషన్

అరెస్ట్ అక్రమం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

వివరాలు 3లో..

లోకో పైలట్లకు విరామం కుదరదు

భోజనం, కాలకృత్యాలకు బ్రేక్ సాధ్యం కాదు

తేల్చి చెప్పిన రైల్వే బోర్డు

- ఉద్యోగ సంఘాల ఆగ్రహం



వివరాలు 3లో..

ముదిరిన వాణిజ్య యుద్ధం

ట్రంప్‌పై ఎదురుదాడి | అగ్రదేశాల మధ్య సుంకాల రగడ తీవ్రరూపం

చైనాపై 104 నుంచి 125శాతానికి టారిఫ్ పెంపు

యూఎస్‌పై చైనా 84శాతం సుంకాలు

కొరడా ఝుళిపించిన కెనడా.. ట్రంప్ యూటర్న్

అగ్రదేశాల మధ్య వాణిజ్య యుద్ధం తీవ్రరూపం దాల్చింది. చైనా నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 104 శాతం టారిఫ్‌లు అమలు చేస్తున్నట్టు అమెరికా తెలిపింది. ఇవి ఏప్రిల్ 9 నుంచి అమలులోకి రానున్నాయని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రెటరీ వెల్లడించారు. దీనికి మరోమారు చైనా కూడా దీటుగా బదులిచ్చింది. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై సుంకాలను 84 శాతానికి పెంచుతున్నట్టు చైనా తెలిపింది. కొత్త సుంకాలను ఏప్రిల్ 10 నుంచి అమలు చేయనున్నట్టు స్పష్టం చేసింది. కాగా తాజాగా అమెరికా చైనాపై టారిఫ్‌ను 125 శాతానికి పెంచింది. మిగతా దేశాలపై సుంకాలను తాత్కాలికంగా 90 రోజులపాటు నిలిపివేసింది.

వాషింగ్టన్/బీజింగ్ : ఏప్రిల్ 2 నుంచి చైనా దిగుమతులపై 54 శాతం సుంకాలు విధించనున్నట్టు ట్రంప్ ప్రకటించారు. దీనికి ప్రతీకారంగా చైనా కూడా అమెరికా దిగుమతులపై 34 శాతం సుంకాలు అమలు చేయనున్నట్టు వెల్లడించింది. దీనిపై ట్రంప్ తీవ్ర అభ్యంతరం, ఆగ్రహం వ్యక్తం చేశారు. 34 శాతం సుంకాలను వెనక్కి తీసుకోకపోతే అదనంగా 50 శాతం టారిఫ్‌లు అమలు చేస్తానని సోమవారం హెచ్చరించారు. ట్రంప్ హెచ్చరికను లెక్కచేయకపోవడంతో సుంకాలను 104 శాతానికి పెంచారు. ఇందుకు ప్రతిగా చైనా 84 శాతానికి పెంచింది. ఆ తర్వాత అమెరికా ఈ సుంకాన్ని 125 శాతానికి చేర్చింది. రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు వాణిజ్య యుద్ధానికి దిగడంతో ప్రపంచ దేశాలు తీవ్ర కలవర పడుతున్నాయి. ఈ పరిణామాలు వర్ధమాన దేశాలపై తీవ్ర ప్రభావం చూపను న్నాయి. గత మార్చి వరకు చైనా వస్తువులపై అమె రికా కేవలం 10 శాతం సుంకాలు విధి స్తూ వచ్చింది. దీన్ని తాజాగా పది రెట్లకు పెంచినట్టయ్యింది. చైనా బాటలోనే కెనడా కూడా కొరడా ఝుళిపించింది. అమెరికా నుంచి దిగుమతి అయ్యే వాహనాలు, వాటి పరికరాలపై 25 శాతం సుంకాలను విధిస్తున్నట్టు స్పష్టం చేసింది. యూఎస్ నుంచి ఆ దేశం ప్రతీ ఏడాది 67వేల యూనిట్ల వాహనాలను దిగుమతి ...13లో

సుదీర్ఘ పోరాటం కష్టమే

ఆర్థికాంశాల్లోనేకాక, అమెరికాతో పోలిస్తే అనేక అంశాల్లో చైనా బలంగా, స్థిరంగా ఉంది. ట్రంప్‌పై అమెరికా ప్రజలలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు ఆ సమస్య లేదు. చైనాలో ఆర్థిక ఉద్దీపన ప్యాకేజీ అమలులో ఉంది. భవిష్యత్తులోనూ దానిని కొన సాగించే సత్తా చైనాకు ఉంది. దేశీయ వినియోగ మార్కెట్‌ను పెంచుకునే అవకాశాలూ ఉన్నాయి. అమెరికా ప్రజలు తమ రోజువారీ అవసరాల కోసం చైనా దుస్తులు, బూట్లు, వినియోగ వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. ట్రంప్ సుంకాల దెబ్బతో వాటి ధరలు పెరిగి అమెరికన్లు ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫలితంగా భవిష్యత్తు లో ట్రంప్‌పై ఒత్తిడులు పెరగవచ్చు. ఇలాంటి వాతావరణం లో చైనాతో సుదీర్ఘ పోరాటం చేయడం అమెరికాకు కష్టమే. అమెరికా దీర్ఘకాలిక వాణిజ్య యుద్ధానికి దిగితే చైనా తన ఉత్పత్తులకు ప్రత్యామ్నాయ మార్కెట్ల కోసం అన్వేషిస్తుంది. అది యూరోపియన్‌యూనియన్ కావచ్చు. భారత్ కావచ్చు. ఆయా మార్కెట్లలో తన ఉత్పత్తులను చైనా కుమ్మ రించే అవకాశం ఉన్నదని జీటీఆర్ఐ పరిశోధనా సంస్థ పేర్కొంది.

మిగతా దేశాలపై తాత్కాలికంగా 90 రోజులపాటు సుంకాల నిలిపివేత



త్వరలో ఔషధాలపై యూఎస్ టారిఫ్‌ల మోత

13లో..

ఘనంగా ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎన్ఎస్‌యూఐ 55వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షులు రోహిన్‌రెడ్డి ఎన్ఎస్‌యూఐ జెండాను ఎగురవేశారు. అనంతరం కేక్‌కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. విద్యార్థుల సమస్యలపై ఎన్ఎస్‌యూఐ ఎన్నో పోరాటాలు నిర్వహించిందని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీకి ఎంతో మంది నాయకులను ఎన్ఎస్‌యూఐ అందించిందని తెలిపారు. చాలా మంది కార్యకర్తలు ఈ సందర్భంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో నేషనల్ కో ఆర్డినేటర్ రాష్ట్ర ఇన్‌చార్జి ఫిరోజ్ ఖాన్, జాతీయ లీగల్ సెల్ సభ్యులు అక్బర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రితేష్‌రావు, ప్రధాన కార్యదర్శి రచనారెడ్డి, నాయకులు శ్రీరామ్‌యాదవ్, వర్ధన్, విష్ణువర్ధన్‌రెడ్డి, కరుణాకర్, రాకేష్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారత దిశగా ముందుకుపోతున్నాం

తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో మహిళా సాధికారత దిశగా ముందుకు పోతున్నామని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద చెప్పారు. ఈఏడాది ప్రణాళికలో భాగంగా డొమెస్టిక్ హెల్పర్లు, వాణిజ్య లైంగిక కార్యకలాపాలు చేసే మహిళలకు సంబంధించి అవసరమైన సంక్షేమం, న్యాయపరమైన అంశాలపై దృష్టి సారించామని తెలిపారు. బుధవారం అయోధ్యలో జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విజయ కిషోర్ రాహత్కర్ నేతృత్వంలో రెండు రోజులపాటు నిర్వహించిన 'మహిళల సామర్థ్య అభివృద్ధి, శిక్షణ' కార్యక్రమంలో శారద మాట్లాడారు. రాష్ట్రంలోని పాఠశాలలు, కళాశాలలను సందర్శించి విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నట్టు తెలిపారు. వారి సంక్షేమానికి కావాల్సిన సూచనలు చేసినట్టు తెలిపారు. యువత సహజీవనంలో తలెత్తున్న సమస్యలపై కమిషన్ దృష్టి సారించిందన్నారు. విద్యార్థుల హక్కులు, మహిళా సాధికారత, లింగ సమానత్వంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గిరిజన మహిళా వసతి గృహాల పరిస్థితులను మెరుగుపరిచేందుకు సీఎస్ఐఆర్ సహకారం కోసం ప్రయత్నాలు చేస్తున్నట్టు వివరించారు. తెలంగాణ మహిళా కమిషన్ సభ్యులు షాహీన్, రేవతీరావు, ఉమాదేవి, ఈశ్వరీబాయి, సుధామ్ లక్ష్మి, కార్యదర్శి పద్మజ రమణ, కౌన్సిలర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన పంటల నష్ట నివారణ చర్యలు చేపట్టాలి

అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

చెదురుమదురు వర్షాలకు, గాలి బీభత్సానికి నేలకొరిగిన పంటల నష్ట నివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు గ్రామ స్థాయిలో ఉండి వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేయాలని సూచించారు. మార్కెట్‌లోకి వచ్చిన పంట ఉత్పత్తుల ధాన్యం తడవకుండా అన్నీ రకాల జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా అధికారులను మంత్రి కోరారు.

సీనియర్ ఐఏఎస్ రోనాల్డ్ రోస్‌కు క్యాట్‌లో ఊరట

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్ రోనాల్డ్ రోస్‌కు క్యాట్‌లో ఊరట లభించింది. రోనాల్డ్ రోస్ తెలంగాణలోనే కొనసాగేలా బుధవారం క్యాట్ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం రోనాల్డ్ రోస్ ఏపీ ప్రభుత్వంలో ఆర్థిక శాఖ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. కాగా తెలంగాణ నుంచి రిలీవ్ అయ్యే ముందు రోనాల్డ్ రోస్ విద్యుత్ శాఖ కార్యదర్శిగా బాధ్యతల్లో ఉన్న విషయం విదితమే. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం.. కేటాయించిన రాష్ట్రాల్లో రిపోర్ట్ చేయాలని ఐఏఎస్ అధికారులను గతేడాది అక్టోబర్‌లో డీవోపీటీ ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ ఉత్తర్వులపై క్యాట్, హైకోర్టును ఆశ్రయించినా ఆయా ఐఏఎస్‌లకు ఊరట దక్కలేదు. దీంతో తెలంగాణ నుంచి ఏపీకి వెళ్లాల్సిన వాణిప్రసాద్, వాకాటి కరుణ, రొనాల్డ్ రోస్, ఆమ్రపాలి తెలంగాణ నుంచి రిలీవ్ అయ్యారు. అనంతరం వెంటనే ఏపీలో రిపోర్ట్ చేశారు. మొత్తానికి ఏడు నెలల తర్వాత క్యాట్‌లో రోనాల్డ్ రోస్‌కు ఊరట దక్కింది. తెలంగాణలోనే కొనసాగేలా క్యాట్ ఉత్తర్వులు జారీ చేసింది.

సంస్కృతం విషయంలో తొందరపాటొద్దు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సెకండ్ లాంగ్వేజ్‌గా సంస్కృతం అమలు చేయాలనే అంశంపై తొందరపాటొద్దని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ (475) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి. శ్రీనివాస్, కొప్పిశెట్టి సురేష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సంస్కృతం అమలుపై తాజాగా ఇంటర్మీడియట్ బోర్డు సర్క్యులర్ జారీ చేసిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం కూడా జూనియర్ కళాశాలల్లో సంస్కృతాన్ని బోధించడానికి తెరవెనక కొంతమంది చేసిన యత్నాలను అడ్డుకున్నామని గుర్తు చేశారు. ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలతో చర్చించకుండా కార్పొరేట్ కాలేజీల మార్కుల కోసమే ఈ అంశాన్ని తెరపైకి తెచ్చారని విమర్శించారు. విద్యార్థులకు ఎలాంటి ఉపయోగం లేని అంశాలపై కాకుండా కాలేజీల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది భర్తీపై దృష్టి పెట్టాలని కోరారు.

ఢిల్లీ పార్టీలను నమ్మితే... తెలంగాణ బతుకు సున్నా

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఢిల్లీ పార్టీలను నమ్మితే తెలంగాణ బతుకు గుండు సున్నా అవుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బీజేపీ, కాంగ్రెస్‌లపై ఎక్స్ వేదికగా విమర్శలు గుప్పించారు. జీఎస్డీపీ, తలసరి వృద్ధి రేటులో రాష్ట్రం అట్టడుగున నిలవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ వేసిన ఆర్థిక పునాదులను కాంగ్రెస్ సర్కార్ ధ్వంసం చేస్తోందని విమర్శించారు. "కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రాన్ని ఆగం చేస్తున్నారు. కోట్లాది మంది జీవితాలతో చెలగాటమాడ తున్నారు. ఆర్థికవృద్ధిలో అగ్రభాగాన ఉన్న రాష్ట్రాన్ని పాతాళానికి పడేసిన ఈ పాపం క్షమించ రానిది. టూరిస్టు పార్టీలను నమ్మితే జరిగే విధ్వంసమిది. విజన్ లేనోళ్ల చేతిలో రాష్ట్రాన్ని పెడితే జరిగే వినాశనమిది. నాటి పదేండ్ల దార్శనిక పాలనకు.. నేటి దగుల్బాజీ విధానాలకు మధ్య తేడాను నాలుగు కోట్ల సమాజం నిశితంగా గమనిస్తోంది. ఇక జీవితంలో ఢిల్లీ పార్టీలను తెలంగాణ సమాజం నమ్మదు" అని కేటీఆర్ విమర్శించారు.

టూరిజంలో పెట్టుబడులే లక్ష్యం

నేడు ముంబయికి మంత్రి జూపల్లి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పర్యాటక రంగంలో పెట్టుబడులే లక్ష్యంగా ఆ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గురువారం ముంబయి పర్యటనకు వెళ్లనున్నారు. రెండ్రోజుల పాటు జరగనున్న 20వ దక్షిణాసియా హోటల్ ఇన్వెస్ట్మెంట్ కాన్ఫరెన్స్ వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొననున్నారు. ఇన్వెస్టర్లకు మెరుగైన రాయితీలు కల్పించి పూర్తి సహకారం అందిస్తామని సదస్సులో మంత్రి భరోసా కల్పించనున్నారు. తెలంగాణ నూతన పర్యాటక పాలసీతో పాటు ఎకో, టెంపుల్, మెడికల్ టూరిజంలో ఉన్న అవకాశాలను వారికి వివరించనున్నారు. పర్యాటక రంగంలో రూ.15 వేల కోట్ల పెట్టుబడులను సమీకరించడం ద్వారా రాబోయే నాలుగేండ్లలో 3 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని జూపల్లి ఈ సందర్భంగా తెలిపారు

సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలను పెంచండి

సీఎండీ బలరాం నాయక్‌కు కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ విజ్ఞప్తి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాంట్రాక్టు కార్మికుల వేతనాలను పెంచాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ సింగిరేణి యాజమాన్యాన్ని కోరింది. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కోదండరామ్, కనీస వేతనాల సలహా మండలి చైర్మెన్ జనక్ ప్రసాద్ సహకారంతో సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘాల జేఏసీ నాయకులు ఆ సంస్థ సీఎండీ బలరాం నాయక్‌ను కలిశారు. జేఏసీ నాయకులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులకు దశాబ్దాలుగా అన్యాయం జరుగుతున్నదనీ, వారి వేతనాలను పెంచి వైద్య సదుపాయం, సెలవులు, క్యాంటీన్ తదితర చట్టబద్ధ సౌకర్యాలను కల్పించాలని సీఎండీని వారు కోరారు. ఈ సందర్భంగా సీఎండీ బలరాం నాయక్ మాట్లాడుతూ.. సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల శ్రమ ఉన్నదనీ, వారి జీతాలను పెంచడానికి తాము కూడా సిద్ధంగా ఉన్నామని హామీ నిచ్చారు. ప్రస్తుత జీవో ప్రకారం వేతనాన్ని చెల్లిస్తున్నామనీ, రాష్ట్ర ప్రభుత్వం నూతన జీ.ఓ. ఇచ్చిన వెంటనే దానిని అమలు చేస్తామని భరోసానిచ్చారు. ఈఎస్ఐ అమలుకు డబ్బులు చెల్లించామనీ, త్వరలోనే ఆ సౌకర్యం కాంట్రాక్టు కార్మికులకు కూడా వర్తిస్తుందని చెప్పారు. క్యాంటీన్ సౌకర్యం, పండుగ సెలవులు తదితర చట్టపరమైన సౌకర్యాల అమలుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కోదండరాం, జనక్ ప్రసాద్ జోక్యం చేసుకొని ఎన్టీపీసీ, ఐటీసీలతో సహా అనేక ప్రభుత్వ ప్రయివేటు పరిశ్రమలలో జీఓలకు అదనంగా రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు వేతనాలను చెల్లిస్తున్నారని, కోలిండియాలో కూడా జీఓకు అదనంగా రోజుకు రూ.724 చెల్లిస్తున్న విషయాన్ని సీఎండీ దృష్టికి తీసుకెళ్లారు. సింగరేణిలో కూడా జీవోకు అదనంగా వేతనాలను చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అదనంగా వేతనాలు చెల్లించే విషయమై అధ్యయనం చేయించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని సీఎండీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. మధు, కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రసూరి శంకర్, సింగరేణి ప్రగతిశీల కాంట్రాక్ట్ కార్మిక సంఘం (టీయూసీఐ) రాష్ట్ర నాయకులు ఆర్. మధుసూధన్ రెడ్డి, టిజెఎస్ నాయకులు వి. బాబు, మల్లెల రామనాథం తదితరులున్నారు.

నిరుపేద మహిళా కార్మికురాలికి ఐటీ నోటీసు

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో ఒక నిరుపేద మహిళా కార్మికురాలికి ఆదాయ పన్ను శాఖ నోటీసులు జారీ చేయడం సంచలనంగా మారింది. కార్మికురాలికి ఏకంగా రూ. 4 కోట్లకు పైగా ఆదాయం ఉందని అందుకు సంబంధించి రిటర్న్ దాఖలు చేయాలంటూ అధికారులు నోటీసులు జారీ చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలోని జస్రన పట్టణంలోని మురికివాడలో సబ్రా అనే వృద్ధురాలు తన భర్తతో కలిసి నివాసం ఉంటోంది. వీరిద్దరు దినసరి కూలీలుగా పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. అయితే.. 2020-21 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2021-22 ఏడాదికి రూ. 4.88 కోట్లకు పైగా ఆదాయంపై పన్ను కట్టాలని నోటీసులు అధికారులు జారీ చేశారు. ఆమెకు చదవడం రాకపోవడంతో నాడు ఆ నోటీసులకు స్పందించలేదు. దీంతో ఐటి అధికారులు మరోసారి నోటీసులు జారీ చేశారు. 2021- 22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆదాయ పన్నుపై రిటర్న్ దాఖలు చేయాలని సూచించారు. పన్ను ఎందుకు చెల్లించలేదు.. వివరణ ఇవ్వాలని లేఖలో కోరారు. పోస్టుమాన్ సాయంతో విషయం తెలుసుకున్న పేద వృద్ధ దంపతులు కంగుతిన్నారు. ఈ విషయంపై ఎవరిని సంప్రదించాలో కూడా తెలియక ఆందోళన చెందుతున్నారు.

రష్యా విక్టరీ పరేడ్‌కు ప్రధాని మోడీకి ఆహ్వానం

మాస్కో : రెండో ప్రపంచ యుద్ధంలో జర్మనీపై రష్యా విజయం సాధించి 80ఏండ్లు పూర్తయిన సందర్భంగా మే 9న జరిగే విక్టరీ డే పరేడ్‌కు హాజరు కావాల్సిందిగా ప్రధాని నరేంద్ర మోడీని రష్యా ఆహ్వానించింది. ఈ మేరకు రష్యా డిప్యూటీ విదేశాంగ మంత్రి ఆంద్రీ రుదెంకో తెలిపారు. ఇప్పటికే ఆహ్వానాన్ని పంపినట్లు, పర్యటనా వివరాలు రూపొందుతున్నట్లు రుదెంకోను ఉటంకిస్తూ రష్యా వార్తా సంస్థ టాస్ తెలిపింది.

డొమినిక్ రిపబ్లిక్‌లో కూలిన నైట్‌క్లబ్ పైకప్పు..

98 మంది మృతి

శాంటో డొమింగో : డొమినిక్ రిపబ్లిక్‌లో ఘోర ప్రమాదం జరిగింది. నైట్‌క్లబ్ పైకప్పు కూలిపోవడంతో 98 మరణించినట్లు అధికారులు తెలిపారు. మరో160 మందికి తీవ్రగాయాలయ్యాయని అన్నారు. 400 మంది అత్యవసర బృందాలు సహాయక చర్యలు చేపడుతున్నాయి. ఈ ఘటన రాజధాని శాంటో డొమింగ్‌లోని జెట్ సెట్ నైట్‌క్లబ్‌లో జరిగింది. అయితే ప్రమాద సమయంలో నైట్‌క్లబ్‌లో ఎంతమంది ఉన్నారనే అంశంపై అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు. మృతుల్లో ప్రావిన్షియల్ గవర్నర్, మేజర్ లీగ్ మాజీ బేస్‌బాలర్ పిచర్ ఆక్టావియా డోటెల్‌లు ఉన్నట్లు దేశ అత్యవసర ఆపరేషన్స్ సెంటర్ డైరెక్టర్ జువాన్ మాన్యుయేల్ మెండెజ్ తెలిపారు. పిచర్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మరణించారని అన్నారు. ప్రముఖ మెరెంగ్యూ గాయకుడు రూబీ పెరెజ్ నిర్వహిస్తున్న కన్సర్ట్‌లో రాజకీయ నేతలు, అథ్లెట్లు, ఇతర ప్రముఖులు హాజరయ్యారు. ప్రదర్శన జరుగుతున్న సమయంలో మంగళవారం రాత్రి ఒక్కసారిగా పైకప్పు కూలిపోయింది. ఈ సమయంలో క్లబ్‌లో 1000 మంది వరకు ఉన్నట్లు తెలుస్తోంది. అత్యవసర బృందాలు సహాయక చర్యలు చేపడుతున్నాయి.

పెట్రో, గ్యాస్ ధరల పెంపు

ప్రజలను వంచించడమే

కేంద్రం ఆర్థిక దోపిడీకి పాల్పడుతోంది

మంత్రి హర్దీప్ సింగ్ పూరీకి కేటీఆర్ ఘాటు లేఖ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి- హైదరాబాద్

పెట్రో,గ్యాస్ ధరలను పెంచడం ప్రజలను వంచించడమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు ఆరోపించారు. పెట్రోల్ రేట్లను సెస్సుల రూపంలో పెంచి మోడీ ప్రభుత్వం తీవ్రమైన ఆర్థిక దోపిడీకి పాల్పడుతూ రాష్ట్రాల హక్కులను కబళిస్తున్నదని వ్యాఖ్యానించారు. వసూలైన సెస్సులతో మౌలిక సదుపాయాలను కల్పించకుండా తమ సొంత రాజకీయ ఎజెండాను అమలు చేస్తు న్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పన్నుల్లో రావాల్సిన న్యాయమైన వాటాను రాష్ట్రాలకు ఇవ్వకుండా దేశ సమాఖ్య వ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్రలకు మోడీ ప్రభుత్వం పాల్పడుతున్నదని విమర్శించారు. దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతికి గణనీయంగా సహకరిస్తున్న తెలంగాణ వంటి రాష్ట్రాలు నిధుల కొరతతో అల్లాడుతుంటే, అక్రమంగా వసూలు చేస్తున్న సెస్సులతో సమకూరుతున్న ఆదాయంతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలపై పెత్తనం చెలాయిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన పెట్రోధరలపై కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రి హర్దీప్‌సింగ్ పూరీకి బుధవారం కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. ఇంధన ధరల్లో ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన దేశాల్లో ఒకటిగా మనదేశం నిలిచిందని వ్యాఖ్యానించారు. భూటాన్, పాకిస్తాన్‌తోపాటు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన శ్రీలంకలో కూడా పెట్రో, డీజిల్, ఎల్పీజీ ధరలు భారత్‌లో కంటే చౌకగా ఉన్నాయని గుర్తుచేశారు. ఎల్పీజీ సిలిండర్ ధర రూ. 1,100 దాటడం పేద, మధ్యతరగతి ఆడపడుచులకు భరించలేని భారంగా మారిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉజ్వల యోజన ఒక క్రూరమైన జోక్ అని అభిప్రాయపడా రు. ఒకప్పుడు ఉజ్వల యోజన కింద సిలిండర్లు తీసుకున్న మహిళలు, పెరిగిన గ్యాస్ ధరలతో మళ్లీ కట్టెలపైనే వంట చేస్తున్నారన్నారు. గతంలో అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు 100 డాలర్లు దాటినప్పుడు కూడా, ఇప్పటితో పోలిస్తే దేశంలో ఇంధన ధరలు తక్కువగా ఉన్నాయని వివరించారు. ఇప్పుడు క్రూడ్ ధరలు తగ్గినప్పటికీ ప్రజలపై భారం పెంచడం దేనికి సంకేతమని కేటీఆర్ ప్రశ్నించారు. కేంద్రం పెంచుతున్న పెట్రోల్, గ్యాస్ ధరల వల్ల పేద ప్రజల జేబులు ఖాళీ అవుతుండగా, ఆయిల్ కంపెనీలకు వేలకోట్ల రూపాయలు చేరుతున్నాయన్నారు. ఎన్నికల సమయంలో ధరలు స్థిరంగా ఉంచి, ఓట్ల పండుగ అయిపోగానే పెంచడం ప్రజల్ని వంచించడమేనని అన్నారు. మినిమం గవర్నమెంట్, మాక్సిమం గవర్నెన్స్ అన్న కేంద్ర ప్రభుత్వ నినాదం "మాక్సిమం ట్యాక్సేషన్, మినిమం రిలీఫ్"గా మారిందని అభిప్రాయపడ్డారు. మోడీ చెప్పిన "అచ్చే దిన్" అంటే ఈఎంఐలు కట్టలేక, ఇంధన బిల్లుల భారం భరించలేక మిడిల్ క్లాస్ సతమతమవడం, సిలిండర్ తెచ్చుకోవాలా? సరుకులు కొనుక్కోవాలా? అన్న మీమాంసలో పేదలు ఉండిపోవడం, రాష్ట్రాలు తమ స్వయంప్రతిపత్తిని కోల్పోవడమేనా అని ప్రశ్నించారు. ఇంధన ధరల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలనీ, కేంద్ర ఎక్సైజ్ సుంకాలను గణనీయంగా తగ్గించి, రాష్ట్రాలకు ఇవ్వని సెస్‌లను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇంధన పన్నులు, సెస్ వినియోగం, ఆదాయ వాటా వివరాలతో కూడిన శ్వేతపత్రం విడుదల చేయాలనీ, ఆర్థిక కేంద్రీకరణ విధానాలు విడనాడి, నిజమైన సహకార ఫెడరలిజాన్ని పునరుద్ధరించాలని సూచించారు.

బీహార్‌లో పిడుగుల బీభత్సం

13 మంది మృతి

పాట్నా : బీహార్‌లో బుధవారం పలు జిల్లాల్లో ఈదురు గాలులు, వడగళ్ల వాన బీభత్సం సృష్టించాయి. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా పిడుగులు పడి 13 మంది ప్రాణాలు కోల్పోయారు. బెగూసరాయ్, దర్బంగా జిల్లాల్లో వేర్వేరు ఘటనల్లో తొమ్మిది మంది మరణించారు. మధుబనీలో ముగ్గురు చనిపోగా ఇందులో ఒకే కుటుంబానికి చెందిన తండ్రి, కుమార్తె ఉన్నారు. సమస్తిపూర్‌లో పిడుగుపాటు వల్ల ఒకరు మరణించారు. ఈ ఘటనపై సంతాపం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్.. బాధిత కుటుంబాలకు రూ.4లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. విపత్తు నిర్వహణ శాఖ జారీ చేసే సూచనల ప్రకారం నడచుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాగా, బీహార్ ఆర్థిక సర్వే (2024-25) ప్రకారం 2023లో పిడుగుపాటు కారణంగా రాష్ట్రంలో 275 మంది ప్రాణాలు కోల్పోయారు.

నేడు భారత్‌కు తహవూర్ రాణా

న్యూఢిల్లీ : 2008 ముంబై ఉగ్రదాడుల సూత్రధారి తహవూర్ రాణాను అధికారులు ప్రత్యేక విమానంలో గురువారం భారత్‌కు తీసుకురానున్నారు. ఈ విమానం కాలిఫోర్నియా నుంచి భారత కాలమానం ప్రకారం బుధవారమే బయలుదేరింది. తహవూర్ రాణా భారత్‌కి వచ్చిన తర్వాత విచారణ కోసం జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) ఆయన్ని కస్టడీలోకి తీసుకునే అవకాశం ఉంది.

లోకో పైలట్లకు విరామం కుదరదు

భోజనం, కాలకృత్యాలకు బ్రేక్ సాధ్యం కాదు

తేల్చి చెప్పిన రైల్వే బోర్డు

ఉద్యోగ సంఘాల ఆగ్రహం





జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న లోకో పైలట్లు

న్యూఢిల్లీ : విధి నిర్వహణలో ఉండగా భోజనానికి, కాలకృత్యాలు తీర్చుకోవడానికి కొంత విరామం ఇవ్వాలంటూ లోకో పైలట్లు చాలా కాలంగా చేస్తున్న డిమాండ్‌ను రైల్వే బోర్డు తోసిపుచ్చింది. దీనిపై ఉన్నత స్థాయి కమిటీ చేసిన సిఫారసులకు ఆమోదం తెలుపుతూ డ్యూటీలో ఉన్న సమయంలో విరామం ఇవ్వడం సాధ్యపడదని స్పష్టం చేసింది. మానవ తప్పిదాల కారణంగా దేశంలో అధిక సంఖ్యలో రైలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న తరుణంలో రైల్వే బోర్డు ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

లోకో క్యాబిన్‌లో సిబ్బంది మాటలు, చేతలను రికార్డు చేసే వ్యవస్థ ఏర్పాటును కూడా బోర్డు సమర్ధించుకుంది. ఇది గోప్యతకు భంగకరం కాదని తేల్చింది. ఏదైనా సంఘటన జరిగితే దాని తర్వాత జరిగే విశ్లేషణలో సిబ్బందికి సహాయపడేందుకు, మద్దతుగా నిలిచేందుకు ఈ వ్యవస్థ ఉపకరిస్తుందని తెలిపింది.

'ఇది సిబ్బందిపై ఎలాంటి అదనపు పనిభారం మోపదు. నిర్వహణా సామర్థ్యాన్ని పెంచేందుకు, రైళ్లు సురక్షితంగా నడిచేందుకు ఈ వ్యవస్థ ఒక సాధనం మాత్రమే' అని జోనల్ రైల్వేల జనరల్ మేనేజర్లకు పంపిన సమాచారంలో రైల్వే బోర్డు తెలియజేసింది. రైల్వే బోర్డు, రైల్వేల పరిశోధనా విభాగమైన రిసెర్చ్ డిజైన్స్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్ (ఆర్‌డీఎస్ఓ)కు చెందిన ఐదుగురు సభ్యుల క్రమశిక్షణ కమిటీ చేసిన సిఫారసు మేరకు హై-స్పీడ్ రైళ్ల వేగాన్ని గంటకు 110 కిలోమీటర్ల నుంచి 130 కిలోమీటర్లకు పెంచింది. తాము రైళ్లలో అసిస్టెంట్ లోకో పైలట్లను నియమించాలన్న సిఫారసుకు కూడా ఆమోదం తెలిపింది.

ఆమోదయోగ్యం కాదు

కాగా రైల్వే బోర్డు నిర్ణయాన్ని ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ ఖండించింది. ఇది వాస్తవ దూరంగా ఉన్నదని, నిరాధారమైనదని విమర్శించింది. ఈ మేరకు అసోసియేషన్ సెక్రెటరీ జనరల్ కేసీ జేమ్స్ రైల్వే బోర్డు ఛైర్మెన్‌కు లేఖ రాశారు. రైళ్ల వేగం పెంచితే లోకో పైలట్లపై పడే పని ఒత్తిడిని అంచనా వేయడంలో కమిటీ విఫలమైందని తెలిపారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు లోకో పైలట్లకు విరామాన్ని నిరాకరించడం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. లోకోమోటివ్స్‌లో టాయిలెట్ సౌకర్యం లేదని గుర్తు చేశారు. అనేక సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆరేడు గంటల పాటు ఎక్కడా ఆగకుండా ప్రయాణిస్తాయని అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి వి.బాలచంద్రన్ చెప్పారు. 'న్యూఢిల్లీ-చెన్నై ఎక్స్‌ప్రెస్ రైలు రాత్రి 11.10 గంటలకు విజయవాడ చేరుతుంది. మరునాడు ఉదయం 6.35 గంటలకు చెన్నై చేరే వరకూ అది ఎక్కడా ఆగదు. అలాంటి పరిస్థితులలో మహిళా పైలట్ల ఇబ్బంది మరింత దుర్భరంగా ఉంటుంది. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే రూట్లలో సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను అత్యవసర పరిస్థితిలో తప్ప మధ్యలో ఏదో ఒక స్టేషన్‌లోనో లేదా వేసైడ్ స్టేషన్‌లోనే ఆపడం కుదరదు' అని ఆయన తెలిపారు. లోకో పైలట్ మార్గమధ్యలో ఏదో తింటేనో లేదా కాలకృత్యాలు తీర్చుకుంటేనో తప్ప అప్రమత్తంగా ఉండలేడని రామచంద్రన్ చెప్పారు. లోకో పైలట్ల సుదీర్ఘ పని గంటలను, వారి పని పరిస్థితులను సమీక్షించాలని అనేక సిఫారసులు ఉన్నాయని తెలిపారు. లోకో క్యాబిన్లలో సిబ్బంది మాటలు, చేతలను రికార్డు చేయడం వారి గోప్యతను భంగపరచడం తప్ప మరేమీ కాదని అన్నారు. ఇది వారిని శిక్షించడానికి ఉపయోగించే వ్యవస్థ అని రామచంద్రన్ ఆరోపించారు. లోకో పైలట్లు బుధవారం జంతర్‌మంతర్ వద్ద తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు.

కేంద్రమంత్రి మనవరాలు దారుణ హత్య

నాటు తుపాకీతో కాల్చిచంపిన భర్త



జితన్ రామ్



సుష్మా దేవి

గయ : కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝీ మనవరాలు సుష్మా దేవి దారుణ హత్యకు గురయ్యారు. ఆమె భర్తే నాటు తుపాకీతో కాల్చిచంపాడు. బీహార్‌లోని గయా జిల్లాలోని తెతౌ గ్రామంలో బుధవారం పిల్లలు, సోదరి పూనమ్ కుమారితో ఇంట్లో ఉన్న సమయంలో సుష్మాదేవి హత్య జరిగింది. పూనమ్ కుమారి పోలీసులకు తెలిపిన వివరాల ప్రకారం పని మీద పాట్నా వెళ్లిన సుష్మా దేవి భర్త రమేష్ మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంటికి తిరిగివచ్చాడు. ఈ తరువాత భార్యభర్తల మధ్య ఘర్షణ తలెత్తింది. దీంతో రమేష్ నాటు తుపాకీ తీసుకుని సుష్మా దేవిపై కాల్పులకు తెగబడ్డాడు. ఈ శబ్దం విని వేరే గదిలో ఉన్న పూనమ్, పిల్లలు అక్కడకు వచ్చారు. అయితే తీవ్ర గాయలతో రక్తపు మడుగులో సుష్మా పడి ఉంది. ఘటనా స్థలంలోనే ఆమె మృతి చెందింది. స్థానికులు కూడా అక్కడకు చేరుకున్నారు. అయితే కాల్పులు జరిపిన తరువాత రమేష్ భర్త అక్కడ నుంచి పారిపోయాడు.

మృతురాలు సుష్మ వికాస్ మిత్రాగా పనిచేస్తున్నారు. బీహార్ మహాదళిత్ వికాస్ మిషన్ కింద అభివృద్ధి కార్యక్రమాల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి, సమాజానికి మధ్య వారధిగా పనిచేయడం వికాస్ మిత్రాల విధి. రమేష్ పాట్నాలో ఒక ట్రక్కు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. వీరిద్దరికి 14 ఏండ్ల క్రితం వివాహం జరిగింది. ఇద్దరివి వేర్వేరు కులాలు. రమేష్‌ను పట్టుకోవడం కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు గయ సీనియర్ సూపరింటెండ్ ఆఫ్ పోలీస్ (ఎస్ఎస్‌పి) ఆనంద్ కుమార్ తెలిపారు. సంఘటనా స్థలంలో ఫోరెన్సిక్ బృందం, సాంకేతిక నిపుణులు ఆధారాలను సేకరిస్తున్నారని, విచారణ కొనసాగుతోందని చెప్పారు. కాగా, కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝీ ఇప్పటి వరకూ ఈ ఘటనపై స్పందించలేదు. గయ లోక్‌సభ స్థానం నుంచి జితన్ రామ్ మాంఝీ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మోడీ మంత్రి వర్గంలో సూక్ష్మ, చిన్న, మధ్యతర పరిశ్రమల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. హిందుస్తానీ అవామ్ మోర్చా (సెక్యులర్) వ్యవస్థాపకులే మాంఝీ. ఇది ఎన్డీఏలో భాగస్వామి పార్టీగా ఉంది.



లక్నోలో కదంతొక్కిన కరెంటోళ్లు

డిస్కంల ప్రయివేటీకరణ ఉపసంహరించుకోవాలని డిమాండ్


మే 29 నుంచి నిరవధిక సమ్మె

యూపీ సర్కార్‌పై తిరుగుబాటు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఉత్తర్‌ప్రదేశ్‌లోని యోగి ఆదిత్యానాథ్ సర్కార్‌పై విద్యుత్ ఉద్యోగులు తిరుగుబాటు ప్రకటించారు. రాష్ట్రంలోని పూర్వాంచల్, దక్షిణాంచల్ విద్యుత్ పంపిణీ సంస్థల (డిస్కంలు) ప్రయివేటీకరణ ప్రయత్నాలను తక్షణం మానుకోవాలని హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం రాజధాని లక్నోలో విద్యుత్ కర్మచారి సంయుక్త సంఘర్ష్ సమితి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆలిండియా పవర్ ఇంజినీర్స్ ఫెడరేషన్ (ఏఐపీఈఎఫ్) చైర్మెన్ శైలేంద్ర దూబే ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దేశం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో విద్యుత్ ఉద్యోగులు, ఇంజినీర్లు లక్నో రోడ్లపై యోగి సర్కార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కదం తొక్కారు. తెలంగాణ నుంచి ఏఐపీఈఎఫ్ శాఖ నాయకులు పీ రత్నాకరరావు, సదానందం తదితరులు పాల్గొన్నారు. యూపీ ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోని పక్షంలో మే 29 నుంచి రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగులు నిరవధికంగా విధులు బహిష్కరిస్తారని హెచ్చరించారు. ఏప్రిల్ 16 నుంచి 30వ తేదీ వరకు ప్రజా అవగాహన ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. మే 1వ తేదీ బైక్ ర్యాలీ నిర్వహిస్తారు. ఆ తర్వాత ఎనిమిది రోజులు నిరాహార దీక్షలు చేస్తారు. ఈ సందర్భంగా యూపీలోని పార్లమెంటు సభ్యులు, ఎమ్మెల్యేలకు డిస్కంల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వినతిపత్రాలు అందించి నిరసనలు తెలుపుతామని సంఘర్ష్ సమితి నాయకులు తెలిపారు. డిస్కంలు నష్టాల్లో ఉన్నందున వాటిని ప్రయివేటీకరించాలని యోగి సర్కార్ నిర్ణయించింది. దీనిపై విద్యుత్ ఉద్యోగులు భగ్గుమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోకుంటే దేశవ్యాప్త నిరసనలు చేపడతామని నాయకులు హెచ్చరించారు.

'మండే' రోజూ పచ్చతోరణమే



డాక్టర్ ఆపరేషన్ థియేటర్లో అడుగు పెట్టాడు. ఆపరేషన్ టేబుల్ మీద పేషెంట్ పడుకొని సిద్ధంగా ఉన్నాడు. డాక్టర్ పక్కనే టేబుల్ మీద ఉన్న సర్జరీ కత్తి తీసుకొని పేషెంట్‌ని కసకసా పొడిచాడు. ఆపరేషన్ గదిలో ఉన్న తోటి డాక్టర్లు, నర్సులు హతాశులై, భీతావహులై చూస్తున్నారు. రక్తం ధారగట్టి టేబుల్‌పై నుంచి కిందకి జారి, ఆపరేషన్ గది బయటకు ప్రవాహం కట్టింది. 'ఆపరేషన్ సక్సెస్' అని పెద్దగా అరిచాడు డాక్టర్ ట్రంప్.

ఈ సోమవారం ప్రపంచ స్టాక్ మార్కెట్‌లో జరిగింది ఇదే. ట్రంప్ రక్తం పారించాడు. స్టాక్ మార్కెట్లన్నీ కుప్పకూలాయి. అమెరికా పెంచిన టారిఫ్ 9వ తేదీ నుంచి అమలవుతుందనగా, ఒకరోజు ముందే స్టాక్ మార్కెట్లకు గుండె పగిలింది. ఇండియాలోని స్టాక్ మార్కెట్ ఆ ఒక్క రోజే 14 లక్షల కోట్ల రూపాయలకు పైగా సంపదను పోగొట్టుకుంది. ట్రేడింగ్ జరిగిన ఆరు గంటల్లో గంటకి 2.5 కోట్ల లక్షల రూపాయల చొప్పున మదుపరుల సొమ్ము 'ట్రంపార్పణం' అయింది. కట్టిన ఇల్లు కూల్చడం చిన్న పనే కావచ్చు, కానీ ఆ ఇంటినే తిరిగి కట్టాలంటే ఏండ్లు పడతాయి. ఇప్పుడు స్టాక్ మార్కెట్‌లోని చిన్న, చిల్లర (రిటైల్) మదుపర్ల పరిస్థితి ఇదే. సోమవారం కోల్పోయిన మొత్తాన్ని తిరిగి పొందాలంటే ఎంత కాలం పడుతుందో?

స్టాక్ మార్కెట్లు కుప్పకూలినప్పుడు బాగా ఎక్కువ నష్టపోయేది చిన్న మదుపరులు మాత్రమే. తమ సంపాదనలో మిగిలిన/మిగిల్చుకున్న పొదుపుతో షేర్లు కొని అమ్మి కొంత లాభం సంపాదించాలని మధ్యతరగతి ఉద్యోగస్తులు, చిన్న దుకాణదారులు తాపత్రయపడతారు. ఆర్థిక వ్యవస్థ సజావుగా నడుస్తున్నప్పుడు వీరికి ఈ స్టాక్ మార్కెట్ 'జూదం' కొద్ది సంపాదన తెచ్చిపెడుతుంది. కానీ అది ఏమి మేడలు, మిద్దెలు కట్టేంత సంపాదన కాదు. కానీ ఇప్పుడు ట్రంప్ చేసిన టారిఫ్ నిర్వాకం వల్ల గాని, హర్షద్ మెహతా లాంటి వాళ్ళు చేసిన కుంభకోణాల వల్ల గాని మొదట కోలుకోలేనంత నష్టపోయేది ఈ చిన్న ఇన్వెస్టర్లే. తిరిగి మార్కెట్లు పుంజుకుని చూస్తే వీరు దివాలా తీసి ఉంటారు, వీరి సంపద షేర్ల రూపంలో బడా బాబుల జేబుల్లోకి చేరి ఉంటుంది.

'బ్లాక్ మండే', 'బ్లడ్ బాత్' వీటితో నాకేం పని అని, స్టాక్ మార్కెట్ జోలికే వెళ్ళను అని చాలామంది అనుకోవచ్చు. మీరు ఉద్యోగస్తులు అయితే మీ పీఎఫ్ డబ్బులు, మీ పెన్షన్ నిధులు, అదే మీరు చిన్నపాటి దుకాణదారులు, గృహిణులు అయితే చిన్న పొదుపు మొత్తాల పథకాల్లో దాచిపెట్టుకున్న సొమ్ము షేర్ మార్కెట్‌లో వాడటం జరుగుతుంది. స్టాక్ మార్కెట్ కుదేలై, నష్టాలు వస్తే మీ పీఎఫ్ మీద, చిన్న పొదుపు మొత్తాల మీద వడ్డీ రేట్లు తగ్గిస్తారు. ఆ విధంగా షేర్ మార్కెట్‌లో ప్రత్యక్షంగా సంబంధం లేని వారు కూడా ఆదాయం నష్టపోతారు.

ఇటువంటి స్టాక్ మార్కెట్ కుదుపులకుగాని, లేక కుప్పకూలినప్పుడు గానీ బడా పెట్టుబడిదారులకు వచ్చే నష్టం ఏమీ లేదు. ఎందుకంటే వారు అంతకుముందే తమ దగ్గర ఉన్న షేర్లను బ్యాంకుకు తనఖా పెట్టి, ఇంకో పరిశ్రమకు కావాల్సిన పెట్టుబడికి వాడుకుంటారు. తనఖాలో ఉన్న షేర్లు భారీగా నష్టపోతే, బ్యాంకులు భరించాల్సి వస్తుంది. పూర్తిగా నష్టపోతే ఉండనే ఉంది 'మోడీ రైట్ ఆఫ్'. బడా పెట్టుబడిదారులందరికి స్టాక్ మార్కెట్ సంక్షోభం చిన్న ఝలక్ మాత్రమే. వారు పెద్దగా చలించరు.

స్టాక్ మార్కెట్‌లో ఈ గందరగోళం జరుగుతున్న రోజునే అదానీ ముంబయిలో ఒక ఎకరం స్థలం రూ.170 కోట్లు పెట్టి కొంటున్నట్టు వార్త వచ్చింది. ఇంకొక వార్త, 'దివాళా పరిష్కారం'లో వున్న జయప్రకాష్ అసోసియేట్స్‌ను కొనటానికి 26 కంపెనీలు పోటీ పడుతున్నాయి. ఇందులో అదానీ గ్రూప్, రిలయన్స్ గ్రూప్, వేదంతా, రామ్‌దేవ్ పతంజలి వున్నాయి. ఇప్పుడు జేపీ అసోసియేట్స్ షేర్ ధర రూ.3.90 పైసలు. అదైనా ఈ కంపెనీలు కొనటానికి పోటీ పడుతున్నాయనే వార్త వల్ల పెరగటమే. లేకపోతే రూ.3.25 మాత్రమే. ఎన్నిసార్లు షేర్ మార్కెట్ పతనమైనా, కుంభకోణాలు జరిగినా జేబుకు చిల్లి పడేది చిన్న మదుపరులకే. బడా పెట్టుబడిదారుల, దొరబాబుల జీవితం నిత్యకల్యాణం పచ్చతోరణంగా గడిచిపోతూనే ఉంటుంది.

\- కర్లపాలెం



శ్రీకాంత్‌కు కన్నీటి వీడ్కోలు

(మొదటి పేజీ తరువాయి)

అంతిమయాత్ర కాల్వొడ్డులోని వైకుంఠధామం వరకు సాగింది. కుటుంబసభ్యులు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ప్రజా నాట్య మండలి కళాకారులు శ్రీకాంత్‌కు నివాళి అర్పిస్తూ ఆడిపాడారు. అంతకు ముందు సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అధ్యక్షతన శ్రీకాంత్ స్వగృహం అక్షయ రెసిడెన్సీలో ఏర్పాటు చేసిన సంతాప సభలో నేతలు మాట్లాడారు. శ్రీకాంత్ ఔన్నత్యాన్ని చాటుతూ పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని ఆర్.అరుణ్‌కుమార్ పిలుపు నిచ్చారు. మహాసభకు ప్రతినిధిగా హాజరైన శ్రీకాంత్‌తో 4వతేదీ ఉదయం తాను మాట్లాడానని, ఎంతో కలుపుగోలుగా వ్యవహరించేవారని గుర్తు చేసుకున్నారు. ఖమ్మం జిల్లాలో విద్యార్థి ఉద్యమా భివృద్ధికి తోడ్పడ్డారని చెప్పారు. తాను ఎస్ఎఫ్ఐ ఆలిండియా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు శ్రీకాంత్ సీపీఐ(ఎం) ఖమ్మం పట్టణ కార్యదర్శిగా ఉండేవారని, అప్పటి నుంచీ ఆయనతో తనకు మంచి అనుబంధం ఉండేదని స్మరించుకున్నారు. ఆయన కుటుంబం పార్టీ కోసం నిలబడిందని, ఇప్పుడు పార్టీ ఆయన కుటుంబానికి అండగా నిలబడాల్సిన అవసరముందని అన్నారు. పార్టీ కేంద్ర కమిటీ తరఫున నివాళి అర్పిస్తున్నట్టు ప్రకటించారు.

సీపీఐ(ఎం) అంటేనే 'యర్రా' కుటుంబం: తమ్మినేని వీరభద్రం

సీపీఐ (ఎం) అంటేనే 'యర్రా' కుటుంబం.. 'యర్రా' కుటుంబం అంటేనే సీపీఐ (ఎం) అనేలా ఆ కుటుంబం పార్టీతో పెనవేసుకుందని కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. దేశాన్ని మతోన్మాద ప్రభావం నుంచి రక్షించాలని ఆలిండియా మహాసభ దిశా నిర్దేశం చేసిందన్నారు. వామపక్షాలను బలోపేతం చేయటం ద్వారానే అది నెరవేరుతుందని భావిస్తున్న దశలో శ్రీకాంత్ లాంటి పోరాటయోధుడు మన నుంచి దూరం కావడం బాధాకరమన్నారు. మతోన్మాదంపై మహాసభ తీర్మానంపై చర్చల్లోనూ శ్రీకాంత్ పాల్గొన్నారని గుర్తు చేశారు. శ్రీకాంత్‌తోపాటు ఆయన భార్య యర్రా సుకన్య పిల్లలు కుటుంబం అంతా పార్టీ సిద్ధాంతానికి కట్టుబడి పని చేస్తున్నారని తెలిపారు.

శ్రామికవర్గాల రాజ్యస్థాపన శ్రీకాంత్ లక్ష్యం : జాన్‌వెస్లీ

శ్రామికవర్గాల రాజ్యస్థాపనకు పనిచేసిన నేత యర్రా శ్రీకాంత్ అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. అన్ని వర్గాల కోసం పనిచేసిన నాయకుడు మరణం తీరని లోటని చెప్పారు. శ్రీకాంత్ మరణం పార్టీకి తీరని లోటని, ఆయన మృతికి సీపీఐ(ఎం) పార్టీ రాష్ట్ర కమిటీ తరఫున సంతాపం ప్రకటించారు. శ్రీకాంత్‌తో తమకున్న జ్ఞాపకాలను, ఆయన పోరాటాలను సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎం.సాయిబాబు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్, సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ గుర్తు చేసుకున్నారు. శ్రీకాంత్ ఉద్యమ సైనికునిలా పనిచేశారని చెప్పారు.

సంతాప సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, బండారు రవికుమార్, పి.ప్రభాకర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావా రవి, మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మాచర్ల భారతి, మచ్చా వెంకటేశ్వర్లు, భూపాల్, బుర్రి ప్రసాద్, బండి రమేష్, కళ్యాణం వెంకటేశ్వరరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.జె.రమేష్, అన్నవరపు కనకయ్య, అన్నవరపు సత్యనారాయణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాగం హేమంతరావు తదితరులు పాల్గొన్నారు.

శిశు జనన, మరణాల నమోదులో నిర్లక్ష్యం

చట్టాలను ఉల్లంఘిస్తున్న ఆస్పత్రులు

21 రోజుల్లో నివేదించాలని ఆర్‌జీఐ హెచ్చరిక

న్యూఢిల్లీ : అనేక ప్రభుత్వ ప్రయివేటు ఆస్పత్రులు.. శిశువుల జనన, మరణాల ధ్రువీకరణ నమోదు ప్రక్రియ ఆలస్యం వహిస్తున్నాయి. వైద్య సంస్థలు చట్టాన్ని ఉల్లంఘిస్తూ, సార్వత్రిక నమోదును ఆలస్యం చేస్తున్నాయని తేలినట్టు రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (ఆర్‌జీఐ) పేర్కొంది. దీంతో ప్రయివేటు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో శిశువుల జనన, మరణాల నమోదు 21 రోజుల్లో నివేదించాలని వైద్య సంస్థల్ని హెచ్చరించింది. చాలా ఆస్పత్రులు శిశువుల సంబంధిత బంధువులను నేరుగా రిజిష్టర్ దగ్గరకు వెళ్లి నివేదించమని సలహా ఇస్తున్నాయని ఆర్‌జీఐ తెలిపింది. ఈ నమోదు ప్రక్రియలో వంద శాతానికి చేరుకోవాలనే లక్ష్యం నెరవేరలేదని.. కేవలం 90 శాతమే చేరుకున్నామని గత నెల (మార్చి 17 2025) ఆర్‌జీఐ కార్యాలయ సర్క్యులర్ పేర్కొంది.

శాశ్వత పరిష్కారం చూపండి

తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయాలలో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాకులకు శాశ్వత పరిస్కారం చూపిన తర్వాతే రెగ్యులర్ నియామకాలు చేపట్టాలని యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎం. రామేశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్రీధర్ కుమార్ లోద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఉన్నత విద్యామండలి ముందు అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా నిర్వహిస్తున్న వారిని పోలీసులు అరెస్ట్ చేసి నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం రామేశ్వర్ రావు, డాక్టర్ శ్రీధర్ కుమార్ లోద్ మాట్లాడుతూ కొంత మంది అధికారులు అదే విధంగా వైస్ ఛాన్సలర్లు గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి కోవర్ట్‌గా మారి ఆ పార్టీని నాశనం చేసినట్టు కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా చేరి యూజీసీ రూల్స్‌కి భిన్నంగా ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చేలా జీవో నెంబర్ 21ని తెప్పించారని ఆరోపించారు. ఈ జీవో చట్ట విరుద్ధమని వారు స్పష్టం చేశారు. ఇలాంటి వారి మాటలు నమ్మొద్దని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నాము. యూనివర్సిటీలో రిక్రూట్మెంట్ జరిగితేనే నాక్ గ్రేడ్లు వస్తాయని ఒక బూటకపు అబద్ధాన్ని అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాకతీయ విశ్వవిద్యాలయానికి 2024లో నాక్ ఏ ప్లస్ గ్రేడ్ వచ్చిందనీ, అక్కడ పని చేసే రెగ్యులర్ టీచింగ్ స్టాఫ్ 69 మంది కాగా 370 మంది కాంట్రాక్టు, పార్ట్ టైం టీచర్లేనని ఉదహరించారు. వెంటనే తమకు శాశ్వత పరిష్కారం చూపించాలనీ, రెగ్యులరైజేషన్ లేదా అబ్సర్షన్ రెండింటిలో ఏదో ఒకటి చేయాలని విజ్ఞప్తి చేశారు.



కాంట్రాక్ట్ అధ్యాపకుల అరెస్ట్ అక్రమం

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విశ్వ విద్యాలయాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల అరెస్ట్ అక్రమమని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఒక ప్రకటనలో విమర్శించారు. హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి వద్ద గురువారం నిరసన తెలిపేందుకు తరలి వచ్చిన వారిని పోలీసులు అక్రమకంగా అరెస్ట్ చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే వారికి ఉద్యోగ భద్రతతో పాటు యూజీసీ సెవెంత్ పే బేసిక్ ప్లస్ హెచ్‌ఆర్ఏ 3 ఇంక్రిమెంట్ ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న 1270 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

సంపాదకీయం

'ఉపాధి' ఎండమావి



రాజ్యాంగబద్ధమైన పనిహక్కుకు గుర్తింపునిచ్చిన జాతీయ ఉపాధి హామీ పథకం తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా నిర్వీర్యమవుతున్నది. నైపుణ్యంలేని గ్రామీణ ప్రజల కోసం వామపక్షాల ఒత్తిడి మేరకు యూపీఏ-1 హయాంలో శ్రీకారం చుట్టిందే ఈ మహోత్తర పథకం. రెక్కాడితేగాని డొక్కాడని కోట్లాది శ్రమజీవుల పాలిట అన్నపూర్ణగా వెలుగొందిన ఈ పథకాన్ని చట్టంగా మార్చి రక్షణ కల్పించారు. కాగా ప్రస్తుతం, కేంద్రంలోని మోడీ సర్కారు ని'బంధ'నాల్లో చిక్కుకున్నది. ఆధార్ లింక్ పేరుతో కూలీల వేతనాలకు ఎసరుపెట్టింది.కొత్తగా తెచ్చిన మార్గదర్శకాల పేర జాబ్‌కార్డులను నిర్దాక్షిణ్యంగా రద్దుచేస్తున్నది. ప్రతిశ్రామికుడికి కాదనకుండా ఉన్న ఊళ్లోనే ఏడాదికాలంలో రోజుకు రూ.307 కనీసవేతనంతో వందరోజులు పని కల్పించడం లక్ష్యం. తద్వారా దేశంలో మౌలిక సదుపాయాల కల్పన, నీటి పొదుపు, కరువు నివారణ, వరదల నియంత్రణ తదితర పనులను శాశ్వత ప్రాతిపదికన చేయడం ఉపాధి హామీ చట్టం ప్రాథమిక ఉద్దేశ్యం.కానీ, బీజేపీ సర్కారు చట్టం మౌలిక సూత్రాలను దెబ్బతీస్తున్నది. రకరకాల నిబంధనల తీసుకొస్తూ, నిధులకు కోతపెడుతూ పేదల కడుపుకొడుతున్నది.

> రాయితీల పేర కార్పొరేట్లు, పెట్టుబడిదారులకు దాదాపు రూ.12 లక్షల కోట్ల ప్రజాధనాన్ని ఉచితంగా వండివార్చిన మోడీకి ఛిద్రమవుతున్న నిరుపేదల బతుకులు కనపడటం లేదా? అని ప్రజాసంఘాలు ప్రశ్నిస్తున్నాయి. నిబంధనలను సడలించాలని డిమాండ్ చేస్తున్నాయి. చట్ట ప్రకారం పనిప్రదేశాల్లో నీడ, నీళ్లు, వైద్యం, శిశువులకు ఆయా సదుపాయాలు కల్పించాల్సి ఉన్నా, నిర్లక్ష్యం చేయడంతో తెలం గాణలోని జహీరాబాద్ జిల్లాలో చాంద్‌బీ అనే మహిళా కూలీ ఎండకు ప్రాణాలు కోల్పోయింది. దీనికి బాధ్యులెవరు? దేశవ్యాప్తంగా కూలీలందరికీ పనులు కల్పించాలంటే ప్రతియేటా బడ్జెట్‌లో రూ.2.64 లక్షల కోట్లు కేటాయించాలి. కాగా 2022లో రూ.25 వేల కోట్లు, ఆ తర్వాత ప్రతియేటా వేల కోట్లు కోత పెట్టింది.

తెలంగాణలో గత మూడు నెలలుగా ఉపాధి శ్రామికులకు రూ.900 కోట్ల నుంచి రూ.1000 కోట్ల వరకు బిల్లులు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టింది. కోటి జాబ్‌కార్డులకు గాను కేవలం 56.78 లక్షల మందికే పనులు చూపించడం గమనార్హం. అలాగే పథకాన్ని అమలు చేసే ఉద్యోగులకు జీతాలు చెల్లించకుండా గత ఉగాది పండుగ రోజున పస్తులుంచింది. కూలీల ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతాలను నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ)కి మ్యాపింగ్ చేస్తేనే వేతనాలు చెల్లిస్తామంటూ కండిషన్ పెట్టి కోట్లాది మంది ఉసురు పోసు కుంటున్నది. సంక్లిష్టమైన ఈ ప్రక్రియను చేయలేక కూలీల వెతలు అన్నీఇన్నీ కావు. కూలీల నోటికాడి అన్నం ముద్దను నిబంధనల పేర బీజేపీ లాగేసుకుంటున్నది. దేశంలో 25 కోట్ల జాబ్‌కార్డులకుగాను 12.88 కోట్ల మంది కూలీలకు పనులిస్తున్నట్టు సర్కారీ లెక్కల సారాంశం. అందులోనూ వివిధ సాకులు చెబుతూ 7.6 కోట్ల మంది జాబ్ కార్డులను రద్దుచేసి పేదలకు పనులు ఇవ్వకుండా మోడీ సర్కారు మోకాలడ్డిందని లిబ్‌టెక్ ఇండియా సంస్థ విశ్లేషణలో బట్ట బయలైంది. సగానికిపైగా ఉపాధి కూలీల బ్యాంక్ అకౌంట్లు ఎన్‌పీసీఐతో అనుసంధానం కాకపోయినా, కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ తీసుకున్న నిర్ణయం ఇప్పుడు కోట్ల మందికి ఉపాధి హామీని ఎండమావిగా మార్చింది.

ఆధార్‌కార్డులతో వేలిముద్రలు సరిపోలేదనో, అక్షర దోషాలున్నాయనో, వివరాలు పొరపాటుగా నమోదయ్యాయనో మ్యాపింగ్ జరగకపోతే ఆ సాంకేతిక సాకు చూపి కోట్లాది మంది నిరుపేదల కడుపు మాడ్చడం ఏ సంక్షేమానికి మచ్చుతునక? ఏ అభివృద్ధికి ఆనవాలు? సాంకేతికత సాకుతో 8.9 కోట్ల మంది యాక్టివ్ కార్మికుల్లో 1.8 కోట్ల మంది పని హక్కును, వేతనాల్ని పొందే అవకాశాన్ని కోల్పోతున్నారనేది ప్రజాసంఘాల విమర్శ. ఉపాధి హామీకి నిధులు పెంచుతామంటూ భీకర వాగ్దానాలు చేసిన బీజేపీ ప్రభుత్వం, ప్రతియేటా నిధులకు కోత పెట్టడం వాస్తవం కాదా? రాయితీల పేర కార్పొరేట్లు, పెట్టుబడిదారులకు దాదాపు రూ.12 లక్షల కోట్ల ప్రజాధనాన్ని ఉచితంగా వండివార్చిన మోడీకి ఛిద్రమవుతున్న నిరుపేదల బతుకులు కనపడటం లేదా? అని ప్రజాసంఘాలు ప్రశ్నిస్తున్నాయి. నిబంధనలను సడలించాలని డిమాండ్ చేస్తున్నాయి. చట్ట ప్రకారం పనిప్రదేశాల్లో నీడ, నీళ్ల, వైద్యం, శిశువులకు ఆయా సదుపాయాలు కల్పించాల్సి ఉన్నా, నిర్లక్ష్యం చేయడంతో తెలం గాణలోని జహీరాబాద్ జిల్లాలో చాంద్‌బీ అనే మహిళా కూలీ ఎండకు ప్రాణాలు కోల్పోయింది. దీనికి బాధ్యులెవరు? దేశవ్యాప్తంగా కూలీలందరికీ పనులు కల్పించాలంటే ప్రతియేటా బడ్జెట్‌లో రూ.2.64 లక్షల కోట్లు కేటాయించాలి. కాగా 2022లో రూ.25 వేల కోట్లు, ఆ తర్వాత ప్రతియేటా వేల కోట్లు కోత పెట్టింది.

మున్సిపాల్టీలు, కార్పొరేషన్లల్లోనూ ఉపాధి హామీ పనులు చేపట్టాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యుయూ) డిమాండ్ చేసింది. కేరళ తరహాలో కేంద్రంతోపాటు రాష్ట్ర ప్రభుత్వాలు నిధులివ్వాలని కోరింది. ప్రతియేటా పెంచుతున్న కూలీ రేటు విషయంలోనూ కేంద్రం వివక్ష చూపిస్తున్నది. కొన్ని రాష్ట్రాల్లో రూ.26 పెంచి, తెలంగాణలో రూ. 7 మాత్రమే అధికం చేయడం ఏం దుర్మార్గం? కుటుంబం ప్రాతిపదిక కాకుండా మనిషికో జాబ్‌కార్డు ఇవ్వడం, క్యూబిక్ మీటర్ రేటు పెంచడం, ఏడాది పనిదినాలు 200 చేయడం, దినసరి వేతనం రూ. 600కు పెంచడం, నిరుద్యోగ భృతి చెల్లించాలనే డిమాండ్ల దీర్ఘకాలికంగా మోడీ సర్కారు అలక్ష్యం చేస్తున్నది. వీటిని పరిష్కరించాల్సింది పోయి, అసలు వేతనాలకు ఎగనామం పెట్టడం కూలీలపాలిట శాపంగా మారింది.

మారింది ప్రభుత్వమే.. విధానాలు కాదు!





పాలడుగు భాస్కర్
9490098033

"ప్రభుత్వాలను చూసి ప్రజలు భయపడకూడదు. ప్రజల్ని చూసి ప్రభుత్వాలు భయపడాలని" ఒక రచయిత చెప్తే, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ప్రభుత్వాన్ని చూసి ప్రజలు, కార్మికులు, ఉద్యమకారులు ఎవరైనా సరే, భయపడాల్సిందేనన్న తీరుగా వ్యవహరిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలెదుర్కొంటున్న సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం, పట్టించుకోకపోతే నిరసనలు తెలపడం ప్రజల కనీస హక్కు. ఈ హక్కును గత సర్కార్ అణిచివేసిందనే తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. కానీ, గత పదిహేను నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, అనుసరిస్తున్న విధానాల్ని చూస్తే చెప్పిన నీతులకు, చేతలకు పొంతనేలేదని నిరూపితమైంది. ఇటీవల అసెంబ్లీ సమావేశాల సందర్భంగా జరిగిన ధర్నాచౌక్ ఘటనలే ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు,మేనిఫెస్టో అంశాల్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆశా, అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ, హమాలీ, ట్రాన్స్‌పోర్ట్, బీడీ, భవన నిర్మాణ, విద్యుత్ ఆర్టిజన్స్, మున్సిపల్, విఆర్ఏలు ఉద్యమబాట పట్టారు. అసెంబ్లీలో తమ సమస్యలపై చర్చకు వస్తే, దానికో పరిష్కారమార్గం దొరుకుతుందని ఆశపడ్డారు. కానీ ధర్నాలు, నిరసనలపై గత ప్రభుత్వంవలే రేవంత్ సర్కార్ కూడా ఉక్కుపాదం మోపడం ప్రజాస్వామ్య పునరుద్ధరణగా ఇచ్చిన 'ఏడోగ్యారంటీ' ప్రశ్నార్థకంగా మారింది.

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేసింది. పనిప్రదేశంలో ఆరోగ్యకరమైన పరిస్థితులు కల్పించడం, ఉద్యోగ భద్రత, పనికి తగ్గ వేతనాలు చెల్లించడం, అక్రమ తొలగింపులు తదితర అంశాలపై కార్మిక చట్టాలు ఏర్పాటు చేసి హక్కులను పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంటుందని, మరింత మెరుగైన సేవలందించి కార్మికుల పక్షాన నిలుస్తుందని పదకొండవ అంశంగా స్పష్టంగా పేర్కొంది. దీంతో పాటు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అన్ని రంగాల్లో ఉన్న కార్మికులకు సమాన పనికి - సమాన వేతనం వచ్చేలా చర్యలు తీసుకుని, శ్రమ దోపిడీకి గురికాకుండా చర్యలు చేపడతామని చెప్పింది. ఆర్టీసీ ఉద్యోగస్తులకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే జీతాలు చెల్లిస్తామని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని హామీనిచ్చింది. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం లాంటి స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తిస్తామని, మున్సిపల్, గ్రామ పంచాయతీ, యూనివర్సిటీ, వైద్య ఆరోగ్య రంగాల్లో పనిచేసే వారికి వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని పేర్కొంది. భవన నిర్మాణ కార్మికుల బోర్డును పటిష్టం చేసి సామాజిక భద్రత కల్పిస్తామని, ఓనర్ కం డ్రైవర్ స్వయం ఉపాధి కోసం పని చేస్తున్న ఆటో డ్రైవర్‌కు రూ.50 వేలు వరకు, ఓనర్ కం డ్రైవర్ క్యాబ్ డ్రైవర్లకు రూ. లక్ష వరకు రుణమాఫీ చేస్తామని చెప్పింది. ఆటో అండ్ ప్రయివేటు డ్రైవర్స్ అండ్ వర్కర్స్ రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం రూపొందిస్తామని, బీడీ కార్మికులందరికీ రూ.2 వేల పెన్షన్ ఇస్తామని వివరించింది. బీడీ కార్మికులను ఈఎస్ఐ పరిధిలోకి తీసుకువస్తామని, ఎస్ఎంఆర్ డైలీవేజ్ కన్సాలిడేటెడ్ కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనంతో సహా ఇతర చట్టబద్ధ హక్కులను అమలు చేస్తామని, ఇప్పటికే పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని పేర్కొంది. అసంఘటితరంగ కార్మికులకు నగరాల్లో, పట్టణాల్లో నివాస వసతి, వారు నివసిస్తున్న కాలనీల్లో, బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించి వాటిని తక్షణం ప్రాధాన్యం ప్రాతి పదికన పూర్తి చేస్తామని పేర్కొంది. ఉద్యోగుల ఉద్యోగ భద్రత కోసం కొత్త చట్టాలు తెస్తామని, మహిళా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను సాధ్యమైనంత వరకు నైట్ షిఫ్ట్‌లలో పనిచేయకుండా నియంత్రించాలని యాజమాన్యాలపై ఒత్తిడి తెస్తామని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పీపుల్స్ మేనిఫెస్టోలో పేర్కొంది.

> 2025 మార్చి 22న కేంద్ర కార్మిక సంఘాలు బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా ఇందిరా పార్కులో ధర్నాకు పిలుపునిచ్చిచ్చాయి. ఆ ధర్నాకు హైదరాబాద్‌లో అనుమతిచ్చి కొత్తగూడెం, ఇల్లందు, సంగారెడ్డి ప్రాంతాల్లో కార్మికులను అరెస్టులు చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని, తమ గోడు ప్రభుత్వానికి విన్నవించుకోడానికి వచ్చిన ఆశాలను హైదరాబాద్ నడిరోడ్డుపై కర్కశంగా అణచివేశారు. పోలీసుల తోపులాటలో స్పృహ తప్పిపోయిన మహిళా కార్మికులకు వైద్య చికిత్స కూడా అందించలేదు. మార్చి 24న మధ్యాహ్న భోజనం కార్మికుల ధర్నాకు అనుమతిచ్చారు. కానీ ముందు రోజు మధ్యాహ్నం నుండే జిల్లాల్లో అరెస్టుల పర్వం కొనసాగించారు. రాష్ట్రంలో సీఎం ఏ జిల్లా పర్యటనకు వెళ్లినా అక్కడ సీఐటీయూ నాయకులను ముందస్తు అరెస్టులు చేస్తున్నారు.

ఏడోగ్యారంటీపైనే ఉక్కుపాదం!

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 15 నెలల కాలం గడిచింది. ఎన్నికల సందర్భంగా వారిచ్చిన హామీలు కాగితాలకే పరిమితమయ్యాయి. ప్రభుత్వ పెద్దలకు, అధికారులకు ఈ కాలంలో వివిధ రంగాల కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులిచ్చారు. ముఖ్యమంత్రి, మంత్రులకు దండాలు పెట్టారు. అయినా వారికి ఫలితం దక్కలేదు. వారి సమస్యల పరిష్కారానికి పోరాట మార్గాన్నే ఎంచుకున్నారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమం చేపట్టారు. ఆ ఆందోళనలను బాధ్యతాయుతంగా పరిశీలించి వారి డిమాండ్లను పరిష్కరించాల్సిన ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరించింది. ఎన్నికల సందర్భంగా సోనియా గాంధీ ఆరు గ్యారంటీలకు హామీనిస్తే, స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం వంటి ఏడో గ్యారంటీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీనిస్తున్నానని స్వయంగా ప్రకటించారు. 2023 డిసెంబర్ 7న ఒకవైపు ప్రమాణ స్వీకారం చేస్తూనే మరోవైపు ప్రగతి భవన్‌కు గత ప్రభుత్వం వేసిన ముండ్లకంచెలను కూలగొట్టిస్తూ ప్రజాస్వామ్య పునరుద్ధరణ ప్రారంభమైందని ప్రకటించుకున్నారు. ఇటీవల కాలంలో జరిగిన పరిణామాలను పరిశీలిస్తే అవి ఆదిలోనే అంతమైనట్లు కన్పిస్తున్నవి. 2025 మార్చి 21న తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా హమాలీ, బీడీ, భవన నిర్మాణం, ప్రయి వేటు మోటార్ ట్రాన్స్‌పోర్ట్ తదితర అసంఘటితరంగ కార్మికులు చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద మహాధర్నాకు పిలుపునిచ్చారు. ఈ ధర్నాకు అనుమతిస్తామని చెబుతూనే చివరి నిమిషంలో నిరాకరించారు. ఆరోజు రాత్రి రాష్ట్రవ్యాప్తంగా పోలీసులు కార్మికుల ఇండ్లపై పడి అర్ధరాత్రి బలవంతంగా పోలీస్ స్టేషన్‌లకు లాక్కెళ్లారు. హైదరాబాద్ చేరుకున్న కొద్దిమందిని భయభ్రాంతులకు గురిచేశారు. ఇది అత్యంత అప్రజాస్వామిక చర్య. ఇది కార్మికుల హక్కులపై జరుగుతున్న దాడికి నిదర్శనం. ఈ ఘటన ముఖ్యమంత్రి గారు ఇటీవల రవీంద్రభారతిలో మీడియా సాక్షిగా మాట్లా డుతూ తమ పాలనలో ఉద్యోగులకు, కార్మికులకు, ప్రజలకు తమ సమస్యలను ప్రభుత్వానికి చెప్పుకునే హక్కును, స్వేచ్ఛను ఇచ్చామని, నాయకుల ఇండ్లకు వెళ్లి తలుపులు బద్దలు కొట్టి అరెస్టులు చేయడం తమ ప్రభుత్వ విధానానికి వ్యతిరేకమని" చెప్పి ఒక్కరోజు కూడా గడవక ముందే జరగడం అందరినీ ఆశ్చర్యపరిచింది.

అనుమతిలిస్తూ..అరెస్టులు చేస్తూ...

ఈ ఒక్క ఘటనే కాదు, ఇలాంటి ఘటనలు తెలంగాణలో అనేకం చోటుచేసుకున్నాయి. 2024 డిసెంబర్ 17న గ్రామ పంచాయతీ కార్మికులు ఇందిరా పార్కు వద్ద ధర్నా చేసుకునేందుకు పోలీసులు అనుమతిచ్చారు. కానీ ఇచ్చిన అనుమతిని అర్ధరాత్రి రద్దు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది పంచాయతీ కార్మికులను అక్రమంగా ముందస్తు అరెస్టులు చేశారు. రైతు సమస్యల మీద ఆందోళన చేసేందుకు అనుమతి కోరిన రైతు సంఘాలకు కార్యక్రమం నిర్వహణకు ముందు రోజు రాత్రి పొద్దుపోయిన తర్వాత అనుమతిచ్చారు. అప్పటికే రైతులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లలో నిర్బంధించారు. విఆర్ఏలు ధర్నా చేసుకునేందుకు అనుమతి సైతం నిరాకరించారు. 2025 మార్చి 22న కేంద్ర కార్మిక సంఘాలు బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా ఇందిరా పార్కులో ధర్నాకు పిలుపునిచ్చిచ్చాయి. ఆ ధర్నాకు హైదరాబాద్‌లో అనుమతిచ్చి కొత్తగూడెం, ఇల్లందు, సంగారెడ్డి ప్రాంతాల్లో కార్మికులను అరెస్టులు చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని, తమ గోడు ప్రభుత్వానికి విన్నవించుకోడానికి వచ్చిన ఆశాలను హైదరాబాద్ నడిరోడ్డుపై కర్కశంగా అణచివేశారు. పోలీసుల తోపులాటలో స్పృహ తప్పిపోయిన మహిళా కార్మికులకు వైద్య చికిత్స కూడా అందించలేదు. మార్చి 24న మధ్యాహ్న భోజనం కార్మికుల ధర్నాకు అనుమతిచ్చారు. కానీ ముందు రోజు మధ్యాహ్నం నుండే జిల్లాల్లో అరెస్టుల పర్వం కొనసాగించారు. రాష్ట్రంలో సీఎం ఏ జిల్లా పర్యటనకు వెళ్లినా అక్కడ సీఐటీయూ నాయకులను ముందస్తు అరెస్టులు చేస్తున్నారు. రాష్ట్రమంతా అసెంబ్లీ జరిగిన వారం,పది రోజుల పాటు సీఐటీయూ నాయకులతో పాటు కార్యకర్తలను పోలీసులు ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలు చేశారు. రాష్ట్రమంతా అన్ని జిల్లాల్లో పోలీస్ యాక్ట్-30ని అమలు చేస్తున్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో సైతం ధర్నాలు, నిరసనలు నిషేధిస్తూ వైస్ చాన్స్‌లర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ అంశాలన్నీ తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.

> గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి భిన్నంగా ప్రజాస్వామ్యయుతంగా పరిపాలన సాగిస్తానని చెప్పిన కాంగ్రెస్ ఆచరణలో గత ప్రభుత్వం లాగే కార్మిక పోరాటాలు, ఆందోళనలపై నిర్బంధం, ఆంక్షలు విధించడం దుర్మార్గం. రాజ్యాంగం ప్రకారం నిరసన తెలిపే హక్కు పౌరులుగా కార్మికవర్గానికి ఉంది. ప్రజాస్వామ్య హక్కులను గౌరవించడం ప్రభుత్వ బాధ్యత. ఈ విషయాల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. కార్మికవర్గ పోరాటాల పట్ల వ్యవహరిస్తున్న తీరు మార్చుకోవాలి. ప్రస్తుతం కొనసాగుతున్న నిర్బంధాన్ని, ఆంక్షలను ఎత్తివేయాలి. గతంలో అంగన్‌వాడీ పోరాటాన్ని అణచివేసి, గుర్రాలతో తొక్కించి, లాఠీఛార్జీ చేయించిన టీడీపీ ప్రభుత్వాన్ని, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక ప్రజా ఉద్యమాలపై ఉక్కుపాదం మోపి నియంతృత్వ పాలన సాగించిన బీఆర్ఎస్‌ను కార్మికవర్గం గడగడలాడించి గద్దె దించిన చరిత్ర కార్మికవర్గ పోరాటాలకు ఉంది. ఈ చరిత్రను తెలుసుకోవాలి. గత పాలకుల నుండి గుణపాఠం నేర్చుకోవాలి.

గతం నుంచి గుణపాఠం నేర్వరా?

గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి భిన్నంగా ప్రజాస్వామ్యయుతంగా పరిపాలన సాగిస్తానని చెప్పిన కాంగ్రెస్ ఆచరణలో గత ప్రభుత్వం లాగే కార్మిక పోరాటాలు, ఆందోళనలపై నిర్బంధం, ఆంక్షలు విధించడం దుర్మార్గం. రాజ్యాంగం ప్రకారం నిరసన తెలిపే హక్కు పౌరులుగా కార్మికవర్గానికి ఉంది. ప్రజాస్వామ్య హక్కులను గౌరవించడం ప్రభుత్వ బాధ్యత. ఈ విషయాల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. కార్మికవర్గ పోరాటాల పట్ల వ్యవహరిస్తున్న తీరు మార్చుకోవాలి. ప్రస్తుతం కొనసాగుతున్న నిర్బంధాన్ని, ఆంక్షలను ఎత్తివేయాలి. గతంలో అంగన్‌వాడీ పోరాటాన్ని అణచివేసి, గుర్రాలతో తొక్కించి, లాఠీఛార్జీ చేయించిన టీడీపీ ప్రభుత్వాన్ని, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక ప్రజా ఉద్యమాలపై ఉక్కుపాదం మోపి నియంతృత్వ పాలన సాగించిన బీఆర్ఎస్‌ను కార్మికవర్గం గడగడలాడించి గద్దె దించిన చరిత్ర కార్మికవర్గ పోరాటాలకు ఉంది. ఈ చరిత్రను తెలుసుకోవాలి. గత పాలకుల నుండి గుణపాఠం నేర్చుకోవాలి. ప్రజా, కార్మికోద్యమాలను గౌరవించి సమస్యల్ని పరిష్కరించాలి. రేవంత్‌రెడ్డి సర్కార్ ఇకనైనా తీరు మార్చుకోవాలి. లేకపోతే కార్మికవర్గం ప్రభుత్వాన్నే మార్చగలదు. తస్మాత్ జాగ్రత్త!

మెయిల్ @ నవతెలంగాణ

ప్రయాణ...ప్రయాస

రైల్వే ప్రయాణం సామాన్యుకి అందనంత దూరమవుతున్నది. ఇప్పుడు ఎక్కడికి వెళ్లాలన్నా ఆన్‌లైన్‌లో చాలామంది టిక్కెట్లు బుక్ చేసుకుంటున్నారు. ఇది తెలియని సామాన్య పేదలు అనేక అవస్థలు పడుతున్నారు. స్టేషన్‌కు వెళ్లి టికెట్ తీసుకుందాంటే దొరుకుతుందో లేదో, టిక్కెట్ తీసుకునేలోపే రైలు బండి వెళ్లిపోతుందో అనే సందేహాలు నెలకొన్నాయి. రైల్వేస్టేషన్‌లో ఎక్కడచూసినా కౌంటర్ దగ్గర పెద్ద క్యూ లైన్ ఉంటుంది. సరిపోనన్ని కౌంటర్లు ఉండవు. అక్కడ కొంతమందికే ముందుగా టికెట్స్ దొరుకుతాయి. జనాలను కంట్రోల్ చేసేందుకు రైల్వే పోలీసులు ఉండరు. మరి స్త్రీల పరిస్థితి చెప్పనలవి కాదు. స్టేషన్లలో అద్భుతమైన సౌకర్యాలను చదవడానికి బాగుంటాయి. ఉన్నోడు గొంతు తడుపుకోడానికి బాటిల్ నీరు కొనుక్కుంటాడు. సామాన్యునికి తాగునీరు నల్లాలుంటాయి. మంచిదే ! కానీ వచ్చే నీరు మంచిదో, కాదో? మనకంటే తాగినవారికి బాగా తెలుస్తుంది! చల్లని నీరు సౌకర్యం కల్పించాం కదా? అని కొంత మంది వాదించవచ్చు. అందరికీ ఇవి సరి పోతాయా? పొట్ట నింపుకోడానికి ఏది కొందామన్నా స్పెషల్ ధరలు. ఒకవేళ అడిగితే కొంటే కొను! లేకపోతే పో! అనే చూపులని మనం చూడడమే తప్ప ఏమీ చేయలేము. ఎవరికి చెప్పాలి? అంత తీరుబాటు ఉంటుందా? ప్లాట్‌ఫామ్ మీద కొన్నిసార్లు పులిసిపోయిన , పాడైపోయిన ఆహారం అమ్ముతారు. తినాల్సిందే తప్పదు! ఆకలికి ఏదో ఒకటి తినాలి కదా! ధరలు మాత్రం చాలా ఫ్రెష్‌గా ఉంటాయి. మూత్రానికి వెళ్లాలన్నా ' పే అండ్ యూజ్ ' అనే బోర్డులు కనిపిస్తాయి. దీనర్థం తెలియని సాధారణ ప్రయాణికునికి అక్కడికి వెళ్లేవరకూ వరకూ తెలియదు. దీనికి కూడా రుసుము చెల్లించాలా? అని! ఉచిత మూత్రశాలల గురించి చెప్పనవసరం లేదు! చెప్పనలవి కాదు ! అందుకే చాలా మంది బహిరంగ మల మూత్ర విసర్జన చేస్తారు.కొన్ని స్టేషన్లలో రైలు బండి వచ్చే ముందు మాత్రమే అనౌన్స్ చేస్తారు. బోగీ సంఖ్యని ప్రదర్శించే బోర్డు ఉండదు. బోగీ ఎక్కడ ఆగుతుందో తెలియదు. జనరల్ బోగీ కోసం సామాన్యుడు పరుగులు పెట్టాల్సిందే. తప్పదు! ఎందుకంటే సామాన్యుడు పేదవాడు కదా! ఇటువంటి పరిస్థితుల్లో కొన్నిసార్లు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇలా బండి తప్పిపోయిన వారెందరో? ఈ పరుగు పందెంలో ఒక్కోసారి చనిపోయిన సందర్భాలూ లేకపోలేదు. సామాన్యుని వెతలు తీరాలంటే పాలకులు కూడా వారి స్థానంలో ఉండి ఆలోచించాలి. అప్పుడే సమస్యలకు కొంతైనా పరిష్కారం ఉంటుంది.

- జనక మోహన రావు దుంగ,
8247045230

వి.రాంభూపాల్

ఆర్థిక సంక్షోభం-ఐఐటిల్లో ఉపాధి తగ్గుముఖం

దేశంలోని 23 ఐఐటిల్లో క్యాంపస్ సెలక్షన్లు తగ్గడంపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తాజా నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. ఐఐటి, ఎన్ఐటి, ట్రిపుల్ ఐటిల్లోనూ ప్లేస్‌మెంట్లు గణనీయంగా తగ్గాయని ఈ నివేదిక తెలిపింది. 2021-22లో 98.54 శాతం ఉన్న ప్లేస్‌మెంట్లు 2023-24 నాటికి 79.88 శాతానికి తగ్గాయి. ఇందులో దేశ రాజధాని ఢిల్లీ ఐఐటి లో 15 శాతం, ఆర్థిక రాజధాని ముంబయిలో 12.72, మద్రాసులో 12.42, కాన్పూర్‌లో 11.15 శాతం మేర తగ్గిపోవడం తీవ్ర ఆందోళనకరమని నివేదిక అభిప్రాయపడింది. ఈ పరిస్థితి కొత్తగా స్థాపించిన ఐఐటిలకే పరిమితం కాలేదని, 2015కు ముందు నుండి వున్న వాటిల్లో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతున్నదని ప్రకటించింది. పరిస్థితిని వివరించిన స్టాండింగ్ కమిటీ ఇది సాధారణమేనంటూ, ఈ క్షీణతను నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం తగిన శ్రద్ధ పెట్టాలంటూ సూచనలతో సరిపుచ్చింది. దేశంలో అత్యున్నత సాంకేతిక విద్యాలయాలుగా వున్న ఐఐటి, ఎన్ఐటిలలో చదువుకున్న వారికే ఉద్యోగాలు రాకపోతే ఇతర ఇంజనీరింగ్ విద్యార్థుల పరిస్థితి ఏమిటి? ఈ పరిస్థితులకు కారణాలేమిటి? యువతకు ఉపాధి చూపే పరిష్కారాలు ఏమిటని కేంద్ర పాలకులు ఆలోచించడంలేదు. మరోవైపు ఐటి రంగంలో కొత్త కంపెనీలు రావడంలేదని, ఉన్నవే మూత పడుతున్నాయని సేవా రంగాల రేటింగ్ సంస్థ క్రిసిల్ తాజా నివేదిక ప్రకటించింది. ప్లేస్‌మెంట్లు ఎందుకు లేవు? అంటే ఐటి రంగంలో ఉపాధి అవకాశాలు తగ్గడం. అవి ఎందుకు తగ్గాయంటే యూరప్, అమెరికాతోపాటు మన దేశ ఆర్థిక వ్యవస్థల సంక్షోభం కారణం. సంక్షోభం ఎందుకు వచ్చిందంటే ప్రజల కొనుగోలు శక్తి తగ్గడం, దీనికి మూలం అత్యధికమంది ఆధారపడిన వ్యవసాయం దివాళా తీయడం. లక్షల మందికి ఉపాధినిచ్చిన ప్రభుత్వరంగాన్ని ప్రైవేటీకరించడం, కొత్త పరిశ్రమలను స్థాపించకపోవడం, దేశీయ చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించకుండా అదానీ, అంబానీలను పెంచి పోషించడం. వీటి ఫలితంగా కోట్లాది యువత నిరుద్యోగంలో కూరుకుపోతుంటే, అతి కొద్దిమంది అత్యంత సంపన్న బిలియనీర్లుగా ఎదుగుతున్నారు. ఈ వాస్తవాలను ప్రజలు గుర్తించకుండా ఉండేందుకు మొన్నటి వరకు మహా కుంభమేళా, తాజాగా అమెరికా అధ్యక్షుడు మోడీని పొగిడిన వార్తలతో మీడియా హోరెత్తిస్తున్నది.

ఇంజనీరింగ్ క్రేజ్

1991 తర్వాత అనుసరించిన ప్రపంచీకరణ విధానాల్లో భాగంగా ఇంజనీరింగ్ విద్యకు కొత్త క్రేజ్ వచ్చింది. ఇంజనీరింగ్ పూర్తయితే చాలు, ఐటి రంగంలో ఉద్యోగం, లక్షల వేతనం గ్యారంటీ అనే ప్రచారం పెద్ద ఎత్తున సాగింది. దీంతో ఇంజనీరింగ్ కోర్సులో చేరుతున్న విద్యార్థుల్లో అత్యధికమంది కొన్నేళ్ళుగా కంప్యూటర్స్, డేటా సైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వంటి విభాగాల్లో చదవడం పెరిగింది. రెండేళ్లుగా కంప్యూటర్ సైన్స్‌లో 85 శాతం పైగా సీట్లు భర్తీ అవుతుంటే, మెకానికల్‌లో 40-45 శాతం, సివిల్‌లో 25-30 శాతం సీట్లు కూడా భర్తీ కావడంలేదు. సాంకేతిక రంగంలో పరిశోధనలు గణనీయంగా తగ్గాయి. గత రెండు దశాబ్దాలుగా మన దక్షిణాది రాష్ట్రాల్లో ఇంజనీరింగ్ విద్య అనేది ఒక దర్జాగా మారింది. 2022 నాటికి దేశవ్యాప్తంగా 12,47,667 బీటెక్ సీట్లు ఉంటే దక్షిణాది రాష్ట్రాల్లోనే 6,74,697 సీట్లు ఉన్నాయి. ఎంసీఏలో 70,065 సీట్లు వుంటే 30,812, ఎంబిఏ, పిజిడిఎం లాంటి మేనేజ్‌మెంట్ కోర్సులకు సంబంధించిన కోర్సుల్లో కూడా ఎక్కువ భాగం దక్షిణాది రాష్ట్రాల్లోనే వున్నాయి. అందులో కూడా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల్లో అత్యధిక భాగం వున్నాయి. గత ఐదేండ్లుగా సంవత్సరానికి సగటున 4 లక్షల మంది విదేశీ విద్యకు వెలుతుంటే అందులో దక్షిణాది రాష్ట్రాల నుండి 2.8 లక్షల మంది ఉన్నారని ఏఐసిటిఇ (అఖిల భారత సాంకేతిక విద్యా మండలి) అధ్యయనంలో తేలింది.

ఐటి రంగంలో కొలువుల కొరత

ఐటిలో తమ పిల్లల భవిష్యత్ బాగుటుందనే ఆశతో లక్షల రూపాయలు ఖర్చు చేసి తల్లిదండ్రులు, తీవ్ర ఒత్తిళ్లతో పిల్లలు కష్టపడుతున్నారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థ ఆభరణంగా పిలవబడిన ఐటి రంగం మన దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకంగా మారింది. 2004లో ఆరు లక్షల మంది సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగాలు పొందుతుంటే నేడు సుమారు పది లక్షలకు పైగా పెరిగింది. ఈ రంగం నుండి దేశ ఆర్థిక వ్యవస్థకు 1990లో 197 మిలియన్ల ఆదాయం రాగా, 2020 నాటికి 8వేల మిలియన్లకు పెరిగింది. 2025 ఆర్థిక సంవత్సరంలో దేశ జీడీపీలో సేవా రంగం వాటా 55 శాతం వుంటుందని పాలకులు అంచనా వేశారు. అయితే గత మూడేండ్లనుండి ఈ రంగం తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటున్నది. ప్రపంచ ఐటి అవుట్ సోర్సింగ్‌లో మన దేశం కీలక స్థానంలో వుందని ఇన్నాళ్లూ గొప్పగా చెప్పుకున్నాం. మొదట్లో ఐటి రంగం కాల్ సెంటర్లకే పరిమితమైంది. క్రమంగా ఆరోగ్య సంరక్షణ, విద్య, రియల్ ఎస్టేట్, ప్రొఫెషనల్ సర్వీసులు, ఫైనాన్స్, వినోదం ఇలా అనేక రంగాలకు ఈ సేవలు విస్తరించాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో కేవలం 6-8 శాతం మాత్రమే ఐటి రంగం వృద్ధి అయ్యే అవకాశం వుందని సేవ రంగాల రేటింగ్ సంస్థ క్రిసిల్ తాజాగా అంచనా వేసింది. గత ఐదేండ్లల్లో కొత్తగా స్థాపించబడిన ఐటి కంపెనీల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుందని కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తాజాగా పార్లమెంట్‌లో ప్రకటించింది.



> ప్రపంచంలో ఉత్పత్తి అయ్యే సంపదలో కార్మికుల వాటా పెద్ద ఎత్తున తగ్గింది. ప్రపంచ జనాభాలో 300 కోట్ల మంది దారిద్ర్యరేఖ కంటే దిగువన జీవిస్తున్నారు. మన దేశంలో వ్యవసాయం, తయారీ రంగాలు గత రెండు దశాబ్దాలుగా సంక్షోభంలో వున్నాయి. పెద్దనోట్ల రద్దు, కోవిడ్ చిన్న, మధ్యతరహా పరిశ్రమలను తీవ్రంగా దెబ్బతీశాయి. పదకొండు సంవత్సరాలుగా దేశాన్ని పాలిస్తున్న బీజేపీ దగ్గర ఈ పరిస్థితులను ఎదుర్కోవడానికి అవసరమైన ఆర్థిక ప్రణాళిక లేదు. మతాన్ని, రాజకీయాలను మిళితం చేసి ప్రజల ఐక్యతను చీల్చి అధికారంలో కొనసాగడం, అధికార బలంతో కార్పొరేట్ శక్తులకు దేశాన్ని దోచిపెట్టడం వారి విధానంగా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్నత విద్యావంతులు వాస్తవాల్ని గుర్తించడం ముఖ్యం.

2020లో 16,338 ఐటి కంపెనీలు వుంటే 2025 నాటికి 2,419 కి అంటే 90 శాతానికి తగ్గడం దేశీయ ఐటి రంగం పట్ల ఆశలతో వున్న కోట్లాది యువతను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నది. తాజాగా లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన లెక్కల ఆధారంగా కార్పొరేట్ దగ్గిజాలుగా పిలవబడుతున్న ఇన్ఫోసిస్, విప్రో వంటి కంపెనీలకు కేంద్రంగా వున్న బెంగళూరులో కొత్త ఐటి కంపెనీలు రావడంలేదు. కర్నాటకలో 2020లో కొత్త ఐటి కంపెనీలు 2,544 స్థాపించగా, 2025 మార్చి నాటికి 212కు, మహారాష్ట్రలో 2,483 నుండి 375కు, తెలంగాణలో 2,077 నుండి 233 తగ్గాయని మంత్రితత్వశాఖ నివేదిక తెలిపింది. ఇది కేవలం కొన్ని రాష్ట్రాలకే పరిమితం కాలేదని, దేశమంతటా ఇదే పరిస్థితి కొనసాగుతున్నదని ప్రకటించింది. కొత్త సంస్థలు రాకపోగా వున్నవి మూత పడడం ఈ రంగాన్ని మరింత కలవరపరస్తున్నది. ఈ ఆర్థిక సంవత్సరంలో 2,300 కంపెనీలు మూతపడ్డాయి. వీటిలో మహారాష్ట్రలో 459, కర్నాటకలో 440 మూతపడడం ఈ రంగంలో వున్న సంక్షోభానికి పరాకాష్ట. 2023 ఆర్థిక సంవత్సరంలో 2.40 లక్షల మందికి ఐటి రంగం ఉపాధి కల్పించగా, 2024 నాటికి ఇందులో 40 శాతం అంటే లక్ష మందికి కూడా ఉపాధి అవకాశాలు కల్పించలేకపోయింది. దేశంలోని ఐదు పెద్ద ఐటి కంపెనీల్లో 21,838 మంది ఉద్యోగాలను కోల్పోయినట్లు మంత్రతత్వ శాఖ నివేదిక తెలిపింది. ఐటి ఉద్యోగాలు తగ్గడమంటే దానితో ముడిపడిన ఈ అన్ని రంగాలు కష్టాల్లో వున్నట్లే. అందుకే క్యాంపస్ నియామకాలు తగ్గిపోతున్నాయి. ఎంపికైన వారికి సంవత్సరాలుగా ఉద్యోగాలు ఇవ్వడంలేదు. పనిలో వున్నవారికి వేతనాల పెంపుదల నామమాత్రంగా జరుగుతున్నది. ఇదిలా వుండగా 18 గంటల పనిదినం కావాలని, ఆదివారం శెలవు ఎందుకని ఐటి యాజమాన్యాలు బహిరంగంగానే ప్రకటిస్తున్నాయి. దీంతో ఐటి ఉద్యోగుల్లో ఆందోళన పెరిగింది. ఇటీవల బెంగళూరులో వేలాది టెకీలు రోడ్డు మీదకొచ్చి 'మేము బానిసలం కాదు, మాకు కుటుంబాలు వున్నాయి' అని గర్జించారు.

ఈ పరిస్థితికి కారణాలు

2025లో ప్రపంచ ఆర్థికాభివఅద్ధి రేటు 3.2 శాతానికి మించి వుండదని, అభివృద్ధి చెందిన యూరప్ దేశాలతో పాటు, అమెరికా 1 నుండి 1.78 శాతానికి మించి అభివృద్ధి సాధించలేవని ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకు అంచనా వేశాయి. 46 దేశాల అభివృద్ధి మరింత కనిష్టంగా వుంది. 2023లో ప్రపంచవ్యాప్తంగా 13 శాతం మంది యువజనులు అంటే 6 కోట్ల 49 లక్షల మంది నిరుద్యోగులుగా ఉన్నారు. ప్రపంచంలో ఉత్పత్తి అయ్యే సంపదలో కార్మికుల వాటా పెద్ద ఎత్తున తగ్గింది. ప్రపంచ జనాభాలో 300 కోట్ల మంది దారిద్ర్యరేఖ కంటే దిగువన జీవిస్తున్నారు. మన దేశంలో వ్యవసాయం, తయారీ రంగాలు గత రెండు దశాబ్దాలుగా సంక్షోభంలో వున్నాయి. పెద్దనోట్ల రద్దు, కోవిడ్ చిన్న, మధ్యతరహా పరిశ్రమలను తీవ్రంగా దెబ్బతీశాయి. పదకొండు సంవత్సరాలుగా దేశాన్ని పాలిస్తున్న బీజేపీ దగ్గర ఈ పరిస్థితులను ఎదుర్కోవడానికి అవసరమైన ఆర్థిక ప్రణాళిక లేదు. మతాన్ని, రాజకీయాలను మిళితం చేసి ప్రజల ఐక్యతను చీల్చి అధికారంలో కొనసాగడం, అధికార బలంతో కార్పొరేట్ శక్తులకు దేశాన్ని దోచిపెట్టడం వారి విధానంగా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్నత విద్యావంతులు వాస్తవాల్ని గుర్తించడం ముఖ్యం.




[illegible]

తాత్కాలికంగా ఆశ్రయమిస్తాం

- పాలస్తీనియన్లకు సాయపడేందుకు ముందుకొచ్చిన ఇండోనేషియా

జకార్తా : గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న సుదీర్ఘ దాడుల కారణంగా నిర్వాసితులైన పాలస్తీనియన్లకు తాత్కాలికంగా ఆశ్రయం కల్పించడానికి సిద్ధంగా వున్నట్లు ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబొ సుబియాంటో బుధవారం చెప్పారు. గాయపడిన వారికి సాదరంగా ఆశ్రయం కల్పించడానికి తాము సిద్ధమని చెప్పారు. మధ్య ప్రాచ్య దేశాల్లో పర్యటనకు బయలుదేరుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. వారిని ఇక్కడకు తీసుకురావడానికి విమానాలు పంపేందుకు కూడా రడీగా వున్నామన్నారు. మొదటి దశలో వెయ్యి మందిని తీసుకురావచ్చని అంచనా వేసినట్లు చెప్పారు. గాయడిన వారికి, అనాధలైన చిన్నారులకు ముందుగా ప్రాధాన్యతనివ్వనున్నట్లు తెలిపారు. వారిని అక్కడ నుండి ఎలా తరలించాలనే విషయమై పాలస్తీనా అధికారులతో, అలాగే ఆ ప్రాంతంలోని ఇతర పక్షాలతో మాట్లాడాల్సిందిగా తమ విదేశాంగ మంత్రిని ఆదేశించానని చెప్పారు. వారు పూర్తిగా కోలుకునేవరకు ఇండోనేషియాలోనే వుంటారన్నారు. వారిని సురక్షితంగా తిరిగి పంపిస్తామన్నారు. గత నెల్లో ఇజ్రాయిల్ మిలటరీ దాడులను పునరుద్ధరించిన తర్వాత దాదాపు 4లక్షలమంది గాజావాసులు నిర్వాసితులయ్యారని ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. కాగా ప్రపంచంలోనే అత్యధికంగా ముస్లిం జనాభా కలిగిన ఇండోనేషియా ఇజ్రాయిల్, పాలస్తీనా ఘర్షణలకు రెండు దేశాల ఏర్పాటే పరిష్కారమని స్పష్టం చేస్తోంది.

గాజాలో 29మంది మృతి, 80మంది గల్లంతు

ఉత్తర గాజా ప్రాంతమైన షుజయె జిల్లాలో ఇజ్రాయిల్ మిలటరీ జరిపిన శక్తివంతమైన వైమానిక దాడుల్లో చిన్నారులతో సహా 29మంది పాలస్తీనియన్లు మరణించగా, 55మంది గాయపడ్డారు. మరో 80మంది గల్లంతయ్యారు. సీనియర్ హమాస్ నేతను లక్ష్యంగా చేసుకునే తాము ఈ దాడులు జరిపినట్లు ఆర్మీ ప్రకటించింది. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని నబ్లస్ ఏరియాలో ఇద్దరు పాలస్తీనియన్లను అదుపులోకి తీసుకోగా, బలాటా శరణార్ధ శిబిర ప్రవేశ ద్వారాన్ని దాదాపు 300కి పైగా మిలటరీ వాహనాలు చుట్టుముట్టాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇజ్రాయిల్ సైనికులు పాలస్తీనియన్ల ఇళ్ళలోకి చొరబడి దాడులు చేస్తూ, ఐదుగురిని అరెస్టు చేశారని వార్తలందాయి. బెత్లెహామ్‌కు పశ్చిమాన గల హుసాన్ గ్రామంపై దాడి చేసి డజన్ల సంఖ్యలో గ్రామస్తులను అదుపులోకి తీసుకుని సైన్యం ఇంటరాగేట్ చేస్తోంది.

వీడీసీలు.. ప్రజాస్వామ్యానికి విరుద్ధం

- రాజ్యాంగానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న వీడీసీలపై చర్యలు తీసుకోవాలి
- తాళ్లరాంపూర్ గీత కార్మికుల బహిష్కరణ అమానుషం : కేజీకేఎస్ రాష్ట్ర నాయకులు పెద్ది వెంకట్‌రాములు, రమేష్ గౌడ్



నవతెలంగాణ-ఏర్గట్ల

ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా గ్రామ అభివృద్ధి కమిటీ (వీడీసీ)లు నడుస్తున్నాయని, రాజ్యాంగానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న వీడీసీలపై చర్యలు తీసుకోవాలని కేజీకేఎస్ రాష్ట్ర నాయకులు పెద్ది వెంకట్ రాములు, రమేష్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్ గ్రామంలో గౌడ సంఘ సభ్యుల బహిష్కరణ ఆటవిక చర్య అన్నారు. బుధవారం వారు తాళ్లరాంపూర్‌లో గౌడ సంఘం సభ్యులను కలిసి మాట్లాడారు. వీడీసీ ఆంక్షల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గౌడ సామాజిక తరగతి మహిళలను వీడీసీ సభ్యులు కుంకుమార్చనలో పాల్గొననీయకుండా అవమానించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగానికి విరుద్ధంగా గ్రామకమిటీలు సమాంతర ప్రభుత్వ పాలన చేస్తున్నాయని అన్నారు. గ్రామాల్లో కల్లు గీసుకునే వారు, చిన్నా చితక వ్యాపారాలు చేసుకునే వారు గ్రామ కమిటీలకు ఎందుకు డబ్బులు కట్టాలి..? ప్రభుత్వానికి పన్నులు కడుతున్నాం కదా.. అవి సరిపోదా అని ప్రశ్నించారు. గౌడ సామాజిక తరగతి వారిని బహిష్కరించిన వీడీసీ సభ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు గౌడ సంఘ సభ్యులకు అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కోయేడి నర్సింహులుగౌడ్, శ్రీరామ్‌గౌడ్, శేఖర్‌గౌడ్, తాళరాంపూర్ గౌడ సంఘ సభ్యులు ఉన్నారు.



ఆర్జీయూకేటీలో తాత్కాలిక
అధ్యాపకుల నిరసన

- అదనపు బాధ్యతలకు రాజీనామా
- జీఓ 21ను రద్దు చేయాలని డిమాండ్

నవతెలంగాణ-భైంసా

ఆర్జీయూకేటీ బాసరలో తాత్కాలిక అధ్యాపకులు ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 21కి వ్యతిరేకంగా వారి అదనపు బాధ్యతలకు బుధవారం రాజీనామా చేశారు. ఈ మేరకు ఏఓ రణధీర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం పరిపాలన కార్యాలయం ముందర ప్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. కొన్ని సంవత్సరాలుగా విద్యార్థులకు చదువులు చెబుతూ, పరిపాలనా బాధ్యతలు కూడా నిర్వర్తిస్తూ విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. సేవలకు గుర్తింపు లేకపోవడమే కాకుండా క్రమబద్ధీకరణకు సంబంధించి ఎటువంటి నిర్ణయమూ తీసుకోకుండా ప్రభుత్వం నిర్ల క్ష్యం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జీఓ 21ను రద్దు చేసి, ముందుగా తమను క్రమబద్ధీకరించాలని, ఆ తర్వాత మిగిలిన ఖాళీల్లో నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలపై తక్షణమే స్పందించకపోతే ఆందోళన తీవ్రం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉపేందర్, కృష్ణప్రసాద్, శంకర్, దేవరాజ్, వినోద్, మందా సతీష్, విజయ్, శ్రీశైలం పాల్గొన్నారు.

జీవో తెచ్చిన తంటా

ప్రశ్నార్థకంగా ఉద్యోగ భద్రత

- ఆయుష్ విభాగంలోకి అల్లోపతి ఫార్మాసిస్టులా?
- 20 ఏండ్ల కాంట్రాక్టు ఉద్యోగుల్లో ఆందోళన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర వైద్యారోగ్యశాఖ జారీ చేసిన ఒక జీవో ఇప్పటికే కాంట్రాక్టు ప్రాతిపదికన ఉద్యోగాలు చేస్తున్న వారిని ఆందోళనకు గురి చేస్తున్నది. ఆయుష్ విభాగంలో ఫార్మాసిస్టుల పోస్టుల అర్హతను నిర్ణయిస్తూ మార్చి 28న వైద్యారోగ్యశాఖ జీవో నెంబర్ 65ను జారీ చేసింది. దీంతో ఆయుష్ విభాగంలో ఉన్న ఫార్మసిస్టు ఖాళీలకు అల్లోపతిలో డి.ఫార్మసీ, బి.ఫార్మసీ, ఫార్మా డి కోర్సులు చేసిన అర్హత లభిస్తున్నది. అవసరమైతే వీరికి ఎంపికైన తర్వాత ఆయుర్వేద, యునానీ, హెూమియోలో ఆరు నెలల సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఫార్మసీని ఒక సంవత్సరంలోపు మూడు ప్రయత్నాల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ నిర్ణయంతో ఇప్పటికే ఆయుష్ విభాగంలో కాంపౌండర్లు (ఫార్మాసిస్టులు)గా పని చేస్తున్న 337 మంది కాంట్రాక్ట్ ఉద్యోగాలు ఉద్యోగ భద్రత ప్రశ్నార్థంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆయుష్ విభాగంలో 520 మంజూరైన పోస్టులుండగా 308 ఖాళీలుండగా, 62 మంది రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్ ప్రాతపదికన పని చేస్తున్నారు. 2005 సంవత్సరంలో ఈ 62 మంది ఆయుష్ కాంపౌండర్లు కాంట్రాక్ట్ ప్రాతపదికన కాంపౌండర్ సర్వీస్ రూల్స్‌కు అనుగుణంగా 10వ తరగతి అర్హతతో తీసుకున్నారు. ఆ తర్వాత సవరించిన ఇంటర్మీడియట్ విద్యార్హతతో ట్రెజరీ ద్వారా వేతనాలు పొందుతున్నారు. ఒక సంవత్సరం ఇన్ సర్వీస్ ట్రైనింగ్ (ఆయుర్వేద, హెూమియో, యునాని) సర్టిఫికెట్ తో 20 ఏళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్నారు. 2017లో గత బీఆర్ఎస్ సర్కారు కాంపౌండర్ పేరును ఫార్మసిస్టుగా మార్చి, ఈ పోస్టుకు 2 సంవత్సరాల ఆయుష్ డిప్లొమా ఫార్మసీ కోర్స్ (ఆయుర్వేద, హెూమియో, యునానీ)గా నిర్ణయిస్తూ జీ.వో.నెంబర్ 147ను విడుదల చేసింది. అయితే జీవోకు అనుగుణంగా 2017 నుంచి 2025 వరకు రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల్లో ఈ కోర్సును ప్రవేశపెట్టకపోవడంతో అభ్యర్థులకు ఈ కోర్సును చేసే అవకాశం అందుబాటులోకి రాలేదు. ఈ కోర్సును ప్రవేశపెట్టాలని పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. వీరితో పాటు మరో 275 మంది నేషనల్ హెల్త్ మిషన్ కింద 2008 లో నియమితులై కాంట్రాక్ట్ ప్రాతిపదికన పని చేస్తున్నారు. వీరిలో 62 మంది ఉద్యోగాలు వెంటనే ప్రమాదంలో పడనుండగా, మిగిలిన 275 మంది సర్వీసులు కూడా భవిష్యత్తులో ఇబ్బందుల్లో పడే ప్రమాదముందని ఆందోళన వ్యక్తమవుతున్నది.

ఈ నేపథ్యంలో తాజాగా ఆయుష్ విభాగంలో ఉన్న ఫార్మసిస్ట్ పోస్టులకు అల్లోపతి ఫార్మసి కోర్సులు చేసిన వారిని అర్హులుగా నిర్ణయించడం నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టం ఆఫ్ మెడిసిన్ (ఎన్‌సీఐఎస్ఎం) నిబంధనలకు విరుద్ధమనే వాదన వినపిస్తున్నది. దీంతో 20 ఏళ్లుగా సేవలందిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగాలు ఇతర ఉద్యోగాలకు అర్హత లేక, వయో పరిమితి కూడా దాటిపోయిన దశలో ఉన్న ఉద్యోగాలు కోల్పోవడమే కాకుండా కొత్తగా వేసే నోటిఫికేషన్ ప్రకారం అర్హత లేకపోవడంతో పరీక్ష కూడా రాయలేని పరిస్థితిలోకి నెట్టబడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ బాధను అర్థం చేసుకుని తమకే ఇన్ సర్వీస్ శిక్షణ ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ప్రజలను లూటీ చేయడానికే
గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరల పెంపు

నేడు రాష్ట్ర వ్యాప్త నిరసనలు : సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పేద ప్రజలను లూటీ చేయడానికే కేంద్ర ప్రభుత్వం గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచిందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ తీరును ఎండగడుతూ గురువారం రాష్ట్ర వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలను తగులబెట్టాలనీ, వివిధ రూపాల్లో నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. బుధవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే జీఎస్టీపేరుతో ప్రజల జేబులను గుల్ల చేస్తున్న కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై రూ.50, పెట్రోల్, డీజిల్‌పై రూ.2 పెంచడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. మోడీ, షాలు కలిస్తే మోసాలు చేయడమే అని విమర్శించారు. దేశవనరులను కార్పొరేట్లకు కట్టబెడుతూనే మరోవైపు రాయితీలు ఇవ్వడం దారుణమని పేర్కొన్నారు. మోసపూరిత విధానాలను కప్పిపుచ్చుకునేందుకే మతోన్మాదులను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. అంతర్జాతీయంగా ముడి చమురు బ్యారెల్ ధర తగ్గుతుంటే మన దేశంలో మాత్రం రేట్లు పెంచడం దుర్మార్గమని పేర్కొన్నారు.

వడదెబ్బతో వ్యవసాయ కూలీ మృతి



(ఫైల్)

నవతెలంగాణ-పరకాల

పరకాల మున్సిపాలిటీలోని సీతారాంపురానికి చెందిన కుసుంబ మోతేరావు(50) రోజువారీ కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించే వాడు. మంగళవారం పనికి వెళ్లి వడదెబ్బకు గురయ్యాడు. అనంతరం మృతిచెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ సలహాదారు కేకేకు తెలంగాణ ఉద్యోగ జేఏసీ వినతి

ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఉద్యోగ జేఏసీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు జేఏసీ చైర్మెన్ వి.లచ్చిరెడ్డి నేతృత్వంలో బుధవారం ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావును కలిసి వినతి పత్రం అందించారు. ఉద్యోగుల కార్పొరేట్ ఆస్పత్రుల్లో నగదు రహిత చికిత్స అందించాలనీ, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులపై సీలింగ్ పెంచడంతో పాటు వెంటనే క్లియర్ చేయాలనీ, ప్రయివేట్ ఆస్పత్రుల్లో ప్రస్తుతమున్న ధరల ప్రకారం చికిత్స అందించాలనీ, ఇ-కుబేర్ ద్వారా ప్రాధాన్యతా ప్రాతిపదికన గ్రీన్ ఛానెల్ ద్వారా రూ.10 లక్షల వరకు బిల్లులు చెల్లించాలని కోరారు. సాధారణ బదిలీలు ప్రతి సంవత్సరం ఏప్రిల్, మే నెలలో చేపట్టాలనే మొదలగు 37 డిమాండ్లను ప్రభుత్వం ముందుంచామని లచ్చిరెడ్డి తెలిపారు. జేఏసీ వినతిపై సానుకూలంగా స్పందించిన కేశవరావు ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై త్వరలోనే నిర్వహించనున్న క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. అంతకు ముందు జీఏడీ (పొలిటికల్) ముఖ్యకార్యదర్శి రఘునందన్ రావును కలిసి ఉద్యోగుల సమస్యలపై వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.రామకృష్ణ, టీపీయూఎస్ ప్రెసిడెంట్ హన్మంత్ రావు, తెలంగాణ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు దర్శన్ గౌడ్, టీఈఏ అధ్యక్షులు డా.జి.నిర్మల, టీజీటీఏ ప్రధాన కార్యదర్శి రమేష్ పాక, ఎస్టీటీయూ అధ్యక్షులు మహిపాల్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కత్తి జనార్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

టన్నెల్‌లో లోకో ట్రైన్ ట్రాక్ పునరుద్ధరణ

పరిశీలిస్తున్న అధికారులు




నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ లోపల ప్రమాద ప్రాంతం సమీపానికి లోక్ ట్రైన్ ట్రాక్ పునరుద్ధరణ పూర్తయింది. ఆ ప్రాంతాన్ని అధికారులు పరిశీలించారు. టన్నెల్ ఆఫీస్ వద్ద బుధవారం సహాయక బృందాల ఉన్నతాధికారులతో ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి సమీక్ష నిర్వహించారు. టన్నెల్ లోపల కొనసాగుతున్న సహాయక చర్యలు ముమ్మరం చేసినట్లు, సొరంగం లోపల మట్టి తవ్వకాలకు అనుగుణంగా లోకో ట్రైన్ ట్రాక్‌ను పునరుద్ధరించినట్టు, మట్టి తవ్వకాలు, స్టీల్ కత్తిరింపు పనులు, డీ వాటరింగ్ ప్రక్రియ సమాంతరంగా కొనసాగుతున్నట్టు ప్రత్యేక అధికారి వివరించారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రాక్ మైన్స్ సీనియర్ శాస్త్రవేత్త జీసీ నవీన్, నీటిపారుదల శాఖ డీఈ శ్రీనివాసులు, కంపెనీ సీనియర్ ఇంజినీర్ సంజయ్ కుమార్ సింగ్ ప్రమాద ప్రదేశంలో పరిస్థితులను పరిశీలించినట్టు తెలిపారు. మట్టి తవ్వకాలకు అనుగుణంగా కన్వేయర్ బెల్ట్ వెంటిలేషన్ ప్రక్రియ ముందుకు కొనసాగిస్తున్నట్టు, నిరంతరం సహాయక చర్యలు చేపడుతున్నట్టు ప్రత్యేక వివరించారు. ఈ సమావేశంలో ఆర్మీ అధికారులు, జేపీ కంపెనీ ప్రతినిధులు, ఎస్‌డీఆర్ఎఫ్ అధికారి గిరిధర్‌రెడ్డి, సింగరేణి మైన్స్ రెస్క్యూ అధికారులు, హైడ్రా అధికారి, దక్షిణ మధ్య రైల్వే అధికారి తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ విద్యతో శ్రేష్టమైన విద్యావకాశాలు

ఇంటర్ విద్య డైరెక్టర్ కృష్ణ ఆదిత్య



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డిజిటల్ విద్యా కార్యక్రమాలతో శ్రేష్టమైన విద్యావకాశాలు మెరుగవుతాయని ఇంటర్మీడియట్ విద్యాశాఖ డైరెక్టర్ కృష్ణ ఆదిత్య తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని ఇంటర్మీ డియట్ కార్యాలయంలో కమ్యూనికే షన్, ఇంటర్వ్యూ స్కిల్స్‌పై ప్రాజెక్ట్ సర్వ్ తొలి ఆన్‌లైన్ సెషన్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ అధ్యాపకుల కొరత, నైపుణ్యాల్లో లోపాలు, డ్రాప్ అవుట్ రేట్లు వంటి ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా డిజిటల్ విద్యా కార్యక్రమం తొలి దశలో పైలట్ కార్యక్రమంగా నాంపల్లి గవర్నమెంట్ వృత్తి జూనియర్ కాలేజ్, చంచల్‌గూడ గవర్నమెంట్ జూనియర్ కాలేజీల్లో డిజిటల్ తరగతులను ప్రారంభించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా నిరంతర విద్యా అవకాశాలను అందించేందుకు పరిమిత విద్యా సిబ్బంది ఉన్న కాలేజీలకు భాగస్వామ్య డిజిటల్ ప్లాట్‌ఫారమ్ ద్వారా పాఠాలు ప్రసారమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో కమ్యూనికేషన్ స్కిల్ నిపుణులు వరప్రసాద్ సమర్థవంతమైన కమ్యూనికేషన్, ఇంటర్వ్యూ స్కిల్స్‌పై పాఠాలు అందించారు.

భద్రాచలం రోడ్ రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి


- అమృత్ భారత్ స్టేషన్ పథకం ద్వారా రూ.25.41 కోట్ల వ్యయం
- వేగంగా కొనసాగుతున్న పనులు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

భద్రాచలం రోడ్ రైల్వేస్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్ స్కీం ద్వారా రూ.25.41 కోట్ల వ్యయంతో పునరాభివృద్ధి పనుల్ని చేపడుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. తెలంగాణలో ఈ పథకం ద్వారా రూ.2,737 కోట్ల అంచనా వ్యయంతో 40 రైల్వే స్టేషన్లను ఆధునీకరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామనీ, వాటిలో కొన్ని స్టేషన్ల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. దానిలో భాగంగానే సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పనుల్ని ప్రపంచస్థాయి ప్రమాణాలతో పునరాభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం రోడ్ రైల్వేస్టేషన్‌కు గొప్ప చరిత్ర ఉన్నదనీ, దీనికి సమీపంలోని గనుల నుంచి వివిధ ప్రాంతాలకు బొగ్గు రవాణా జరుగుతుందని వివరించారు. అలాగే హైదరాబాద్, విజయవాడ, వరంగల్ సహా పలు ప్రధాన నగరాలను కలుపుతూ కీలకమైన రవాణా కేంద్రంగా అభివృద్ధి చెందిందని తెలిపారు. భద్రాచలంలోని ప్రసిద్ధ శ్రీ రామచంద్రస్వామి ఆలయానికి ప్రవేశ ద్వారంగా ఉంటూ, ఏటా లక్షలాదిమంది యాత్రికులు, పర్యాటకులను ఆకర్షిస్తుందని పేర్కొన్నారు. ఇటీవలే ఈ లైన్లో విద్యుదీకరణ పనులు పూర్తిఅయ్యాయనీ, భద్రాచలం రోడ్ - సత్తుపల్లి మధ్య కొత్త రైల్వే లైన్‌ను సింగరేణి కాలరీస్‌తో కలిసి నిర్మాణం చేశామనితెలిపారు. ఉన్నాయి. ప్రస్తుతం రూ.25.41 కోట్ల అంచనా వ్యయంతో వెయిటింగ్ రూములు, ఎస్కలేటర్, లిఫ్ట్‌తో పాటు మెరుగైన ప్రయాణీకుల సౌకర్యాలతో ఆధునీకరిస్తున్నామన్నారు. నాన్-సబర్బన్ గ్రేడ్-4 (ఎన్ఎస్‌జి-4)గా వర్గీకరించబడిన భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్ సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోకి వస్తుందని పేర్కొన్నారు. డోర్నకల్-మణుగూరు సెక్షన్‌లో ఈ స్టేషన్ రూ.7.61 కోట్ల వార్షిక ఆదాయంతో, సగటున రోజుకు 8,020 మంది ప్రయాణీకుల రాకపోకలతో సేవలను అందిస్తున్నదని వివరించారు. 12 మీటర్ల వెడల్పుతో పాదచారుల వంతెన (ఫుట్ ఓవర్ బ్రిడ్జి), లిఫ్ట్, ఎస్కలేటర్, వెయిటింగ్ హాల్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే ప్లాట్‌ఫామ్ ఎత్తును కూడా పెంచుతున్నామనీ, బయో టాయిలెట్లు, దివ్యాంగుల కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 45 శాతం పనులు పూర్తయ్యాయనీ, త్వరలోనే వందశాతం పనుల్ని పూర్తిచేసి, ప్రయాణీకులకు అందుబాటులోకి తెస్తామన్నారు.

అనంతకృష్ణన్ మృతికి సీఎం సంతాపం



(ఫైల్)

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తండ్రి, తమిళనాడు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, సాహితీవేత్త హరికృష్ణన్ నాడార్ అనంతకృష్ణన్ మరణం పట్ల ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. గాంధీ మహాత్ముడి సిద్ధాంతాలను పుణికిపుచ్చుకున్న అనంతకృష్ణన్ గొప్ప దేశ భక్తుడు, తమిళ భాషా ప్రేమికుడు అని కొనియాడారు. ఆయన మరణం బాధాకరమని సంతాపం తెలిపారు. అనంతకృష్ణన్ నాలుగుసార్లు శాసనసభకు, ఒకసారి పార్లమెంట్ సభ్యుడిగా సేవలు అందించారని గుర్తుచేశారు. తండ్రిని కోల్పోయి దుఃఖంలో ఉన్న మాజీ గవర్నర్ తమిళసైకి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

చిరుత దాడిలో ఆవు దూడ మత్యువాత

చిరుత సంచారంపై ఫిర్యాదు చేసినా పట్టించుకోని ఫారెస్ట్ అధికారులు



నవతెలంగాణ-హవేలీ ఘనపూర్

చిరుత దాడిలో నాలుగు నెలల ఆవు దూడ మృత్యువాతపడింది. ఈ ఘటన బుధవారం మెదక్ జిల్లా హవేలీ ఘనపూర్ మండల పరిధిలోని బ్యాతోల్ గ్రామంలో జరిగింది. ఆస రాజయ్య ఆవు దూడను పశువుల పాకలో కట్టేసి వెళ్లాడు. బుధవారం ఉదయం పాకలో నుంచి పశువులను బయటకు పంపిద్దామని చూసేసరికి ఆవు దూడ చనిపోయి కనిపించింది. సమాచారం తెలుసుకున్న ఫారెస్ట్ అధికారులు చిరుత పులి దాడిలో ఘటనాస్థలాన్ని పరిశీలించారు. పులి సంచారం చేస్తుందని ఫారెస్ట్ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోయారు.

159 మంది నకిలీ డాక్టర్లపై
కేసులు నమోదు : డీసీఏ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో చట్టవిరుద్ధంగా ఔషధాలను నిల్వ ఉంచి, విక్రయిస్తున్న 159 మంది నకిలీ వైద్యులపై జనవరి నుంచి కేసులు నమోదు చేసినట్టు డ్రగ్ కంట్రోల్ అథారిటీ (డీసీఏ) తెలిపింది. ఈ మేరకు బుధవారం డీసీఏ డైరెక్టర్ జనరల్ వీ.బీ.కమలాసన్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. తాజాగా విశ్వసనీయ సమాచారం మేరకు ములుగు జిల్లా తాడ్వాయి మండలం, మేడారం గ్రామం హరిత కాకతీయ హెూటల్ సమీపంలో అవసరమైన అర్హత లేకుండా మెడికల్ ప్రాక్టీస్ చేస్తున్న నకిలీ వైద్యులు గడం మనోజ్ ప్రాంగణంపై డ్రగ్ కంట్రోల్ అధికారులు దాడులు చేశారు. ఈ దాడిలో యాంటీ బయాటిక్స్, స్టెరాయిడ్స్ తదితర 35 రకాల ఔషధాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.18 వేలు. అర్హత లేకుండా ఇష్టానుసారంగా స్టెరాయిడ్స్ వాడితే తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదముందని అధికారులు హెచ్చరించారు. నకిలీ వైద్యునిపై కేసు నమోదు చేశారు. చట్టవిరుద్ధంగా ఔషధాలు నిల్వ ఉంచుకోవడం, విక్రయించడం లాంటివి ప్రజలు గమనిస్తే పని రోజుల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య 1800 599 6969కు టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలని అధికారులు సూచించారు.



బస్సు కోసం రోడ్డెక్కిన మహిళలు

2 గంటల పాటు ధర్నా..

ఆర్టీసీ డీఎంతో మాట్లాడించిన ఎస్ఐ

నవతెలంగాణ-రామారెడ్డి

గ్రామానికి ఆర్టీసీ బస్సు ట్రిప్పులు తగ్గించడంతో ఇబ్బందులు పడుతున్నామని మహిళలు బస్సు కోసం రోడ్డెక్కారు. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం మద్దికుంట మర్రివద్ద గ్రామ మహిళా సంఘం, వీడీసీ ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేపట్టారు. గ్రామానికి పూర్తిస్థాయిలో ఆర్టీసీ బస్సులు నడపాలని సుమారు రెండు గంటలపాటు ధర్నా నిర్వహించారు. గ్రామానికి గతంలో ఆర్టీసీ బస్సులు 8 ట్రిప్పులు తిరిగేవని, కానీ ప్రస్తుతం టార్గెట్ రావటం లేదన్న సాకుతో పొద్దున, సాయంత్రం మాత్రమే బస్సులు నడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు బస్సు సౌకర్యం లేకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి గ్రామానికి పూర్తిస్థాయిలో బస్సులు నడిపించాలని కోరారు. ఆందోళన సమాచారంతో ఎస్ఐ నరేష్ అక్కడికి చేరుకొని వారిని సముదాయించారు. ఆర్టీసీ డిఎంతో మాట్లాడి ధర్నా విరమింపజేశారు. గ్రామస్తులు కామారెడ్డి వెళ్లి ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

ఎమ్మెల్సీ ఎన్నిక బరిలో ఇద్దరే అభ్యర్థులు

ఎంఐఎం, బీజేపీ మధ్యే పోటీ

స్క్రూట్నీలో స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్ల తిరస్కరణ

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నిక ఉత్కంఠగా మారింది. నామినేషన్ ప్రక్రియ శుక్రవారంతో ముగిసిన విషయం తెలిసిందే. గత నెల 28 నుంచి ఈ నెల 4వరకు నామినేషన్లు జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంత్ స్వీకరించారు. బీజేపీ నుంచి ఎన్.గౌతమ్‌రావు, ఎంఐఎం నుంచి మీర్జా రియాజ్ ఉల్ అసన్ ఎఫెంది, స్వతంత్ర అభ్యర్థులు చంద్రశేఖర్ చాలిక, కంటే సాయన్న నామినేషన్ దాఖలు చేశారు. అయితే, స్క్రూట్నీలో ఇద్దరు స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురవ్వగా.. పోటీలో బీజేపీ, ఎంఐఎం అభ్యర్థులు మాత్రమే నిలిచారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పోటీకి దూరంగా ఉండటంతో బీజేపీ, ఎంఐఎం మధ్యే ఆసక్తికరమైన పోటీ నెలకొంది. ఈనెల 23న పోలింగ్, 25న కౌంటింగ్ జరగనున్నది. మొత్తం 110 మంది ఓటర్లు ఉండగా ఎంఐఎంకు 49, బీఆర్ఎస్‌కు 25, బీజేపీకి 22, కాంగ్రెస్‌కు 14 ఓట్లు ఉన్నాయి.

భూ కుంభకోణాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల హస్తం : ఎమ్మెల్యే పాయల్ శంకర్




నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో భూ కుంభకోణాల వెనుక ఉన్నవి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలేనని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆరోపించారు. బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తమ పాలనలోని అవినీతి, కుంభకోణాల వ్యవహారాల్లో సంబంధాలన్నీ బయటపడతాయేమోననే భయంతోనే వాటి నుంచి పక్కదారి పట్టించేందుకు కేటీఆర్ మాట్లాడుతున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, ధరణి పోర్టల్ ద్వారా భూ ఆక్రమణలు, ఫోన్‌ట్యాపింగ్ కేసుల విచారణలు ఏమయ్యాయని రేవంత్‌రెడ్డి సర్కార్‌ను ప్రశ్నించారు. హెచ్‌సీయూ భూములను కాపాడేందుకు విద్యార్థుల పక్షాన పోరాడుతామని చెప్పారు. నయీం కేసులో వేల కోట్ల రూపాయల ఆస్తులు ఎవరి చేతుల్లోకి మారాయి..? డాక్యుమెంట్లు ఎవరి చేతుల మీదుగా బదిలీ అయ్యాయి? అని ప్రశ్నించారు. బీజేపీపై ఆరోపణలు చేస్తున్న కేటీఆర్‌కు ధైర్యం ఉంటే ఆ వివరాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. లేకపోతే పరువునష్టం దావా ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. కాంగ్రెస్ 15 నెలల పాలన పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

బిజినెస్


అమెరికా స్వయంకృతాపరాధం

రఘురాం రాజన్ విమర్శ



డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాలు అమెరికా స్వియకృతాపరాదం (సెల్ఫ్‌గోల్)గా ఉన్నాయని ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ విమర్శించారు. నిరుద్యోగిత, ద్రవ్యోల్బణం తగ్గుముఖం పడుతున్న వేళ ఫెడ్ వడ్డీరేట్లు తగ్గించేందుకు అనువైన సమయంలో ట్రంప్ విధానాలు సొంత ఆర్థిక వ్యవస్థనే పట్టాలు తప్పించేలా ఉన్నాయన్నారు. అమెరికాకు ఎగుమతులు చేయడంపై ఆధారపడిన వియత్నాం వంటి దేశాలు ఈ నిర్ణయాలతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాయరన్నారు. ప్రస్తుతం అమెరికా-చైనా మధ్య జరుగుతున్న వాణిజ్య యుద్ధం భారత్‌కు మంచి అవకాశాలు సృష్టిస్తుందన్నారు. టారిఫ్‌లు ఇలానే కొనసాగితే ప్రపంచంలో ఆర్థిక మాంద్యం ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ పరిస్థితులను అవకాశాలుగా భావించి భారత్ నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈ సమయంలో భారత్ సరైన నిర్ణయాలు తీసుకొంటే లబ్ధి పొందుతుందన్నారు. తూర్పు, ఉత్తర దేశాలతో పాటు చైనా, జపాన్ వంటి దేశాలతో వాణిజ్య సంబంధాలు బలోపేతం చేసుకోవాలన్నారు. చైనాతో సమన్వయంగా వ్యవహరించి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

బడ్జెట్‌లో పోకో నుంచి పోకో సి71




నవ తెలంగాణ - హైదరాబాద్

స్మార్ట్ ఫోన్ ఉత్పత్తుల కంపెనీ పోకో తన కొత్త పోకో సి71ను తెలుగు రాష్ట్రాల మార్కెట్లోకి విడుదల చేసింది. బుధవారం హైదరాబాద్‌లో దీనిని పోకో ఇండియా కంట్రీ హెడ్ హిమాన్షు టాండన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హిమాన్షు మీడియాతో మాట్లాడుతూ.. 4జిబి ర్యామ్, 64జిబి స్టోరేజ్ కలిగిన పోకో సి71 ధరను రూ.6,499గా, 6జిబి, 128 జిబి వేరియంట్ ధరను రూ.7,499గా నిర్ణయించామన్నారు. ఈ స్మార్ట్‌ఫోన్ ఏప్రిల్ 10 నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో అందుబాటులో ఉంటుందన్నారు. 5200 ఎంఎహెచ్ బ్యాటరీ, 32 ఎంపి డ్యూయల్ కెమెరా, 8ఎంపి కెమెరాలు, సరికొత్త ఆండ్రాయిడ్‌లతో దీన్ని డిజైన్ చేశామన్నారు.

హెచ్ఆర్‌టీసీ నుంచి ఒలెక్ట్రాకు భారీ ఆర్డర్

297 బస్సుల కోసం ఒప్పందం



నవ తెలంగాణ - హైదరాబాద్

ప్రముఖ విద్యుత్ వాహన తయారీ సంస్థ ఒలెక్ట్రా గ్రీన్ టెక్ లిమిటెడ్ తాజాగా హిమాచల్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (హెచ్ఆర్‌టీసీ) నుంచి భారీ ఆర్డర్‌ను దక్కించుకున్నట్లు వెల్లడించింది. హెచ్ఆర్‌టిసి నుంచి తొమ్మిది మీటర్ల పొడవైన 297 నాన్-ఎయిర్ కండిషన్డ్ (నాన్-ఎసి) బస్సుల ప్రతిష్టాత్మకమైన ఆర్డర్ పొందినట్లు ఒలెక్ట్రా బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఒలెక్ట్రా అధికారికంగా హెచ్ఆర్‌టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ మురారి లాల్ నుండి లెటర్ ఆఫ్ అవార్డ్‌ను అందుకుంది. ఒక రోడ్ రవాణా సంస్థ ఇన్ని ఎలక్ట్రిక్ బస్సులను నేరుగా కొనుగోలు చేయటం దేశంలో ఇదే ప్రథమమని ఒలెక్ట్రా సీఎండీ కెవి ప్రదీప్ తెలిపారు. ఇది నిజంగా తమకు గర్వకారణమన్నారు. హిమాచల్ ప్రదేశ్‌లోని కొండ ప్రాంతాలలో నడిపేందుకు ప్రత్యేకంగా రూపొందించబడిన ఈ ఎలక్ట్రిక్ బస్సులు 30 మంది ప్రయాణీకుల సీటింగ్ సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. ఒక్కసారి ఛార్జ్ చేస్తే 180 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చు. ఈ బస్సుల మొత్తం ఆర్డర్ విలువ రూ 424 కోట్లుగా ఉంది.

దేశాన్ని ఎక్స్‌రే తీయాలి

రేవంత్ పంపిన బిల్లుపై కేంద్రం చర్యలు తీసుకోవట్లేదు : రాహుల్ గాంధీ



అహ్మదాబాద్: దేశ సమస్యలు తీర్చాలంటే.. దేశాన్ని ఎక్స్‌రే తీయాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. దళితులు, ఆదివాసీల సమస్యలపై ద ృష్టిపెట్టాలన్నారు. దళితులు, ఆదివాసీలకు న్యాయం జరుగుతోందా ?అనే ప్రశ్న తలెత్తుతోందన్నారు. వారి సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేదని రాహుల్ విమర్శించారు. అహ్మదాబాద్‌లో జరిగిన ఏఐసీసీ సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడారు. "చనిపోయాక నా గురించి ప్రజలు ఏం ఆలోచిస్తారనేది అనవసరం. నేను అనుకున్న పనులు పూర్తి చేశాక ప్రజలు మరిచిపోయినా నాకు అభ్యంతరం లేదు. బీసీల రిజర్వేషన్లు పెంచుతూ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి బిల్లు కేంద్రానికి పంపారు. రేవంత్‌రెడ్డి పంపిన బిల్లుపై కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. తెలంగాణలో కులగణనను విజయవంతంగా నిర్వహించారు. కులగణన ఆధారంగా రిజర్వేషన్లు పంచేందుకు ప్రయత్నం చేస్తున్నాం. కులగణన వల్ల దేశంలో బీసీల సంఖ్య ఎంతో తెలుస్తుంది. కులగణన విషయంలో తెలంగాణ దేశానికి మార్గం చూపింది. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి అంశాన్ని తొలగిస్తాం. తెలంగాణలో 90 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీలే ఉన్నారు. తెలంగాణ సంపదలో మాత్రం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు తగిన భాగస్వామ్యం లేదు. వారి జనాభాకు అనుగుణంగా సంపదలోనూ తగిన వాటా అవసరం" అని రాహుల్ గాంధీ అన్నారు. "ప్రభుత్వరంగ సంస్థలను ప్రధాని మోడీ ఒక్కొక్కటిగా విక్రయిస్తున్నారు. ఇద్దరు వ్యాపారవేత్తలకే వాటిని అప్పగిస్తున్నారు. ఎయిర్‌పోర్టులు, గనులు, సిమెంట్, స్టీల్ సహా కీలక పరిశ్రమలన్నీ ఓ పారిశ్రామికవేత్తకే కట్టబెడుతున్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ అక్రమాల ద్వారా గెలిచింది. ఆర్ఎస్ఎస్, బీజేపీ రోజూ రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూనే ఉన్నాయి. దేశంలో కులగణన చేపట్టాలని ప్రధాని మోడీని కోరాం. దీనికి ప్రధాని సహా ఆర్ఎస్ఎస్ తిరస్కరించింది. లౌకిక భావనకు ఆర్ఎస్ఎస్ వ్యతిరేకం. దళితుడైన రాజస్థాన్ పీసీసీ నేతను ఆలయానికి వెళ్లకుండా అడ్డుకున్నారు. వక్ఫ్‌సవరణ చట్టం మత స్వేచ్ఛపై దాడి" అని రాహుల్ వ్యాఖ్యానించారు..

మోడీ దేశాన్ని అమ్మేస్తారు : ఏఐసీసీ చీఫ్ ఖర్గే

న్యూఢిల్లీ : కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని మోడీపై తీవ్ర విమర్శలు చేశారు. మోడీ ఏదో ఒకరోజు దేశాన్ని అమ్మేస్తారని ఖర్గే ఆరోపించారు. మోడీ స్వరాష్ట్రమైన గుజరాత్‌లో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) సమావేశాలు జరుగుతున్నాయి. అహ్మదాబాద్‌లో జరుగుతున్న ఈ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. 'దేశ ఆర్థిక వ్యవస్థలో గుత్తాధిపత్యం నెలకొల్పబడుతోంది. ప్రభుత్వ ఆస్తులను ప్రయివేటు భూములకు అప్పగిస్తున్నారు. ఈడబ్ల్యూఎస్ (ఆర్థికంగా వెనుకబడిన బలహీన వర్గాలు) రిజర్వేషన్ దెబ్బతింది. వారు బలహీన వర్గాల వారికి ఉద్యోగాలు ఇవ్వడం లేదు. వారు ప్రభుత్వరంగాన్ని ఒక్కొక్కటిగా అమ్మేస్తూ.. తమ స్నేహితులకు సహాయం చేస్తున్నారు. ఇదే కొనసాగితే.. మోడీ ఏదో ఒకరోజు ఈ దేశాన్ని అమ్మేస్తారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ నిర్మించి న ప్రభుత్వ రంగ కర్మాగారా లను నాశనం చేస్తున్నారు. మీరు, నేను దేశం కోసం ఏం చేస్తున్నాం? భవిష్యత్ తరాలకు మనం ఏమి ఇవ్వాలనుకుంటున్నాము? కాంగ్రెస్‌ను దుర్భాషలాడడం తప్ప మోడీ దగ్గర వేరే సమాధానాలు లేవు అని ఆయన అన్నారు. నేడు ఎన్నికల సంస్థలు కూడా వారి నియంత్రణలోకే వెళ్లాయి. ప్రభుత్వం ప్రతిదానిలో జోక్యం చేసుకుంటూ తన ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తోంది. ఎన్నికల్లో మోసాలు జరుగుతు న్నాయి. ఎలక్ట్రానిక్ టెక్నాలజీ అభివృద్ధి చెందడంతో.. ప్రపంచంలోని అభివ ృద్ధి చెందిన దేశాలు ఈవీఎంలను వదిలి బ్యాలెట్‌పేపర్స్ వైపు మళ్లాయి. ప్రపంచంలో ఈవీఎంలు ఎక్కడా అందుబాటులో లేవు. దేశంలో 140 కోట్ల మంది ప్రజాస్వామ్యాన్ని నమ్ముతారు. ఇప్పుడో లేక తరువాతో.. ఈ దేశ యువత మనకు ఇవిఎంలు వద్దు.. బ్యాలెట్ పేపర్లు కావాలని నినదిస్తారు అని ఖర్గే అన్నారు.

భారత్‌పై అమెరికా 26 శాతం పన్నులను విధించింది. ఈ విషయంపై పార్లమెంటు చర్చించనీయలేదు. ఈ విషయంపై మేము చర్చించాలని పట్టుబట్టాము. కానీ వారు చర్చకు అనుమతించలేదు. ముఖ్యమైన ప్రజా సమస్యలను చర్చించడానికి బదులుగా.. ప్రభుత్వం పార్లమెంటులో మత విభజన గురించి చర్చించింది. దీనికోసం తెల్లవారుజామున 3-4 గంటల వరకు చర్చలు నిర్వహించింది. మణిపూర్ వంటి అంశాలపై ఉదయం 4.40 గంటలకు ప్రారంభమైంది. ఆరోజు మణిపూర్ అంశంపై మేము తరువాతరోజు మాట్లాడతామని అమిత్‌షాకు చెప్పాము. దీంతో ఈ విషయంపై మమ్మల్ని చర్చకే అనుమతించలేదు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఆ నేతలు ఇలాంటివి చేస్తున్నారు అని ఖర్గే విమర్శించారు.

ముజ్రా పార్టీని భగ్నం చేసిన ఎస్ఓటి పోలీసులు

పుట్టినరోజు పార్టీ ముసుగులో రేవ్ పార్టీ



నవతెలంగాణ-మొయినాబాద్

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని ఓ ఫామ్‌హౌస్‌లో పుట్టిన రోజు వేడుక ముసుగులో ఏర్పాటు చేసిన ముజ్రా పార్టీని పోలీసులు భగ్నం చేశారు. సీఐ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హెత్‌బార్‌పల్లి గ్రామ శివారులోని ఓ ఫామ్‌హౌస్‌లో మంగళవారం రాత్రిలో గంజాయి, డ్రగ్స్, మద్యం, అశ్లీల నృత్యాలతో ముజ్రా పార్టీ నిర్వహిస్తున్నారని నమ్మదగిన సమాచారం రావడంతో ఎస్ఓటి పోలీసులు ఫామ్‌హౌస్‌పై దాడి చేశారు. అక్కడ ఏడుగురు మహిళలు, 13 మంది పురుషులను అదుపులోకి తీసుకున్నారు. అబ్దుల్ రుక్మాన్ అనే వ్యక్తి పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని.. ఆ సందర్భంగా ముజ్రా పార్టీ నిర్వహణకు అతనికి పరిచయం ఉన్న అడ్డు అనే వ్యక్తితో గంజాయి, డ్రగ్స్ తీసుకురావడానికి ప్లాన్ చేశారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారందరూ వ్యాపారస్తులే. ఆ ప్రదేశంలో తనిఖీ నిర్వహించగా 70 గ్రాముల గంజాయి, 3లీటర్స్ లిక్కర్, 4బీరు బాటిల్స్, బ్రీజర్ బాటిల్స్, కండోమ్ ప్యాకెట్లు15, ఆరు కార్లు, మొబైల్ ఫోన్లు 25, ఓసీడీ పేపర్ ప్లాంట్స్ ఉక్కా పాట్స్‌ను సీజ్ చేశారు. ఇలాంటి పార్టీల నేపథ్యంలో ఫామ్‌హౌస్ ఓనర్లపై గతంలో పోలీసులు అనేక కేసులు నమోదు చేసి శిక్షించారు. మండల కేంద్రంలోని ఫామ్‌హౌస్ ఓనర్లకు ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకూ పర్మిషన్లు ఉండవని, ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే తప్పకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. అదుపులోకి తీసుకున్న అందరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

మళ్లీ మొదలైన మంచు వివాదం

నా ఇంట్లోకి పోలీసులు వెళ్లనివ్వడం లేదు

ఇది ఆస్తి వివాదం కాదు..

నటుడు మంచు మనోజ్

జల్‌పల్లిలో మోహన్‌బాబు ఇంటి ముందు ధర్నా



నవతెలంగాణ - బడంగ్‌పేట్

సినీ నటులు మంచు విష్ణు, మంచు మనోజ్ మధ్య కొంతకాలంగా వివాదం నడుస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా బుధవారం రంగారెడ్డి జిల్లా జల్‌పల్లిలోని మోహన్‌బాబు ఇంటి గేటు బయట మనోజ్ బైఠాయించి నిరసన తెలిపారు. తనను ఇంట్లోకి అనుమతించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. హైకోర్టు ఆర్డర్‌తో వచ్చినా తనను జల్‌పల్లిలోని ఇంట్లోకి పోలీసులు వెళ్లనివ్వడం లేదని తెలిపారు. తమ ఇంటికి వెళ్లకుండా నాన్న, మంచు విష్ణు అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టు ఆదేశాలను కూడా పోలీసులు లెక్క చేయడం లేదని తెలిపారు. ఈ విషయంపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాజకీయ నాయకులకు, పోలీసులకు, హైకోర్టుకు, కలెక్టర్, హ్యూమన్ రైట్స్ కమిషన్ అందరికీ తెలియజేసినట్టు చెప్పారు. విష్ణు ఆగడాలకు సంబంధించి అన్ని ఆధారాలూ తన వద్ద ఉన్నాయని తెలిపారు. నాన్న చెబితేనే ఇంట్లోకి వెళ్లాలని పోలీసులు చెప్పడం ఏంటని ప్రశ్నించారు. ఇంట్లో తన పెంపుడు జంతువులు, ఇతర వస్తువులు ఉన్నాయని, తాను వాటి కోసమే వచ్చానని అన్నారు. ఇది ఆస్తి వివాదం కాదని, తనకు ఆస్తి కావాలని ఎప్పుడూ అడగలేదన్నారు. విద్యార్థుల భవిష్యత్ కోసమే ఇదంతా అన్నారు. అక్కడే ఈ గొడవ మొదలైందని తెలిపారు. ఇంటి చుట్టూ భారీగా పోలీస్ బందోబస్తు పెట్టారని, కావాలనే తనపై రౌడీషీటర్లతో విష్ణు దాడులు చేయిస్తున్నాడని ఆరోపించారు. తాను, తన భార్య తమ పనిని చేసుకుంటూ ప్రశాంతంగా ఉంటున్నామని తెలిపారు. గత సంవత్సరం డిసెంబర్ నెల 8 నుంచి మా కుటుంబ సభ్యులు కావాలని జల్‌పల్లి ఇంటి వద్ద గొడవ సృష్టిస్తున్నారని అన్నారు. చిన్ననాటి నుంచి ఇక్కడే ఉన్న తమను ఇక్కడకు రాకుండా చేయడం కోసమే కుటుంబ గొడవలు చేశారన్నారు. ఏప్రిల్ 1న తన కూతురు జన్మదిన వేడుకలు జైపూర్‌లో జరుపుకోవడానికి వెళ్లామన్నారు. ఆ సమయంలో విష్ణు అనుచరులు వచ్చి తమ కార్లను తీసుకెళ్లడంతోపాటు తన సెక్యూరిటీపై దాడి చేశారని ఆరోపించారు. ఇంట్లోకి ప్రవేశించి వస్తువులు, సామగ్రిని ధ్వంసం చేశారన్నారు. కమిషనర్ ఇచ్చిన బైండోవర్‌ను వాళ్లు ఎన్నోసార్లు దాటారన్నారు. మంచు విష్ణు దొంగతనాలను బయట పెట్టినందుకే కక్ష కట్టి దాడులు, దౌర్జన్యాలు చేస్తున్నారని చెప్పారు. ఈ గొడవ విషయంపై తమకు న్యాయం చేయాలని పహడిషరీఫ్ ఇన్‌స్పెక్టర్, ఏసీపీ, కమిషనర్‌కు ఎన్నో సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఇక కన్నప్ప సినిమాకి పోటీగా తాను నటించిన 'భైరవం' చిత్రాన్ని వదులుదాం అనుకున్నామన్నారు. కానీ కన్నప్పని పోస్ట్ పోన్ చేసుకున్నాడన్నారు. ఆ కోపాన్ని ఎలా తీర్చుకోవాలో తెలియక ఇలా డైవర్షన్ చేస్తున్నాడని తెలిపారు. తాను వాళ్ల సినిమాలకు పని చేసినప్పుడు ఎన్నడూ రూపాయి తీసుకోలేదని, విష్ణు కెరీర్‌ను నిలబెట్టడానికి తనతో ఆడ గెటప్ వేయించారని అన్నారు. స్టంట్స్, సాంగ్స్, గ్రాఫిక్స్.. ఇలా వాళ్ల కోసం గొడ్డు చాకిరీ చేశానని ఆవేదన వ్యక్తం చేశారు.

హనుమాన్ జయంతికి భద్రత కట్టుదిట్టం



మూడు పోలీస్ కమిషనరేట్ల పరిధిలో ఏర్పాట్లు

ప్రభుత్వ అధికారులు, నిర్వాహకులతో సమన్వయ సమావేశం

నవతెలంగాణ- సిటీబ్యూరో

ప్రశాంత వాతావరణంలో శ్రీరామ నవమి శోభయాత్ర పూర్తి కావడంతో ఇక హనుమాన్ జయంతి వేడుకలపై పోలీసులు దృష్టిసారించారు. ఈనెల 12న హనుమాన్ జయంతి సందర్భంగా జరిగే శ్రీవీర హనుమాన్ విజయయాత్ర ఏర్పాట్లపై హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ ఉన్నతాధికారులు మూడు పోలీస్ కమిషనరేట్ పరిధిల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఇందులో భాగంగా బుధవారం హైదరాబాద్ కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో జీహెచ్ఎంసీ, వాటర్ బోర్డు, విద్యుత్ వివిధ ప్రభుత్వ శాఖలతోపాటు హనుమాన్ విజయయాత్ర నిర్వాహకులతో మూడు పోలీస్ కమిషనరేట్ల అధికారులు సమన్వయ సమావేశం నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో హనుమాన్ జయంతి వేడుక నిర్వహించే విధంగా పలు సూచనలు, సలహాలతోపాటు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ..శాంతియుత వాతావరణంలో శ్రీవీర హనుమాన్ విజయయాత్ర నిర్వహించాలని కోరారు. విజయయాత్ర సందర్భంలో ఎవరైనా కొత్త వారు వచ్చి చేరితే, వారిపై దృష్టిసారించడంతోపాటు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఊరేగింపు సమయంలో నిర్వాహకులు సంయమనంతో ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని సూచించారు. నిర్వాహకులు విగ్రహాల ఎత్తు విషయంలో ముందే జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. ఎవరైనా రైల్వే బ్రిడ్జ్ కన్నా ఎక్కువ ఎత్తు విగ్రహాలు పెట్టినచో వేరే మార్గం ద్వారా పంపిస్తామన్నారు. ఊరేగింపులో డీజే సిస్టమ్‌లను ఉపయోగించకపోవడమే మేలన్నారు. నిర్వాహకులు రోప్ పార్టీ సభ్యులకు (వాలంటీర్లకు) సరైన శిక్షణ ఇచ్చి వారిని వినియోగించుకోవాలని అన్నారు. వాలంటీర్లను ఎక్కువ సంఖ్యలో పెట్టుకోవాలని సూచించారు. నిర్దేశించిన రూట్‌లోనే వెళ్తే ఎలాంటి సమస్యలూ తలెత్తవన్నారు. పోలీసు శాఖ ముందస్తు అనుమతి లేకుండా డ్రోన్ కెమెరాలను ఉపయోగించరాదన్నారు. హైదరాబాద్ సిటీ కమిషనరేట్ పరిధిలో సుమారు 150 విజయ యాత్రలు తీస్తుండగా, సైబరాబాదు, రాచకొండ పరిధిలో 46 విజయ యాత్రలు తీస్తున్నారని, ఇవన్నీ ప్రధాన యాత్రలో కలుస్తాయని వివరించారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మొద్దని, రెచ్చగొట్టే పోస్టులు పెట్టొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు సీపీ విక్రమ్‌సింగ్ మాన్, జాయింట్ సీపీ జోయల్ డెవీస్‌తోపాటు అధికారులు పాల్గొన్నారు.

నగరంలో విజయ యాత్రకు 17000 మంది పోలీసులు

హైదరాబాద్‌లో ప్రధాన విజయ యాత్ర ఊరేగింపు రామ మందిరం గౌలిగూడ నుంచి ప్రారంభమై నారాయణగూడా, ఆర్‌టిసి చౌరస్తా, అశోక్‌నగర్, కవాడిగూడా, బైబిల్ హౌస్ నుంచి తాడ్‌బండ్ హనుమాన్ టెంపుల్ వరకు దాదాపు 12.2 కిలోమీటర్లు జరగనుంది. ఈ మార్గాన్ని అధికారులు పరిశీలించా రు. విజయ యాత్రకు హైదరాబాద్ సిటీ పోలీసు తరపున 17000 మంది పోలీసులతోపాటు అదనంగా సాయుధ బలగాలతో బందోబస్తు నిర్వహిస్తున్నారు.



పెరుగుతున్న ఎండలు

వచ్చే మూడ్రోజులు 40 నుంచి 43 డిగ్రీలు పెరిగే అవకాశం

పలు జిల్లాల్లో అక్కడక్కడా వర్షం కురిసే సూచనలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో వచ్చే మూడ్రోజుల పాటు ఎండలు క్రమంగా పెరుగుతాయనీ, గరిష్ట ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీల మేర పెరిగి 43 డిగ్రీలకు చేరుకునే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న వెదర్ బులిటెన్‌లో వివరించారు. అదే సమయంలో శుక్రవారం పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే సూచనలున్నాయని తెలిపారు. ఈ మేరకు జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ చేశారు. ఆ జిల్లాలో ఈదురు గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీస్తాయని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వచ్చే 48 గంటల పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుందని పేర్కొన్నారు. సాయంత్రం, రాత్రి సమయాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురియొచ్చని తెలిపారు.

అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాలు

ఆదిలాబాద్	41 డిగ్రీలు
నిజామాబాద్	40.8 డిగ్రీలు
మెదక్	39.8 డిగ్రీలు
ఖమ్మం	38.6 డిగ్రీలు
రామగుండం	38 డిగ్రీలు

ఎమ్మెల్యే రాజాసింగ్‌పై కేసు నమోదు

శ్రీరామనవమి శోభాయాత్రలో డీజే సౌండ్, మతపరమైన కామెంట్లు..

నవతెలంగాణ - ధూల్ పేట్

డీజే సౌండ్ పెట్టినందుకు, మతపరమైన వ్యాఖ్యలు చేసినందుకు హైదరాబాద్‌లోని గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై మంగళ్‌హాట్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకెళ్తే.. ఆదివారం శ్రీరామనవమి శోభయాత్రలో భాగంగా ఆకాష్‌పూరి హనుమాన్ టెంపుల్ నుంచి ర్యాలీగా బయలుదేరారు. ఈ శోభాయాత్రలో డీజే సౌండ్ పెట్టడంతోపాటు ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే, శోభాయాత్ర ఆర్గనైజర్ రాజాసింగ్ ప్రసంగిస్తూ మతపరమైన రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. అలాగే, జాలి హనుమాన్ దేవాలయం సమీపంలో పోలీసులకు, కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగింది. ఈ తోపులాటలో పోలీసులు లాఠీచార్జి చేస్తే తిరిగి తాము కూడా లాఠీచార్జి చేస్తామని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. దాంతో ఎమ్మెల్యేతోపాటు మరో ఇద్దరు ఆర్గనైజర్లు భాగ్యనగర్ శ్రీరామనవమి ఉత్సవ సమితి అధ్యక్షులు భగవంతారావు, శ్రీరామనవమి పల్లకి సేవా శోభాయాత్ర నిర్వాహకుడు ఆనంద్ సింగ్ లోథ్‌పై కేసు నమోదైంది.


16 నుంచి గ్రూప్-1 అభ్యర్థుల ధ్రువపత్రాల వెరిఫికేషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రూప్-1 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల వెరిఫికేషన్ తేదీలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ప్రకటించింది. ఏప్రిల్ 16, 17, 19, 21వ తేదీల్లో నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి యూనివర్సిటీలో ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని వెల్లడించింది. టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో ధ్రువపత్రాల వెరిఫికేషన్‌కు ఎంపికైన అభ్యర్థుల జాబితా ఉంటుందని కమిషన్ పేర్కొంది. అభ్యర్థులు ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం1.30 వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు రెండు సెట్ల ఫోటోస్టాట్ కాపీలను తీసుకురావాలని సూచించింది. రిజర్వ్‌డే అయిన 22న ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5.30 వరకు వెరిఫికేషన్ నిర్వహించనున్నట్టు పేర్కొంది. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికేట్లు తీసుకు రాకపోయినా, గైర్హాజరైనా వారిని తిరిగి వెరిఫికేషన్ కోసం అనుమతించరనీ, ఆ ఖాళీలను తదుపరి అభ్యర్థులతో భర్తీ చేస్తామని వెల్లడించింది. ఈ మేరకు గురువారం టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ ఒక ప్రకటన విడుదల చేశారు.

11,12,13 తేదీల్లో గావ్ చలో..బస్తీ చలో

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీ వ్యవస్థాపక దినోత్సవ పురస్కారాల్లో భాగంగా శని, ఆది, సోమవారాల్లో రాష్ట్ర వ్యాప్తంగా గావ్ చలో-బస్తీ చలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు ప్రకటించారు. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అన్ని గ్రామాలు, బస్తీల్లో మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నాయకులు పాల్గొంటారనీ, కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా పాల్గొంటారని తెలిపారు. గ్రామాలు, బస్తీల్లో సందర్శనలో భాగంగా ఆస్పత్రులు, దేవాలయాలు, పాఠశాల వంటి ప్రాంతాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల నుంచి లబ్ధి పొందుతున్న వారిలో కనీసం పది మందిని కలవాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. అదే సమయంలో బూత్‌కమిటీల సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. గ్రామ సభ పెట్టి ప్రజా సమస్యలను స్వీకరించి వాటిపై భవిష్యత్తులో ఉద్యమాలు చేపడతామన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ మక్లకు డాక్టరేట్



నవతెలంగాణ-హయత్ నగర్

ప్రభుత్వ డిగ్రీ కళాశాల హయత్ నగర్ లో ఇంగ్లీష్ విభాగం లో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పని చేస్తున్న డి.మక్ల కు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. సీనియర్ ప్రొఫెసర్ ఎస్.అనిల్ కృష్ణ పర్యవేక్షణలో "రిప్రజెంటేషన్ ఆఫ్ ట్రైబల్స్ ఇన్ ద సెలెక్టెడ్ ఇండియన్ నావెల్స్ ఇన్ ఇంగ్లీష్" (Representation of Tribals in the selected Indian Novels in English) అనే అంశంపై పరిశోధన చేసి పిహెచ్డీ సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించినందుకు హైదరాబాదులోని ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ అవార్డును ప్రకటించింది. ఆయన స్వస్థలం వెంకటాద్రిపాలెం గ్రామం, మిర్యాలగూడ మండలం, నల్గొండ జిల్లా. ఈ గ్రామం నుండి తొలి పీహెచ్డీ డాక్టరేట్ పొందినందుకు మక్ల తల్లీ , కుటుంబ సభ్యులు, మిత్రులు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేష్ బాబు, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి ఇందిరా, అకాడమీ కోఆర్డినేటర్ నరసింహ, ఐ క్యూ ఏసి కోఆర్డినేటర్ మధు ధర్మపురి, తదితర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మక్లను అభినందించారు.

మొన్న భార్య ఆత్మహత్య.. నిన్న భర్త

నవతెలంగాణ -హయత్ నగర్

గడిచిన 24 గంటల వ్యవధిలో దంపతులిద్దరూ మృతి చెందిన ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. సంపంగి శిరీష(20), నగేష్(25)లకు 2 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వారు హయత్ నగర్ ముదిరాజ్ కాలనీలో నివాసముంటున్నారు. కాగా వారికి ఒక బాబు సంతానం. ఈనెల 8న భార్య, భర్తల మధ్య గొడవ జరిగడంతో శిరీష్ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని ఆమె భర్తను అదుపులోకి తీసుకుని అదే రోజు విడిచి పెట్టారు. అయితే మరుసటి రోజు బుధవారం నగేష్ తన భార్య మరణంతో మనస్తాపం చెంది హయత్ నగర్‌లోని రిలయన్స్ డిజిటల్ బిల్డింగ్‌పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు జీహెచ్ఎంసీ కార్మికుడు.

మండుటెండలో సబితమ్మ పర్యటన


- తాగునీటి సరఫరా విషయంలో ముఖ్యమంత్రి వైఫల్యం
- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆరోపణ



నవతెలంగాణ - దిల్ సుఖ్ నగర్

మండుటెండలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్ లో జలమండలి అధికారులు, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి బుధవారం పర్యటించారు. ప్రధానంగా గత కొంత కాలంగా తాగు నీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని స్థానిక మహిళలు సబితా ఇంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. తాగు నీటి సరఫరా విషయంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పలుమార్లు తాగు నీటి సరఫరా అధికారులతో చర్చించి, నీటి సరఫరా చేయాలని ఆదేశించారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో బుధవారం ఎన్టీఆర్ నగర్ బస్తీలో మండుటెండలో సబితా ఇంద్రారెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధీనంలో ఉన్న మున్సిపల్, వాటర్ వర్క్స్ సేవలు నిర్వీర్యం కావడం దురదృష్టకరం అన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని తాగు నీటి సరఫరా విషయంలో ముఖ్యమంత్రికి ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడం వలన ప్రజలు నానా ఇక్కట్లకు గురవుతున్నారని అసహనాన్ని వ్యక్తం చేశారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యవేక్షణలో ఉన్నప్పటికీ సంబంధింత అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. మార్చి నెల మొదటి వారం నుంచే తాగు నీటి సమస్యను సంబంధింత అధికారులకు వివరించడం జరిగిందని పేర్కొన్నారు. అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థ కారణంగా ఎప్పుడో ఒకసారి సరఫరా అయ్యే తాగునీరు కూడా కలుషితం అవుతుందని ఆరోపించారు. కనీస సౌకర్యాల్లో ఒకటైన తాగు నీటి సరఫరా విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఘోరంగా విఫలం అయిందని మండిపడ్డారు. ఒక ప్రణాళిక బద్ధంగా తాగు నీటి సరఫరా చేసే పైపులు ఏర్పాటు చేయకపోవడంతో ఎగువన ఉన్న వారికి తాగు నీరు పాక్షికంగా కూడా సరఫరా కావడం లేదని స్థానిక మహిళలు సబితా ఇంద్రారెడ్డి దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. తాగునీటి కోసం ట్యాంకర్లు బుక్ చేసిన కూడా సకాలంలో రావడం లేదని, మూడు నాలుగు రోజుల తర్వాత ట్యాంకర్లు వస్తున్నాయని ఎన్టీఆర్ నగర్ బస్తీ వాసులు మొరపెట్టుకున్నారని తెలిపారు. అదే విధంగా ఎన్టీఆర్ నగర్ ఫేస్ టు లో తాగునీరు డ్రైనేజీ లైన్లు కలిసి ఫలితంగా కలుషిత నీరు సరఫరా అవుతుందని స్థానికులు ఆమెకు వివరించారు. గత ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి తాగు నీరు అందించిన విషయాన్ని సబితమ్మ గుర్తు చేశారు. ఇప్పుడు మహానగరంలో ఎక్కడ చూసినా తాగు నీటి ట్యాంకర్లు దర్శనం ఇస్తున్నాయని తెలిపారు. ఈ పర్యటనలో తెలంగాణ గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మెన్ ఆయచితం శ్రీధర్, బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ, ఆర్కేపురం డివిజన్ బీఆర్ అధ్యక్షులు పెండ్యాల నగేష్, న్యాలకొండ శ్రీనివాస్ రెడ్డి, గొడుగు శ్రీనివాస్ ముదిరాజ్, సాజిద్, శ్రీమన్నారాయణ, పెంబర్తి శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, కంచర్ల శేఖర్, శ్యాం గుప్త, వాజిద్, జగన్, జహీద్, రహీం, శ్రీకాంత్ గౌడ్, కుమార్, ఊర్మిళ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్, డిజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలి



నవతెలంగాణ-తుర్కయంజాల్

కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ బుధవారం తుర్కయంజాల్ మున్సిపల్ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నాగార్జునసాగర్ రహదారిపై సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో వంట గ్యాస్ సిలిండర్లతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు, తుర్కయంజాల్ మున్సిపల్ కార్యదర్శి డి.కిషన్ మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్ లో క్రూడాయిల్ ధరలు 2024 నుంచి క్రమంగా తగ్గుతూ ఇటీవలి కాలంలో అవి మరింత తగ్గాయనీ కానీ కేంద్ర ప్రభుత్వం ఒకేసారి సిలిండర్ పై 50 రూపాయలను పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. పెరిగే గ్యాస్ ధరల ప్రభావం మిగతా నిత్యవసర వస్తువుల ధరలపై కూడా పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభ భయంతో ప్రజలు అల్లాడుతుంటే.. ఉపాధి పెంచి, ధరలను తగ్గించాల్సింది పోయి కేంద్రం గ్యాస్ ధరలను పెంచి ప్రజలపై మరింత భారాలను వేస్తున్నదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడుదారులకు లక్షల కోట్ల రూపాయల రుణాలు రాయితీలుగా ఇచ్చి, ఆ భారాన్ని పేద ప్రజలపై మోపుతున్నదని ఆరోపించారు. పెరిగిన గ్యాస్ ధరల వల్ల మహిళలపై తీవ్ర ప్రభావం పడుతుందని, నారీ శక్తి గురించి బీరాలు పలికే కేంద్ర పెద్దలకు మహిళల గోడు కనిపించడం లేదా అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం)తుర్కయంజాల్ మున్సిపల్ కమిటీ సభ్యులు మండల సత్యనారాయణ, ఇల్లూరి భాస్కర్, బడుగు మాల్యాద్రి, నాయకులు ఎస్ యాదగిరి, గనిపల్లి రాములు, మద్దెల యాదయ్య, జక్క హనుమంత్ రెడ్డి, గుండా బాలరాజ్, బండ బీరప్ప, మధుకర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, యాదగిరి, శ్రీనివాస్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.





నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ ముత్యాల యాదిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వ్యవరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీ, కుంట్లూ ర్, రావినారాయణ రెడ్డి కాలనీ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వం దిష్టి బొమ్మను తగలబెట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు, సీపీఐ పార్టీ మాజీ కౌన్సిలర్ అజ్మీరా హరిసింగ్ నాయక్, ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు కేతరాజు నరసింహ, బీ ఓసీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు దాసరి ప్రసాద్, ఏఐటీయూసీ నాయకులు ధూపం నిరంజన్, పొన్నాల యాదగిరి, రాములు, గోపి, ఏఐఎస్ఎఫ్ నాయకులు వినోద్ నాయక్, మంగళపల్లి రవి, మల్లేష్, బుజ్జ రాజు, రమేష్ నాయక్, మహిళా సమైక్య నాయకురాలు వట్టి నవనీత , చందన, సుజాత, దేవమ్మ అనసూయ, ప్రియా, అన్నపూర్ణ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ -ఎల్బీనగర్

పెట్రోల్, డిజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎల్బీనగర్ లో సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డిలు మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినప్పటికీ దేశంలో బీజేపీ ప్రభుత్వం ధరలను తగ్గించడం లేదని ఆరోపించారు. పేద, మధ్య తరగతి సామాన్య ప్రజలపై భారం మోపడానికి వంట గ్యాస్ ధరలు పెంచడం దుర్మార్గమని మండిపడ్డారు. దేశంలో ఆర్థిక అంతరాలు పెరిగి పేద వాడు బతకలేని పరిస్థితుల్లో ఉన్న తరుణంలో గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం ద్వారా మూలిగే నక్క పై తాటిపండు పడ్డ చందంగా ఉందని అన్నారు. ఒక వైపు తెలంగాణ ప్రభుత్వం ఉజ్వల స్కీం ద్వారా పేదప్రజలకు రూ.500 లకే గ్యాస్ సిలిండర్ల ఇస్తుంటే.. రూ.50 పెంచడం ద్వారా పేద ప్రజలపై పెను భారం పడుతుందన్నారు. యు.పీ.ఏ ప్రభుత్వం లో రూ.400 ఉన్న గ్యాస్ సిలిండర్ల ధర అధికారంలో వచ్చిన బీజేపీ ప్రభుత్వం 11 సంవత్సరాల కాలంలో విపరీతంగా ధరలు పెంచి పేదల నడ్డి విరుస్తుందన్నారు. పెంచిన గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించి, గత ప్రభుత్వంలో ఇచ్చినటువంటి సిలిండర్ మీద రూ.250 సబ్సిడీని ఇవ్వాలని, అలాగే పెట్రోల్, డీజిల్, గ్యాస్ లను జీఎస్టీ పరిధిలోకి తేవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరసన వ్యక్తం చేసిన వారిలో సరూర్ నగర్ మండల కార్యదర్శి భారత రాజు నరసింహ, హయత్ నగర్ మండల కార్యదర్శి శేషరాజు పల్లి శ్రీదేవి, ఏ.ఐ.ఎస్.ఎఫ్ జిల్లా ప్రదాన కార్యదర్శి సామిడి వంశీ వర్ధన్ రెడ్డి, సహాయ కార్యదర్శిలు రాములు గౌడ్, శోభన్, అరుణ్ కుమార్ గౌడ్, మహిళా సమాఖ్య అధ్యక్ష,కార్యదర్శులు సుజాత, సరిత, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి రమావత్ సక్రు నాయక్, అధ్యక్షులు మద్దిలేటి,శివజ్యోతి, సౌజన్య, యమునా, సౌజన్య, చెంది వేంకట్, నాగరాజు పాల్గొన్నారు.

తుర్కయంజాల్ కమ్మగూడలో ఉద్రిక్త పరిస్థితులు



- భూ వివాదంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ
- పరస్పరం రాళ్ల దాడులు, పలువురికి గాయాలు



నవతెలంగాణ-తుర్కయంజాల్

తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి కమ్మగూడలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఓ భూ వివాదంలో చెలరేగిన ఘర్షణ పరస్పర రాళ్లదాడులకు దారితీసింది. వివరాల్లోకి వెళ్తే... కమ్మగూడలోని సర్వే నెంబర్ 240, 241, 242లో 10.09 ఎకరాల భూమి విషయంలో ఓ మహిళకు అనుకూలంగా కోర్టు తీర్పు వచ్చింది. దీంతో ఆ భూమి తమదేనంటూ కొన్నాళ్లుగా అక్కడ కబ్జాలోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే ఆ ప్రాంతంలో వెంచర్లు వెలిసి, కొందరు ఇళ్లు కూడా నిర్మించుకున్నారు. దీంతో ప్లాట్లు, ఇళ్ల యజమానులకు, ఆ మహిళ వర్గానికి సంబంధించి గొడవలు జరుగుతున్నాయి. గత కొద్ది రోజుల కిందట ప్లాట్లలో వేసిన కడీలను, ఇతరత్రా నిర్మాణాలను కూల్చారు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున మరోసారి తమకు కోర్టు నుంచి ఉత్తర్వులు ఉన్నాయంటూ మహిళకు సంబంధించిన పలువురు ప్లాట్ల కడీలు, ప్రీ కాస్ట్ గోడలను కూల్చివేసేందుకు యత్నించారు. దీంతో స్థానిక ప్రజలు, ప్లాట్ల యజమానులు కబ్జాకు యత్నిస్తున్న వారిని అడ్డుకున్నారు. ఇరువర్గాలు తీవ్రంగా ప్రతిఘటించడంతో ఉద్రిక్తతకు దారితీసింది. పరస్పరం రాళ్లు రువ్వుకున్నారు. అక్కడే ఉన్న రెండు ద్విచక్ర వాహనాలకు నిప్పు అంటించారు. బస్సు అద్దాలను సైతం ధ్వంసం చేశారు. ఘర్షణలో పలువురు గాయపడినట్లు తెలుస్తోంది. స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున తిరగబడటంతో కబ్జాకు యత్నిస్తున్న వ్యక్తులు అక్కడి నుంచి పరారయ్యారు. విషయం తెలుసుకున్న వనస్థలిపురం పోలీసులు భారీగా మోహరించి పరిస్థితులను అదుపులోకి తేవడంతో పంచాయితీ తాత్కాలికంగా సద్దుమణిగింది.



కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ

నవతెలంగాణ - అబ్దుల్లాపూర్‌మెట్

అబ్దుల్లాపూర్ మెట్ మండలం గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీఓ కు బుధవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు నర్సింహ మాట్లాడుతూ.. ఈ నెల 19 నుంచి కార్మికులు చేపట్టబోయే సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అందుకు సంబంధించిన సమ్మె నోటీసును మండల ఎంపీఓకు ఇవ్వడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, జీవో 51 సవరించి, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, రెండవ పీఆర్సీ గ్రామ పంచాయతీ వర్కర్లకు కల్పించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సమ్మె దిగే లోపు ప్రభుత్వం స్పందించి వెంటనే ఆరు నెలల పెండింగ్ జీతాలు ఇవ్వాలన్నారు. ప్రతి సంవత్సరం ఇవ్వాల్సిన డ్రెస్సులు సబ్బులు, నూనెలు ఇతర సదుపాయాలు కల్పించాలన్నారు. లేదంటే సమ్మె కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికులు, అంజయ్య, బాలయ్య, లక్ష్మయ్య, జ్యోతి, కవిత, బిక్షపతి సుధాకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళలను వేధిస్తే సహించేది లేదు

- నెల రోజుల్లో 203మంది ఆకతాయిలకు కౌన్సిలింగ్
- రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు



నవతెలంగాణ-హయత్ నగర్

యువతులను, మహిళలను వేధిస్తే సహించేది లేదని రాచకొండ పోలీస్ కమిషనర్ డాక్టర్ సుధీర్‌బాబు హెచ్చరించారు. ఎల్బీనగర్‌లో ఉన్న సీపీ క్యాంప్ కార్యాలయంలో ఈవ్ టీజర్లకు వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బాలికలను, మహిళలను వేధించే పోకిరీలను రాచకొండ షీ టీమ్స్ పోలీసులు వదిలిపెట్టే ప్రసక్తి లేదని, మహిళలు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని తెలిపారు. బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, స్కూళ్లు, కాలేజీలు, కూరగాయల మార్కెట్లు, బహిరంగ ప్రదేశాలలో మఫ్టీలో తిరుగుతూ షీ టీమ్స్ డెకాయ్ ఆపరేషన్లు చేస్తున్నారని, బాలికలను, మహిళలను వెంబడించే, వేధించే పోకిరీల చేష్టలను సాక్ష్యాధారాలతో సహా పట్టుకొని న్యాయ స్థానంలో హాజరు పరుస్తున్నారని తెలిపారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో మహిళలను, యువతులను వేధింపులకు గురిచేస్తున్న 203 (మేజర్స్-138,మైనర్స్-65) మందిని షీ టీమ్స్ పట్టుకున్నారని తెలిపారు. గత నెల 1వ తేదీ నుండి 31వ తేదీ వరకు 249 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ఫోన్ల ద్వారా వేధించినవి-30, సోషల్ మీడియా యాప్స్ ద్వారా వేధించినవి-87, నేరుగా వేధించినవి -132..వాటిలో క్రిమినల్ కేసులు-14, పెట్టి కేసులు- 84, 116 మందికి కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందని విమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ టి. ఉషారాణి తెలిపారు. మహిళలు వేధింపులకు గురి అయినప్పుడు వెంటనే షీ టీమ్స్ ని, రాచకొండ వాట్సాప్ నెంబర్ 8712662111 ద్వారా లేదా ఆ ప్రాంత షీ టీమ్ అధికారుల నంబర్లు భువనగిరి ఏరియా -8712662598,చౌటుప్పల ఏరియా- 8712662599, ఇబ్రహీంపట్నం ఏరియా -8712662600, కుషాయి గూడ ఏరియా -8712662601, ఎల్బీనగర్ ఏరియా -8712662602, మల్కాజ్గిరి ఏరియా -8712662603, వనస్థలిపురం ఏరియా -8712662604లకు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో షీ టీం ఇన్ స్పెక్టర్ ముని, అంజయ్య, అడ్మిన్ ఎస్ఐ రాజు, షీ టీమ్స్ సిబ్బంది, కౌన్సిలర్స్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి కటికం నరసింహారావు రాజీనామా



నవతెలంగాణ-ఎల్బీనగర్

తెలంగాణ బీజేపీ పార్టీలో జరుగుతున్న పరిణామాలు నచ్చక ఎల్బీనగర్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకులు కటికం నర్సింగరావు బీజేపీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయం కార్యదర్శికి బుధవారం అందజేశారు. రంగా రెడ్డి జిల్లాకు చెందిన బీసీ, బీజేపీ నాయకులు కటికం నర్సింగ్ రావు బీజేపీకి రాజీనామా చేయడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. ఈ సందర్భంగా కటికం నర్సింగ్ రావు మాట్లాడుతూ త్రికరణ శుద్ధిగా బీజేపీకి నిబద్ధతతో నిరంతరం పనిచేస్తున్న జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు తనను అణిచి వేస్తున్నారని ఆరోపించారు. ఈ మధ్యకాలంలో పార్టీలో జరుగుతున్న పరిణామాలు జీర్ణించుకోలేకపోతున్నట్లు తెలిపారు. బీజేపీలో బీసీ నాయకులను అణిచివేస్తున్నట్లు తెలిపారు. పార్టీలో జరుగుతున్న వివిధ పరిణామాలతో కలత చెందినట్లు తెలిపారు. 40 సంవత్సరాలుగా పార్టీ కోసం అన్నింటిని త్యాగం చేసి, చదువును వదిలేసి పార్టీ కోసం పనిచేస్తే పార్టీలో తనకు సరైన గుర్తింపు, గౌరవం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక ఇబ్బందులు పడుతూ పార్టీ, దేశం, ధర్మం కోసం పనిచేసినట్లు తెలిపారు. తనకు పార్టీ పదవులు కూడా ఇవ్వకుండా ఆత్మగౌరాని కించపరచడం ఇబ్బందులకు గురి చేయడం జరిగిందన్నారు. ఈ పరిణామం సరైన పద్ధతి కాదు అని అన్నారు. బీసీ నాయకులు బీజేపీలో ఎదగకుండా చేయడం ఒక పద్ధతి ప్రకారం కుట్ర జరుగుతుందని ఆరోపించారు. ఆత్మ గౌరవాన్ని, ఆత్మభిమానాన్ని, కించపరిచే విధంగా అనేక ఘటనలు జరిగాయని చెప్పారు. పార్టీలో జరుగుతున్న అనేక విషయాలను, ఘటనను చూసి, విని నాలాంటి వ్యక్తులు మనసు పెట్టి పని చేయడం సాధ్యపడడం లేదన్నారు. చాలా రోజులుగా పార్లమెంట్ ఎన్నికల నుండి క్రియాశీలకమైన సంస్థగతమైన విషయాలను నాయకులు తెలిపిన పట్టించుకోలేదని ఆరోపించారు. ఇకనుండి పార్టీకి మానసికంగా దూరం కావాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. పార్టీ క్రియాశీల సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు కటికం నర్సింగ్ రావు తెలిపారు.

ప్రతి కాలనీ సీసీ కెమెరా నిఘాలో ఉండాలి : ఎమ్మెల్యే

ప్రభుత్వం మీద ఆధారపడకుండా సొంత నిధులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

నవతెలంగాణ-హయత్ నగర్

కాలనీ వాసులు కలిసి కట్టుగా ఉండి, ప్రతి కాలనీ సీసీ కెమెరా నిఘాలో ఉండేలా చూసుకోవాలని ఎల్బీనగర్ శాసన సభ్యులు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి కోరారు. హయత్ నగర్ డివిజన్ పరిధిలోని సూర్య నగర్ కాలనీవాసులు దాదాపు మూడు లక్షల రూపాయల సొంత నిధులతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆ సీసీ కెమెరాలను కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డితో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్క అభివృద్ధి విషయంలో ప్రభుత్వం మీద ఆధారపడకుండా తమ స్వంత నిధులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం నిజంగా గర్వించదగ్గ విషయం అని కొనియాడారు. నేర రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా నియోజకవర్గంలో దశల వారీగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అలాగే సీసీ కెమెరాలపై కూడా ప్రజల్లో అవగహన కల్పించడం జరిగిందని తెలిపారు.తప్పు చేయాలంటే దొంగలు బయపడే రోజులు వచ్చాయని చెప్పారు. ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానం అని తెలిపారు.ఒకవేళ నేరం జరిగితే కూడా ఆ నేరం చేసిన వారిని గంటల వ్యవధిలో పోలీసులు పట్టుకోవడం జరుగుతుందని తెలిపారు.అలాగే గొడవకు సంబంధం లేని వ్యక్తులు కూడా సీసీ కెమెరాల ద్వారా చూసి అమాయక ప్రజలను కుడా కాపాడుకోవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ తిరుమల రెడ్డి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు చెన్నగొని శ్రీధర్ గౌడ్, మల్లేష్ ముదిరాజ్, భాస్కర్ సాగర్, కాలనీ అధ్యక్షులు ఆనంతుల వెంకటేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి జైపాల్ రెడ్డి, ఉపాధ్యక్షులు సంజీవరెడ్డి, కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి రాజేందర్ రెడ్డి, సభ్యులు శంకరయ్య గౌడ్, విజయ్ కుమార్ గౌడ్, స్వామి గౌడ్, నాయకులు లక్ష్మణ్, ఇంద్రకరణ్ రెడ్డి,రాకేశ్, మనోజ్,విష్ణు, నగేష్, పరమేష్, శ్రీరాములు, ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం : మైనంపల్లి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ఎండాకాలంలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేయటం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. మల్కాజిగిరి డివిజన్ కండెస్టంట్ కార్పొరేటర్ గోగికర్ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మైనంపల్లి హనుమంతరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్, మల్కాజిగిరి ఇన్‌చార్జి లక్ష్మీకాంత్ రెడ్డి, బీ బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, ఏ బ్లాక్ ప్రెసిడెంట్ అశోక్ రెడ్డి, బికె శ్రీనివాస్, చంద్రశేఖర్, డివిజన్స్ అధ్యక్షులు సంపత్ గౌడ్, వినోద్ యాదవ్, పిట్టల శ్రీనివాస్, పిట్టల నాగరాజు, శంకర్, ఆలేటి సాయి బాబా, యువరాజు, చరంజీత్ గౌడ్, సాయి కిషోర్, సురేష్ సింగ్, సయ్యద్ మబ్బు, నిరుగొండ వినయ్, సంజు, నరేందర్, శారద, నజియా, లక్ష్మి, శారద, తదితరులున్నారు.

సెల్ టవర్ ఏర్పాటుపై ఎంజీ కాలనీవాసుల అభ్యంతరం

నవతెలంగాణ-అల్వాల్





అల్వాల్ మచ్చ బొల్లారంలోని ఎంజీ నగర్ కాలనీలో ఇటీవల ఒక అపార్ట్‌మెంట్ భవనంపై ఏర్పాటు చేసిన సెల్ టవర్‌పై స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ టవర్‌ను తమతో ఎటువంటి సంప్రదింపులు లేకుండానే ఏర్పాటు చేశారని, దీని వల్ల తమ ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సెల్ టవర్ల నుంచి వెలువడే రేడియేషన్‌తో పిల్లలు, వృద్ధులకు అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని స్థానికులు భయపడుతున్నారు. టవర్ ఏర్పాటుపై విచారణ చేయాలని అల్వాల్ మున్సిపాలిటీ అధికారులను విజ్ఞప్తి చేశారు. టవర్ వల్ల కలిగే ప్రమాదాలు, తమ అనుమతి లేకుండానే ఏర్పాటు చేసినందున ఎంజీ కాలనీ నుంచి సెల్ టవర్‌ను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

రాహుల్ సాంకృత్యాయన్ 132వ జయంతి



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో కమలానగర్ ఆఫీసులో ప్రముఖ రచయిత బహుభాషా కోవిదులు రాహుల్ సాంకృత్యాయన్ 132వ జయంతిని స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్ సాంకృత్యాయన్ చిత్రపటానికి చిత్తరంజన్ దాస్, ఈసీఐఎల్ రిటైర్డ్ ఆఫీసర్ ఎం. భాస్కర్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చిత్తరంజన్ దాస్ మాట్లాడుతూ.. రాహుల్ సాంకృత్యాయన్ నిరంతర అన్వేషిగాను, దేశ దేశాలు తిరిగి అనుభవాలు చారిత్రక విషయాలు సేకరించి గ్రంథస్తం చేశారని చెప్పారు. ఎం. భాస్కర్ రావు మాట్లాడుతూ.. రాహుల్ సాంకృత్యాయన్ 24 భాషల్లో ప్రావీణ్యం కలిగి ఉన్నారని అన్నారు. అనేక భాషా సమస్యలను పరిష్కరించి దానిలోని విషయాలను అందరికీ అర్థమయ్యే భాషలో విశదీకరించాలని చెప్పారు. గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ.. రాహుల్ సాంకృత్యాయన్ అనేక కష్టాలను అనుభవించి, వివిధ ప్రదేశాలను సందర్శించి అనేక పుస్తకాలు రాశారని చెప్పారు. ముఖ్యంగా చారిత్రిక అంశాలను ఆనాడు లభించిన ఆధారాలకు అనుగుణంగా చారిత్రాత్మకమైన రచనలు చేశారని చెప్పారు. అతి ప్రామాణికంగా ఉన్న "వోల్గాసే గంగ" పుస్తకం బహుళ ప్రచారం అయిందని చెప్పారు. ఆయన జయయౌదేయ, సింహాసేనాపతి, మధుర స్వప్నం, లోకసంచారి లాంటి అనేక రచనలు చేశారని చెప్పారు. రష్యా ప్రభుత్వం ఆయనను చారిత్రక అంశాలపై పరిశోధన కొరకు వినియోగించుకున్నారని చెప్పారు. కృష్ణమాచారి, శివరామకృష్ణ, రుక్కయ్య, దుర్గా చారి తదితరులు ప్రసంగించారు. అనంతరం సభ్యులందరూ చిత్రపటానికి పూలను వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎం. శ్రీనివాసరావు, దుర్గా చారి, రుక్కయ్య కృష్ణమాచారి, గౌసియా, జి.శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ నిర్మాణ పనులు ప్రారంభం



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్‌లోని హెచ్‌బీ కాలనీ ఫేజ్-1 ఓం శాంతి బిల్డింగ్ గల్లీలో రూ.2 లక్షల వ్యయంతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రయినేజీ నిర్మాణ పనులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి బుధవారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధికి ఎల్లవేళలా సహకరిస్తూ అందుబాటులో ఉంటానన్నారు. ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం ఎమ్మెల్యే కాలనీవాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ మాట్లాడుతూ ఎల్లవేళలా డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారం దిశగా కృషి చేస్తామని తెలిపారు. డివిజన్ అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ వేణుగోపాల్, ఏఈ లింగారావు, కాలనీ అధ్యక్షులు శివరాం ప్రసాద్, ప్రతాప్ రెడ్డి, శివప్రసాద్, ఎన్ఎన్ చారి, హరికృష్ణ, కాళిదాస్, దేవేందర్ కుమార్, బాలయ్య గౌడ్, చారి, మల్లేష్ గౌడ్, పూస రమేష్, బీఆర్ఎస్ నాయకులు గుమ్మడి జంపాల్ రెడ్డి, నిస్సార్ అహ్మద్ గోరి, నవీన్, తదితరులున్నారు.

బీసీ సంఘాల జేఏసీ ఏర్పాటుపై నిర్ణయం



నవతెలంగాణ - చర్లపల్లి

త్వరలోనే నాచారం బీసీ సంఘాల జేఏసీ కమిటీని ఏర్పాటు చేయనున్నట్టు దొంతుల శ్రీనివాస్ కుమ్మరి, ఐతగోని రమేష్ గౌడ్, రాజబాబు పటేల్ తెలిపారు. బుధవారం నాచారంలోని బహుజన సాహిత్య అకాడమీ కార్యాలయంలో నల్ల రాధాకృష్ణ అధ్యక్షతన బీసీ నాయకులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా దళిత సంఘాల జేఏసీ మాదిరిగానే, బీసీ సంఘాల జేఏసీ ఏర్పాటు చేయాలనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేశారు. ఏప్రిల్ 11న మహాత్మా జ్యోతిబా పూలే జయంతిని ఘనంగా నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో బీసీ నాయకులు కనుకుంట్ల విజయ కుమార్, వంజ మధుమదిరాజ్, రమేష్ నాయి, వెంకటేష్ నేత, స్వామినాయి, దళిత సంఘాల జేఏసీ కన్వీనర్ కరాటే శ్రీరామ్, ఎమ్మార్పీఎస్ అంజి మాదిగ, టీచర్ అమరేందర్ రావు, కొమ్మగాళ్ళ వెంకటేశ్వర్లు, బొడ్డు శివ, ఏళ్ల సంతోష్, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి : మేకల సునీత



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సహకారంతో గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీతా రాము యాదవ్ అన్నారు. గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జుననగర్‌లో రూ.42లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీహెచ్ఎంసీ కార్పొరేషన్ ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రణాళిక బద్ధంగా నెరవేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, మల్లికార్జున నగర్ అసోసియేషన్ ప్రతినిధులు వెంకటయ్య, అచ్యుతరావు, గోపాల్ రెడ్డి, వాసంశెట్టి శ్రీనివాస్, సత్యనారాయణ యాదవ్, భైరు అనిల్, వాసుదేవరావు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు న్నారు.

గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలి

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఎన్.సబిత
- ఘట్కేసర్‌లో నిరసన



నవతెలంగాణ-ఘట్కేసర్

కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని సీపీఐ(ఎం)ఘట్కేసర్ మండల కార్యదర్శి ఎన్. సబిత అన్నారు. బుధవారం సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో ఆటోకు తాళ్ళుకట్టి లాగుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సబిత మాట్లాడుతూ.. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు భారీగా తగ్గినా కేంద్ర ప్రభుత్వం ఒకేసారి సిలిండర్‌పై రూ.50 పెంచడం పేదల నడివిరిచే చర్య అన్నారు. ఈ నిర్ణయం వల్ల సబ్సిడీ సబ్సిడీయేతర వినియోగదారులపై తీవ్ర ప్రభావం పడనున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్ ధరల ప్రభావం నిత్యావసర వస్తువుల ధరలపై పడుతుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభ భయంతో ప్రజలు అల్లాడుతుంటే ఉపాధి పెంచి ధరలను తగ్గించాల్సిందిపోయి కేంద్రం గ్యాస్ ధరలను పెంచి ప్రజలపై భారాలను వేస్తున్నదని విమర్శించారు. ఇప్పటికే ప్రజలకు ఉపాధి లేక నిత్యావసర వస్తువులను కొనుగోలు చేయలేని దీన స్థితిలో ఉన్నారని తెలిపారు. ఇలా ధరలు పెంచుకుంటూ పోతే వారు ఎలా బతకాలని ప్రశ్నించారు. పెట్టుబడుదారులకు లక్షల కోట్లు రుణాలు రాయితీలుగా ఇచ్చి ఆ భారాన్ని పేద ప్రజలపై మోపుతున్నదని విమర్శించారు. పెరిగిన గ్యాస్ ధరలతో మహిళలపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. మహిళల ఆర్థిక ప్రయోజనాల గురించి బీరాలు పలికే కేంద్రం మళ్లీ కట్టెల పొయ్యి పెట్టుకొని వంట చేసుకుని పరిస్థితి కల్పిస్తున్నదని ఆమె అన్నారు. ప్రస్తుతం సిలిండర్ ధర రూ.980 ఉందని తెలిపారు. రోజుకు 1038 సిలిండర్‌లను గృహ వినియోగదారులు వినియోగిస్తున్నారని తెలిపారు. దీంతో నెలకు జిల్లా ప్రజలపై అదనపు భారం పడుతుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా మండల ప్రజలు కూడా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కడమంచి యాదగిరి, బి. సునీత, శ్రీ శ్రీ గట్టు మైసమ్మ ట్రాన్స్ పోర్ట్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షులు చెరుకు శ్రీకాంత్ గౌడ్, కోశాధికారి బూడిద స్వామి కమిటీ సభ్యులు నర్రా శేఖర్ ,నడికుడి బాలరాజు, ఎండీ నయన్‌లి పాషా ,చింతపల్లి వెంకటేశం గుంజి వెంకయ్య గంగాధర్ రాజు, దశరథ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పెట్టుబడి సాయం రూ.18వేలకు పెంచాలి

- రూ.2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా హామీలను అమలు చేయాలి
- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ



నవతెలంగాణ-సిటీబ్యూరో

వ్యవసాయానికి పెట్టుబడి సహాయం రూ.6వేల నుంచి రూ.18 వేలకు కేంద్ర ప్రభుత్వం పెంచాలనీ, రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన రూ.2లక్షల రుణమాఫీ, రైతు భరోసా హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలనీ, రాష్ట్రస్థాయి పంటల బీమా పథకాన్ని ఏర్పాటు చేసి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ హాజరై మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతులకు రూ.2లక్షల వరకు, రూ.2లక్షల పైన ఉన్న రుణమాఫీ పూర్తి స్థాయిలో చేయాలనీ, సాగయ్యే భూములన్నింటికీ యుద్ధ ప్రాతిపదికన రైతు భరోసా ఇవ్వాలనీ, రాష్ట్రస్థాయి పంటల బీమా పథకాన్ని ఏర్పాటు చేసి అమలు చేయాలనీ, వర్షాలు, వడగండ్లకు పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలనీ, మిర్చికి క్వింటాకు రూ.25 వేలు, పసుపుకు రూ.20 వేలు ధర చెల్లించాలనీ, ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి రాతపూర్వకంగా ఇచ్చిన హామీ మేరకు పంటలకు కనీస మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలన్నారు. జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానం ముసాయిదాను ఉపసంహరించుకోవాలనీ, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి రూ.6 వేల నుంచి రూ.18 వేలకు పెంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌కు అంతాయిపల్లిలోని సర్వే నెంబర్ 87 లోని 52 ఎకరాల 20 కుంటల భూమిని కలెక్టరేట్ కార్యాలయం కోసం కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. శామీర్‌పేట మండల కేంద్రంలోని సర్వే నెంబర 1284లో రైతులకు పట్టా పాస్ బుక్స్ ఇవ్వాలనీ, కీసర మండలంలోని చీర్యాల గ్రామం ఎస్.కృష్ణ, వెంకటేష్ రైతులకు ధరణి-భూభారతిలోని సమస్యలను పరిష్కరించి పాస్ పుస్తకాల అందివ్వాలనీ, కేశవాపూర్ రిజర్వాయర్‌లో సర్వే నెంబర్ 104/బి, 105/బిలో కాల్వల కోసం భూమిని కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి సంధ్య, రాష్ట్ర కోశాధికారి డి.జి.నరేంద్ర ప్రసాద్, జిల్లా కార్యదర్శి నిమ్మల నర్సింలు, ఏ.బాపురాజు, ఎస్.వెంకటేష్, డీహెచ్ఎస్ రాష్ట్ర నాయకులు సహదేవ్, చీర్ల దర్శన్, చీర్ల కౌసల్య, చీల పద్మ, నరసగారి కమలమ్మ అక్కుల కలమ్మ, 35 మంది రైతు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గ్రూప్-1 ర్యాంకర్ శంతన్ కుమార్ రెడ్డికి అభినందనలు



నవతెలంగాణ-కాప్రా

రాచకొండ కమిషనరేట్‌లో స్పెషల్ బ్రాంచి ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న బుసిరెడ్డి రవీందర్‌రెడ్డి కుమారుడు శంతన్ కుమార్ రెడ్డి ఇటీవల విడుదలైన టీజీపీఎస్సీ గ్రూప్-1 ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో 30వ ర్యాంక్, మల్టీజోన్-2లో 12వ ర్యాంక్ సాధించిన సందర్భంగా కమిషనర్ సుధీర్ బాబు అభినందించారు. ఇలాగే ప్రిపరేషన్ కొనసాగించి యూపీఎస్సీ పరీక్షలలో కూడా ఉత్తీర్ణత సాధించాలని కమిషనర్ ఆకాంక్షించారు. టీజీపీఎస్సీ 30వ ర్యాంక్ సాధించిన శంతన్ కుమార్ రెడ్డి తండ్రి లాగానే డీఎస్పీ అవుతున్నారని కొనియాడారు.

చంద్ర రాజేశ్వరరావు స్ఫూర్తితో పోరాడాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీఎస్. బోస్




నవతెలంగాణ-కాప్రా

నిజాం పునాదులను కదలించిన తెలంగాణ సాయుధ పోరాటంలో అగ్రగామిగా నిలిచి ప్రజల పక్షాన పోరాటం చేసిన చంద్ర రాజేశ్వర్ రావు స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీఎస్. బోస్ అన్నారు. చంద్ర రాజేశ్వర్‌రావు 31వ వర్ధంతి సందర్భంగా ఈసీఐఎల్‌లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్ లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన ట్లాడుతూ ప్రజల అభ్యున్నతి కోసం, సామాజిక ప్రగతి కోసం నిరంతరం జరుగుతున్న విప్లవ పోరాటాల్లో చంద్ర వ్యక్తిత్వం గుర్తించబడినదని తెలిపారు. 8 శతాబ్దాల పైగా తాడిత, పీడిత ప్రజల సేవల్లో ఆయన రాజకీయ జీవితం కొనసాగిందన్నారు. 4 దశాబ్దాలకుపైగా చల్లపల్లి జమీందారులకు వ్యతిరేకంగా వీరోచిత పోరాటం చేసి 2500 ఎకరాల జమీందారు భూములను భూమిలేని నిరుపేద వ్యవసాయ కార్మికులకు పంచిపెట్టారన్నారు. 40వ దశకంలో అప్పటి నిజాం ఆంధ్ర ప్రాంతమైన హైదరాబాద్ సంస్థానంలో నిజాం రాచరికానికి, వెట్టి చాకిరికి, భూస్వామ్య విధానానికి, వ్యతిరేకంగా ఉద్యమమే ఊపిరిగా, పోరాటమే ధ్యేయంగా ఎంచుకొని రైతులను, వ్యవసాయ కార్మికులను సమైక్యం చేసి సాయుధ పోరాటంలో చంద్ర నిర్వహించిన పాత్ర మరువలేమని ఉద్ఘాటించారు. సామాజిక న్యాయం ఆయన చిరకాల వాంఛ అని, దేశ అభ్యుదయం, స్వాతంత్ర పరమార్ధం, సామాజిక, సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని సాధించేందుకు ప్రజాస్వామ్యం సాధనంగా ఉపయోగపడాలన్నది చంద్ర అభిలాష అన్నారు. ఆయన జీవితం చివరిక్షణం వరకు కమ్యూనిస్టుల ఐక్యత కోసం, అసంఖ్యాక జనవాళి విముక్తికోసం తపించిన చంద్ర జీవితం పోరాటాలకు సిద్ధాంత నిబద్ధతకు పర్యాయపదమన్నారు. కార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జీ. దామోదర్ రెడ్డి, సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.శంకర్ రావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె. ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సత్య ప్రసాద్, సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు నారా నర్సింహా,రాఘవేంద్రరావు, సాయిలు, కిరణ్, మురహరి, నదీమ్, మురళి తదితరులున్నారు.

11న జాబ్ మేళా

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.రాధిక



నవతెలంగాణ-సిటీబ్యూరో

నిరుద్యోగ యువతీ, యువకులకు ఈ నెల 11వ తేదీన బొల్లారం ఎయిర్‌పోర్టు రోడ్డు రైల్‌నగర్‌లో జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.రాధిక తెలిపారు. ఫార్మా రంగంలో ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్టు తెలిపారు. లైఫ్ సైన్స్ సెక్టార్ స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్, బయోలాజికల్‌తో కలిసి సంయుక్తంగా 18 నుంచి 30 ఏండ్లు నిండిన యువతకు ఉచిత శిక్షణ ఇచ్చి 100శాతం ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు 9493393797, 7386809422 నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఆసక్తి గల వారు ఎంప్లాయిమెంట్ కోసం (జాబ్ సీకర్) ఆప్షన్‌లో www.employeement.telangana.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకుని ఎంప్లాయిమెంట్ కార్డు పొందగలరు అని తెలిపారు. లైఫ్ సైన్స్ సెక్టార్ స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ అండ్ బయోలాజికల్ ఈ కంపెనీలో ప్రొడక్షన్ మిషన్ ఆపరేటర్ ఇన్ స్టెరిలైన్ ఫార్ములేషన్ కోర్సులు ఉన్నాయనీ, ఇందుకు బీఎస్సీ (బీజెడ్‌సీ), బీ ఫార్మా, డీ ఫార్మా, డిప్లొమా ఇన్ కెమికల్ ఇంజినీరింగ్, ఐటీఐ ఉండాల్సి ఉంటుంది.

ఆప్టోమెట్రిస్ట్‌ల సేవలను సమర్థవంతంగా చేస్తాం

- అప్టోమెట్రిస్ట్ అసోసియేషన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు అజిత్ కుమార్
- దృష్టి సేవల విస్తరణ పై నిర్ణయం



నవతెలంగాణ - చర్లపల్లి

ఆప్టోమెట్రిస్ట్‌ల సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరవేయడం కోసం ప్రభుత్వ సహకారంతో ముందుకెళ్తామని అప్టోమెట్రిస్ట్ అసోసియేషన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు అజిత్ కుమార్ అన్నారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర ఆప్తామాలిక్ అసిస్టెంట్ అప్టోమెట్రిస్ట్ అసోసియేషన్ మేడ్చల్ జిల్లా సమావేశం మల్లాపూర్‌లోని ఏవీఎన్ వాణిజ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా పరిధి లోని నలుమూలల నుంచి సంఘానికి చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడారు. దృష్టి సంబంధిత సేవల ప్రాముఖ్యత, ఉద్యోగ భద్రత వంటి అంశాలపై సభ్యులు విస్తృతంగా చర్చించామన్నారు. తమ సమస్యలను అధికారులకు తెలియజేసే విధానంపై సమావేశంలో తీర్మానాలు తీసుకున్నారు. ప్రభుత్వ దృష్టిని ఆకర్షించేందుకు రాబోయే రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యతిథిగా హాజరైన రిషి హాస్పిటల్ వైద్యులు డా.విజయ్ పాల్ మాట్లాడుతూ.. ఆప్టోమెట్రిస్ట్‌ల సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరవేయడం కోసం ప్రభుత్వం సహకరించాలన్నారు. ఈ సమావేశంలో మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, ఉపాధ్యక్షులు అజయ్, కిషోర్, సంయుక్త కార్యదర్శులు శ్రీనివాస్, అక్బర్, అనిత కోశాధికారి నరేష్ రెడ్డి కమిటీ సభ్యులు అరవింద్ కుమార్, ప్రవీణ్ కుమార్, కర్ణాకర్, పవన్ కుమార్, ఆనంద్ కుమార్, హరీష్ తదితరులున్నారు.

'అమిత్‌షా రాజీనామ చేయాలి'

నవతెలంగాణ - చర్లపల్లి

అంబేద్కర్ ను అవమానపరిచేలా వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖమంత్రి అమిత్ రాజీనామా చేయాలని చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ పిలుపులో భాగంగా చర్లపల్లి డివిజన్ పరిధిలోని చిన్న చర్లపల్లిలో డివిజన్ అధ్యక్షుడు సింగిరెడ్డి వెంకట్‌తో కలిసి "జై బాపు - జై బీమ్ - జై సంవిధాన్" ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బొంతు శ్రీదేవి యాదవ్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను, మన రాజ్యాంగాన్ని అవమానించే బీజేపీ, దాని అనుబంధ సంస్థలు చేస్తున్న దాడులను క్షేత్రస్థాయి నుంచే తిప్పి కొట్టి, భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



అంబేద్కర్ సిద్ధాంతాలు సమాజానికి మార్గదర్శకం



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

అంబేద్కర్ సిద్ధాంతాలు నేటి సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని బీజేఆర్ నగర్‌లో కార్పొరేటర్ వై. ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో జైబాపూ-జైభీమ్-జై సంవిధాన్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మైనం పల్లి పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ కార్పొరేషన్ చైర్మెన్ ఎంఎ ఫహీం, అధ్యక్షులు అశోక్ రెడ్డి, బీ బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, బీకే శ్రీనివాస్, సత్యమూర్తి, బాబు సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు ఉమేష్ సింగ్, సంపత్ గౌడ్, ప్రవీణ్, వినోద్ యాదవ్, పిట్టల శ్రీని వాస్, సంతోష్ రాందాస్, యాదవ్, ఫరీద్, ఇస్తారి, ఆశ, ప్రభ, రోజా రమణి శారద, లాస్య, రాహుల్, కిషోర్, రంగమ్మ, సలీమ్, ఎండీ అక్తర్, ఎండీ మసీద్ తదితరు లున్నారు.

మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డికి మరో ఏడాది పొడిగింపు

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ మెట్రో రైలు ఎండీగా ఎన్వీఎస్ రెడ్డిని ప్రభుత్వం తిరిగి నియమించింది. ఇదివరకు పనిచేసిన స్థానాల్లోనే ఆయన్ను రీఅపాయింట్ చేస్తూ.. బుధవారం తెలంగాణ గవర్నమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.దానకిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. 2026 ఏప్రిల్ ఒకటి వరకు ఆయన పదవిలో కొనసాగుతారని పేర్కొన్నారు. మెట్రో రెండో దశ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలు కీలక దశలో ఉన్నాయి. ఇంతకాలం హెచ్ఎంఆర్ఎల్, హెచ్ఏఎంఎల్ ఎండీగా కీలకంగా వ్యవహరించిన ఎన్వీఎస్ రెడ్డి సేవలను మరికొంత కాలం కొనసాగించడం సముచితం అని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు మరో ఏడాది పాటు ఎన్వీఎస్ రెడ్డిని హెచ్ఎంఆర్ఎల్, హెచ్ఏఎంఎల్ ఎండీగా కొనసాగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కాగా రాష్ట్ర ప్రభుత్వం మెట్రో సెకండ్ ఫేజ్‌ను కీలకంగా భావిస్తోంది. ఓల్డ్ సిటీ, ఎయిర్ పోర్టు, ఫోర్త్ సిటీ, నార్త్ సిటీ వంటి ప్రాంతాలకు కూడా మెట్రో నడిపేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ చర్యలు చేపట్టింది.

టెన్త్ స్పాట్ కేంద్రాల్లో మరిన్ని వసతులు కల్పించండి

- టీపీటీఎఫ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

పదవ తరగతి పరీక్షల మూల్యాంకన కేంద్రాల్లో ఉపాధ్యాయులకు మరిన్ని సదుపాయాలు కల్పించడంతో పాటు సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ హైదరాబాద్ జిల్లా శాఖ(టీపీటీఎఫ్) విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు బుధవారం డీఈవో రోహిణికి వినతిపత్రం అందజేసి.. పలు అంశాలను ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. ప్రధానంగా మూల్యాంకనం నిర్వహిస్తున్న సిబ్బందికి సరిపడా స్టేషనరీ అందించాలనీ, వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా మూల్యాంకనం నిర్వహించే గదులలో కూలర్స్ సదుపాయం కల్పించాలనీ, గదుల్లో, కారిడార్లలో ఎండ తగలకుండా గ్రిల్స్‌కు కర్టెన్స్ ఏర్పాటు చేయాలనీ, రెండు, మూడో అంతస్తుల్లో మూల్యాంకనం నిర్వహించే ఉపాధ్యాయులు, వారి వయసు దృష్ట్యా లిఫ్ట్ సదుపాయం కల్పించాలనీ, గత సంవత్సరం ఎస్ఎస్సీ స్పాట్‌కు సంబంధించి రెమ్యూనరేషన్ విడుదల చేయాలని ఆ సంఘం జిల్లా నాయకులు కోరారు. దీనిపై డీఈవో రోహిణి సానుకూలంగా స్పందిస్తూ.. సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు.

అక్రమ వాటర్ ప్లాంట్‌లను ఆపాలి



- భూగర్భ జలాలు అడుగంటి ఇబ్బందులు పడుతున్నాం
- పాపిరెడ్డి నగర్ కాలనీ వాసులు

నవతెలంగాణ - కూకట్ పల్లి

అక్రమ వాటర్ ప్లాంట్‌ను ఆపాలని ని కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ కాలనీ వాసులు, వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం వారు మాట్లాడుతూ అక్రమ నీటి వ్యాపారంతో కాలనీలో భూగర్భ జలాలు అడుగంటాయని, దాంతో తమ ఇండ్లలోని బోర్‌లు అడుగంటి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. కొందరుర పాపిరెడ్డి నగర్ కాలనీలో పాగా వేసి బోర్ల ద్వారా నీటిని తోడి అక్రమ నీటి వ్యాపారాలు కొనసాగిస్తూ అక్రమార్జన చేస్తున్నారని ఆరోపించారు. వ్యాన్‌ల ద్వారా రోజుకు లక్షల లీటర్ల నీటిని అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. కొందరి స్వార్థం కాలనీ వాసుల పాలిట శాపంగా పరిణమించిందని మండిపడ్డారు. కాలనీలో అక్రమంగా నాలుగు బోర్ల ద్వారా నీటిని తోడేసి అమ్ముకుంటున్నారని ఆరోపించారు. గతంలో 300 నుంచి 400 అడుగుల లోతులో బోర్ వాటర్ లభించేదని, ప్రస్తుతం వెయ్యి నుంచి 15 వందల అడుగులు బోర్ వేస్తే తప్ప నీరు వచ్చే పరిస్థితి లేదన్నారు. కావున సంబంధిత అధికారులు ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రారెడ్డి మాట్లాడుతూ పాపి రెడ్డి నగర్ కాలనీలో కొంతకాలంగా అక్రమంగా వాటర్ ప్లాంట్ లను నిర్వహిస్తున్న నిర్వాహకులు ఈ ఆదివారం లోపు స్వయంగా వాటిని నిలిపివేయాలని కోరారు. నగరంలో అక్రమ వాటర్ ప్లాంట్‌లపై కాలనీవాసులందరూ తిరగబడ్డారని ఉదాహరణలు గుర్తు చేశారు. తమ కాలనీలో సైతం నీటి ఇబ్బందులు తట్టుకోలేని ప్రజలు తిరగబడే రోజులు దగ్గరికి వచ్చాయని, కాలనీవాసులు, వెల్ఫేర్ అసోసియేషన్‌కు తరచూ ఫిర్యాదులు చేస్తున్నారని చెప్పారు. ఇకనైనా నీటి దందా మానుకోవాలని సూచించారు.

పెంచిన గ్యాస్ ధరను ఉపసంహరించుకోవాలి

- సీపీఐ(ఎం) కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్
- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో షాపూర్‌లో నిరసన ర్యాలీ



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ బండపై రూ. 50ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ(ఎం) కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్, మండల కమిటీ సభ్యులు, బి సత్యం డిమాండ్ చేశారు. బుధవారం షాపూర్ రైతుబజార్ నుంచి శుభం హెూటల్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం షాపూర్ ప్రధాన రోడ్ పై నిరసన వ్యక్తం చేస్తూ రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వంట గ్యాస్ ధర పెంచడం మూలంగా పేద మధ్యతరగతి ప్రజలపై తీరని భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేక నిత్యవసర వస్తువులు ధరలు పెరిగి తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలపై గ్యాస్ బండ భారం మోపటం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. అంతర్జాతీయ వ్యాప్తంగా ఆయిల్ ధరలు తగ్గుముఖం పట్టినప్పటికీ దానికి అనుగుణంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాల్సిన మోడీ ప్రభుత్వం ఆయిల్ కంపెనీల లాభాల కోసం ప్రజలపై భారాలు మోపుతున్నారని మండిపడ్డారు. పెంచిన గ్యాస్ ధరలను తగ్గించేంతవరకు పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు ఈ దేవదానం, డి కరుణాకర్, రావుల స్వాతి, ఎస్.కె కలీల్, జి వెంకన్న, భాష దుర్గనాయక్, యాదవరెడ్డి, నర్సింహులు, గోపి, సాదులు , తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి



- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- కార్పొరేటర్లతో సమీక్ష

నవతెలంగాణ - కూకట్ పల్లి

ఈనెల 27న నిర్వహించే బీఆర్ఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ కార్పొరేట ర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు,ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల ఇప్పటికే అట్టడుగు వర్గాల నుంచి ఉన్నత స్థాయి వర్గాల వరకు అందరూ తీవ్రంగా నష్టపోతున్నారని, ఈ ప్రజా వ్యతిరేక పాలనను ప్రతి ఒక్కరికీ తెలిసేలా ఎండగట్టాలని చెప్పారు. నేడు చిరు వ్యాపారస్తులు కూడా ఎంతో సతమతమవుతున్నారన్నారు. పార్టీ బహిరంగ సభకు కార్యకర్తలు, నాయకులు ప్రజలు స్వచ్ఛందంగా తరలి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ముద్దం నరసింహ యాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి, పండాల సతీష్ గౌడ్, జూపల్లి సత్యనారాయణ, పగుడాల శిరీష బాబురావు, మందడి శ్రీనివాసరావు, సబియా గౌసుద్దీన్, మహేశ్వరి శ్రీహరి, పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గం కోఆర్డినేటర్ సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్లు తూము శ్రావణ్ కుమార్, పగడాల బాబురావు, మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి నాయకులతోనూ సమీక్ష

శేరిలింగంపల్లి నియోజకవర్గ నాయకులతోనూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సాయిబాబా, మాధ వరం రంగారావు, నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు, శ్రీనివాస్ గౌడ్, వాళ్ల హరీష్ రావు, కలిదిండి రోజా, రామకృష్ణ, గోపా శ్రీనివాస్, పి శ్రీకాంత్, కలీం , సిద్ధం శ్రీకాంత్, నక్క శ్రీనివాస్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉపశమనాన్ని అందించనున్న చల్లటి మజ్జిగ కేంద్రం



- కార్పొరేటర్ రవీందర్ రెడ్డి, బాలానగర్ సీఐ నరసింహారాజు

నవతెలంగాణ - బాలానగర్

ప్రజల దాహార్తిని తీర్చేందుకు చల్లటి మజ్జిగ కేంద్రం ఉపశమనాన్ని అందిస్తుందని కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి, బాలానగర్ సీఐ నరసింహారాజు అన్నారు. బాలానగర్ డివిజన్ పరిధిలోని రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం బాలానగర్ ప్రధాన రహదారిపై భారత్ లాడ్జి పక్కన బాటసా రులకు "ఉచిత మజ్జిగ" కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా వారు విచ్చేసి రిబ్బన్ కట్ చేసి చలివేంద్ర కేంద్రాన్ని ప్రారంభిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో చల్లని మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీ యమన్నారు. సికింద్రాబాద్ మీదుగా కూకట్ పల్లి వెళ్లే తదితర వాహనదారులు వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచు కుని మార్గమధ్యంలో ఉన్న ఈ కేంద్రాన్ని ఉపయోగిం చుకోవాలన్నారు.ముఖ్యంగా రహదారిపై ప్రయాణించే పారిశ్రామిక ప్రాంతంలో కార్మికులు, మహిళలు, ప్రయాణి కులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం బాలానగర్ అధ్యక్షులు దొంతిరి సోమిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం వీరేందర్ రెడ్డి, కోశాధికారి ఇ. మహేందర్ రెడ్డి సంఘం సభ్యులు ఓ వెంకట్ రెడ్డి, కిషోర్ కుమార్ రెడ్డి, వై శ్రీనివాస్ రెడ్డి, సిహెచ్ వెంకట్ రెడ్డి, నర్సిరెడ్డి, రబ్బర్ శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, దామోదర్ రెడ్డి, కృష్ణారెడ్డి, వి రవీందర్ రెడ్డి, సభాపతి రెడ్డి, మల్లారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, సి రమేష్ రెడ్డి, సత్యపాల్ రెడ్డితో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు మందడి సుధాకర్ రెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-దుండిగల్

విద్యుత్ లైన్ నిర్వహణ పనుల కారణంగా గౌరీ ఆశ్రమం ఫీడర్ పరిధిలో లో గురువారం ఉదయం 10.00 గం ల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు మల్లా రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, జేఎస్ఎస్‌యూఆర్ఎమ్, బాహదూర్ పల్లి, మెయిన్ రోడ్ హనుమాన్ టెంపుల్,బాహదూర్ పల్లి ప్రాంతాల్లో అలాగే ఇందిరమ్మ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు బహదూర్ పల్లి గ్రామం, కెఎస్ఆర్ హెూమ్స్, గౌరీ ఆశ్రమం, మొదలైన ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందని బౌరంపేట విద్యుత్ శాఖ ఏఈ బి.సాయి కిరణ్ తెలిపారు. ఈ అంతరాయానికి ప్రజల సహకరించాలని కోరారు.



సమస్యలు పరిష్కరించాలని ఎంపీకి వినతి పత్రం

నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్ పల్లి నియోజకవర్గంలోని పలు సమస్యలపై ఎంపీ ఈటెల రాజేందర్ కు ఆయన కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మూసాపేట కార్పొరేటర్ మహేందర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు శంకర్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సురేందర్ రెడ్డి, కేపీహెచ్‌బీ కంటెస్టెడ్ కార్పొరేటర్ ప్రీతం రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు జి. రమేష్, పిట్ల మనోహర్,కొత్తూరి రమేష్, డివిజన్ అధ్యక్షులు ఎర్రస్వామి, కిరణ్ కుమార్ మహిళా నాయకులు శివరంజని, శ్రీలత, రూప తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ విజయ యాత్రను ప్రశాంతంగా జరుపుకోవాలి

- బాలానగర్ ఏసీపీ హనుమంత రావు



నవతెలంగాణ - బాలానగర్

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని బాలానగర్ డివిజన్‌లో హనుమాన్ జయంతిని శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని బాలానగర్ ఏసీపీ హనుమంత రావు, బాలానగర్ సీఐ నర్సింహా రాజు తెలిపారు. ఈ నెల 12న హనుమాన్ జయంతి ఉత్సవాల నిర్వహణపై సీఐ నర్సింహా రాజు ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీలతో బాలానగర్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో శాంతి సమావేశం బుధవారం నిర్వహించారు. బాలానగర్ ఏసీపీ హనుమంత రావు అధ్యక్షత వహించి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ పరిమితికి మించి శబ్దంతో కూడిన సౌండ్ బాక్సులు వాడకూడదని స్పష్టం చేశారు. అదేవిధంగా డీజేలకు అనుమతులు ఇవ్వబోమని స్పష్టం చేశారు. ప్రజలు పోలీసులకు సహకరించి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. అనుమతుల కోసం నిర్వాహకులు ముందే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అనుమతులు పొందినవారికి సైబరాబాద్ పోలీస్ తరఫున పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని ఏసీపీ తెలిపారు. ఈ సమావేశంలో డీఐ నాగిరెడ్డి, ఎస్సైలు రాంనారాయణ్, సరితా రెడ్డి, సరళ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ భూముల పరిరక్షణకు కృషి

- బాచుపల్లి ఎమ్మార్వో పూల్ సింగ్ చౌహాన్

నవతెలంగాణ-నిజాంపేట్

బాచుపల్లి మండలంలోని ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం కాకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్టు బాచుపల్లి మండల తహసీల్దార్ పూల్ సింగ్ వెల్లడించారు. మండలంలోని ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను . బుధవారం ఆయన సందర్శించి రెవెన్యూ సిబ్బందికి తగు ఆదేశాలను ఇచ్చారు. నిత్యం ప్రభుత్వ స్థలాలను సందర్శిస్తూ కబ్జాలు జరగడానికి అవకాశం ఉన్న ప్రాంతాలను ఎప్పటికప్పుడు సూపర్వైజింగ్ చేస్తూ స్థలాలను పరిరక్షించాలని సిబ్బందికి సూచించారు. అలాగే ప్రభుత్వ స్థలాలలో ఎక్కడా అక్రమ కట్టడాలు వెలిసినా తక్షణమే అవి తొలగించేటట్టు సిబ్బందిని అప్రమత్తం చేశారు. బాచుపల్లి నిజాంపేట్ సమీపంలోని డబుల్ బెడ్రూమ్స్ స్థలాల వద్ద ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఎలక్ట్రిసిటీ సబ్ స్టేషన్ ఏర్పాటుకు గాను ఐదు ఎకరాలను మంజూరు చేసినట్టు ఆయన తెలిపారు. మండల పరిధిలోని బీజేపీ నాయకులు బిక్షపతి యాదవ్,నరేంద్ర చౌదరి,ప్రసాద్ రాజులు ఇచ్చిన అభ్యర్థనల మేరకు తహసీల్దార్ ప్రభుత్వ స్థలాలను సందర్శించి అంతా సక్రమంగానే ఉన్నట్టుగా నిర్ధారించుకున్నారు. ఆయన వెంట బాచుపల్లి మండల రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

జై బాపు , జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర..



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి కోలన్ హన్మంత్ రెడ్డి ఆదేశాల మేరకు 129 డివిజన్ సూరారం మాజీ కార్పొరేటర్ పాల క్రిష్ణ , అధ్యక్షులు సంతోష్ ముదిరాజ్‌ల అధ్వర్యంలో కష్ణ నగర్ లోని ఆదర్శ్ నగర్ ఎన్ .టీ .ఆర్ విగ్రహం నుంచి సుమిత్ర నగర్ వరకు బుధవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోలన్ హన్మంత్ రెడ్డితో కలిసి సీనియర్ కాంగ్రెస్ నాయకులు అచ్చమ్మ, లలిత, యాదమ్మ లావణ్య, రజాక్, మబ్బుల్, జి నారాయణ, లడ్డు (కష్ణ), ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దేశ రాజ్యాంగాన్ని మార్చే కుట్రలను ప్రజలందరికీ తెలియచేస్తూ, జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాణ అంబేడ్కర్ త్యాగాలను తెలియజేస్తు ప్రజలను చైతన్యవంతం చేయడం కోసమే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు తెలిపారు.

నిజాంపేట్‌లో జై బాపు... జై సంవిధాన్ పాదయాత్ర

నిజాంపేట్ : కాంగ్రెస్ నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 18, 19వ డివిజన్‌లలో బుధవారం "జై బాపు... జై సంవిధాన్ పాదయాత్ర" నిర్వహించింది. ర్యాలీలో కాంగ్రెస్ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జి కొలను హనుమంత రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ కార్పొరేషన్ అధ్యక్షుడు కె. రాజశేఖర్ రెడ్డి, కె. శ్రీనివాస్ రెడ్డిలు ఈ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పలు సంక్షేమ పథకాల విషయం, డివిజన్‌లోని స్థానికులకు కార్యకర్తలు వివరించి చెబుతున్నారు. దేశంలో బీజేపీ అ ప్రజాస్వామిక నిర్ణయాలు తీసుకుంటూ ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నదని నేతలు తమ ప్రసంగాలలో విమర్శించారు. ఈ కార్యక్రమంలో 18వ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలను వీరేందర్ రెడ్డి, పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి కార్యదర్శి కొలను బాల్ రెడ్డి, కమ్మెటనారాయణ, పార్టీ 19వ డివిజన్ అధ్యక్షుడు డీలర్ శంకర్, పార్టీ 18వ డివిజన్ అధ్యక్షుడు కె. రాజేందర్,పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు,ఆయా డివిజన్‌ల నుంచి స్థానిక పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



నాణ్యమైన ఆహారాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యం



- కాంగ్రెస్ కూకట్ పల్లి ఇన్‌చార్జి బండి రమేష్

నవతెలంగాణ - బాలానగర్

రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే మొట్టమొదట అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రతి పేదవాడికి నాణ్యమైన ఆహారాన్ని అందించాలనే లక్ష్యంతో సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించిందని కాంగ్రెస్ కూకట్ పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ తెలిపారు. బుధవారం బాలానగర్‌కు చెందిన రవి ముదిరాజ్ ఆహ్వానం మేరకు కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డితో పాటు ఆయన వారి నివాసానికి వెళ్లి సన్న బియ్యంతో భోజనం చేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ సన్న బియ్యం పథకం ద్వారా లబ్దిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారని, రేషన్‌దుకాణాల్లో సన్నబియ్యం తీసుకునేందుకు క్యూ కడుతున్నారన్నారు. మొన్నటి వరకు రేషన్‌దుకాణాల వైపు చూడని వారంతా సన్నబియ్యం పంపిణీ మొదలు కాగానే ఆగమేఘాల మీద పరుగులు పెట్టుకుంటూ వస్తున్నారని, డీలర్లు రోజంతా దుకాణంలో ఉంటూ అర్హులైన వారందరికీ అందజేస్తున్నారని తెలిపారు. అర్హులైన లబ్దిదారులు రాష్ట్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలనికోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ పుష్పా రెడ్డి, మాజీ. వైస్ చైర్మెన్ ఎం. లక్ష్మయ్య, సీనియర్ నేతలు పులి శ్రీకాంత్ పటేల్, పులి శివకుమార్ గౌడ్, మధుసుదన్, శివ చౌదరి, రమణ, తదితరులు పాల్గొన్నారు.



శ్రీ రామ రథయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ - కూకట్‌పల్లి

వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని, సప్తగిరి కాలనీలో గల శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరిగిన శ్రీ సీతారాముల పట్టాభిషేకం మహెూత్సవం కార్యక్రమంలో భాగంగా జరిగిన రథయాత్ర లో సీనియర్ నాయకులు నాయినేనీ చంద్రకాంత్ రావుతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని పీఏసీ చైర్మెన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఊరేగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సప్తగిరి కాలనీ, వివేకానంద నగర్ కాలనీ పురవిధులలో ఘనంగా రథయాత్ర ఊరేగింపు చేసినట్టు తెలిపారు. రథ యాత్ర ఎంతో అంగరంగ వైభవంగా జరిగిందని చెప్పారు. చంద్రశేఖర్, శర్మ, నాయకులు దేవి నేనీ ప్రసాద్,చంద్రశేఖర్ హర్ష ప్రదీప్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం



- కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

నవతెలంగాణ-కూకట్ పల్లి

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయమని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలో ఉన్న డంపింగ్ యార్డ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా హాజరై రాంకీ జోనల్ ఇన్‌చార్జి రవి నాయక్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఈ వేసవిలో డంపింగ్ యార్డ్ కార్మికులు, సామాన్య ప్రజల దాహార్తిని తీర్చే చలివేంద్రాలను ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. ఎండలకు ఇబ్బంది పడకుండా దాహాన్ని తీర్చుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, పోశెట్టిగౌడ్, వాసుదేవరావు, వాలి నాగేశ్వరరావు, శివ కష్ణ, ఎస్.ఆర్.పి గోపాల్ నాయల్, డంపింగ్ ప్రెసిడెంట్ డి.కష్ణ, ఎం.అంజి, ఏ. జయన్న తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని ఇటీవలే అనారోగ్య పరిస్థితులతో ఆస్పత్రిలో చికిత్స పొందిన దుంపటి కిషన్‌కు రూ. 52,500, కాదలి దుర్గాప్రసాద్‌కు రూ. 40,000, ముచర్ల రమాదేవికి రూ. 30,000 సీఎంఆర్ఎఫ్ చెక్కులను కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ తన నివాసం వద్ద సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ సీఎం సహాయనిధి నిరుపేదలకు కొండంత అండగా మారిందాన్నారు. బడుగు, బలహీన వర్గాల ఆశజ్యోతి సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పేద,మధ్యతరగతి ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించడమే రేవంతన్న ఆశయం అన్నారు. ఈ కార్యక్రమంలో బి.శివకుమార్ గౌడ్, మాజీ కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి,సంజీవ్ కుమార్, అరుణ్ కుమార్, మాక్బుల్, మోటే శ్రీనివాస్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.





ఆల్విన్ కాలని డివిజన్ ఎల్లమ్మ బండ లోని అంబేద్కర్ నగర్ వాసులు జీడిమల్ల లక్ష్మికి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వంలో నిర్మించి ఇచ్చిన కొల్లూరు లోని, డబుల్ బెడ్రూమ్ ఇండ్లల్లో బ్లాక్ నంబర్94లోని డబుల్ బెడ్ రూమ్ ఇలు లబ్ది చేకూరడంతో బుధవారం వారి గృహప్రవేశ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లబ్దిదారుడి ఆహ్వానం మేరకు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు పాల్గొని లబ్దిదారుల కుటుంబానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

నవతెలంగాణ - కూకట్‌పల్లి

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



- డా. అరుణ వెంకట్

నవతెలంగాణ-ఓయూ

మహిళలు అన్ని రంగాల్లో మరింతగా రాణించాలని ఓయూ సైన్సు కళాశాల ఆడిటోరియంలో జరిగిన అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకల్లో డా. అరుణ వెంకట్ అన్నారు. ఉమెన్స్ ఎంపవర్‌మెంట్ సెల్ ఓయూ సైన్స్ కాలేజ్ ముఖ్య అతిథులుగా గైనికాలజిస్ట్ డా అరుణ వెంకట్ హాజరై మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. ఉద్యోగం, కుటుంబంతో పాటు ఆరోగ్యంపైకూడ శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ మొట్టమొదటి మహిళ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. శైలజ, సైన్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొ. ప్రభాకర్, ఉమెన్స్ కమిటీ చైర్ పర్సన్, డిప్యూటీ రిజిస్ట్రార్ ప్రణీత, ఉమెన్స్ కమిటీ అధ్యక్షురాలు హైమావతి, సభ్యులు సుహాసిని, వరలక్ష్మి, అపర్ణ, ప్రీతి, సుధా, సునీత, సురేఖ తోపాటు ఓయూలో ఉన్న మహిళ ఆఫీసర్స్, మహిళ ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం వారు ఉల్లాసంగా ఉత్సహం గడిపారు.

సత్యనారాయణ మృతికి ఎమ్మెల్యే నివాళి



నవతెలంగాణ-బేగంపేట్

పార్టీ కార్యక్రమాలలో ఎంతో చురుకుగా పాల్గొనే సత్యనారాయణ మృతి చాలా బాధాకరం అని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విచారం వ్యక్తం చేశారు. బేగంపేట్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సత్యనారాయణ మంగళవారం సాయంత్రం గుండెపోటుతో మంణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బుధవారం బేగంపేట్‌లోని చీకోటి గార్డెన్‌లోని వారి నివాసానికి వెళ్లి సత్యనారాయణ భౌతికకాయంపై పూలమా లలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు. ఆయన వెంట కార్పొరేటర్ టి.మహేశ్వరి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, నాయకులు శ్రీహరి, నరేందర్ రావు, శేఖర్, ఆరీఫ్, ఆకుల హరికృష్ణ తదితరులు ఉన్నారు.

అక్రమ అరెస్టులు ఖండించిన ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ-ఓయూ

రాష్ట్ర వ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల అక్రమ అరెస్టులను ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ ఎల్ మూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అరెస్ట్ అయిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వము ఎప్పుడు లేనంతగా రాష్ట్రంలో నిర్బంధాన్ని అమలు చేస్తుంది. ప్రజాస్వామ్య గ్యారెంటినీ తుంగలో తొక్కి ప్రశ్నిస్తే ఉద్యమ కార్యచరణ ప్రకటిస్తే ముందస్తు అరెస్టులు చేస్తున్నారు. అరెస్టులు చేయడం నిర్బందాన్ని అమలు చేయడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇలాంటి నిర్ణయాలు విరమించుకోవాలని ఆయన కోరారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ రిక్రూమెంట్ మార్గదర్శకాలను యూజీసీ మార్గదర్శకాల కనుగుణంగా అభ్యర్థులు నష్టపోకుండా నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తుంది. వెంటనే గైడ్ లైన్స్ మార్చాలని లేకపోతే ఉద్యమ కార్యచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు.

బీసీ సంక్షేమం కోసం కృషి చేసే వారు బీసీలై ఉండాలా..



- బీసీ సంఘాల నాయకులు

నవతెలంగాణ-బంజారాహిల్స్

బీసీ సంక్షేమం కోసం కృషి చేసే వారు బీసీలై ఉండాలా అని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో బీసీ సంఘాల నాయకులు మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాన్ని అసెంబ్లీలో ప్రతిష్ఠించాలని ఇందిరాపార్క్ వద్ద చేసిన దీక్ష స్థలాన్ని శుభ్రపరచిన కాంగ్రెస్ నేతలు ఆ ఫినాయిల్‌తో వారి నోరులను శుభ్రపరుచుకోవాలని సూచించారు. ఎంపీ, ఎమ్మెల్యే స్థాయిలో ఉన్న వ్యక్తులు ఒక మహిళ పట్ల ఇటువంటి భాష వాడడం సబాబు కాదని కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డిలు బీసీలా, బీసీ సంఘాల కోసం పనిచేస్తున్నానని చెబుతున్న జాజుల శ్రీనివాస్ గౌడ్ అధికారంలో ఏ పార్టీ ఉంటే ఆ పార్టీకి వత్తాసు పలుకుతూ.. మాట్లాడడం అందరికీ తెలిసిన విషయమేనని అన్నారు. ఇప్పటికీ కులం పేరుతో వివక్ష చూపించే దౌర్భాగ్యకరణమైన పరిస్తితి దేశంలో ఉండటం బాధాకరమన్నారు. రాజస్థాన్ ప్రతిపక్ష నేత గుడికి వెళ్తే గుడి మైలపడిందని సంప్రోక్షణ చేశారని గుడిలో సహపంక్తి భోజనాలు చేస్తే పాలతో శుద్ధి చేసిన ఘటనలు ఉన్నాయన్నారు. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం అనేవి కేవలం మాటల్లోనే ఉన్నాయనీ చేతల్లో చూపించాలనే లక్ష్యంతో తాము కవితక్క ఆధ్వర్యంలో పనిచేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే యాదగిరి ముదిరాజ్, ఓయూ జేఏసీ నాయకులు డా. కందుల మధు, బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే విజయ రావు, బీఆర్ఎస్ నేత బానోతు వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఔట సీ రాష్ట్ర అధ్యక్షుడు హౌస్ అరెస్ట్



నవతెలంగాణ-ఓయూ

రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం కాంట్రాక్టు ఉద్యోగులు తలపెట్టిన ఛలో ఉన్నత విద్యామండలి కార్యక్రమంలో భాగంగా ఔట సీ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఎ. పరశురాం ను అయిన నివాసంలో హౌస్ అరెస్ట్ చేసిన అనంతరం నల్లకుంట పోలీసు స్టేషన్ కు తరలించారు. జీఓ 21ను రద్దు చేసి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని అప్పటి వరకు తమ ఉద్యమం ఆగదని చెప్పారు.

14 నుంచి మహనీయుల జయంతి ఉత్సవాలు



నవతెలంగాణ-ఓయూ

ఓయూ వేదికగా మహనీయుల ఆలోచన విధానంతో తెలంగాణ విద్యార్థి ఫోరం స్థాపించబడి, అక్షరమే ఆయుధంగా ముందుకు వెళ్తొందని భావితరాల భవిష్యత్తు తలరాతలు మార్చిన మహనీయులు మహాత్మ జ్యోతిబాపూలే, భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న డా. బాబాసాహెబ్ అంబేద్కర్‌ల జయంతి ఉత్సవాలు జరుపుకోవడం జరుగుతుందని రాష్ట్ర అధ్యక్షుడు ఆశాడపు మధు పేర్కొన్నారు. ఈ మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా, మహనీయుల ఆలోచన విధానం, వారి జీవిత చరిత్రల పైన వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఏప్రిల్ 30న జయంతి ఉత్సవాల ముగింపు రోజున వ్యాసరచన పోటీలో గెలిచిన వారికి నగదు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వబడునని, విద్యార్థిని విద్యార్థులు వేల సంఖ్యలో హాజరు కావాలని కోరారు. బుధవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట పోస్టర్స్ విడుదల చేశారు. కార్యక్రమంలో టీవీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఆశాడపు మధు, టీవీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం వీరస్వామి, టీజేఎస్ నాయకులు డప్పు గోపి, బాలగల్ల గోవర్ధన్, ప్రదీప్, శ్రీను, పవన్, నరేష్, ఉదయ్ ప్రవీణ్, లోకేష్, కేశవ్, నాగరాజు, మహేష్ యాదవ్ విద్యార్థులు పాల్గొన్నారు.

నల్లాకు మోటార్ బిగిస్తే రూ.5 వేలు జరిమానా..!

- తక్షణమే మోటర్ సీజ్... కనెక్షన్ కట్
- సప్లై సమయంలో లైన్ల వారిగా తనిఖీలు
- రంగంలోకి లైన్ మెన్ నుంచి ఎండీ వరకు
- నల్లా నీటి సరఫరాలో 'లోప్రెషర్'కు చెక్
- టార్గెట్ 'మోటర్ ఫ్రీ టాప్ వాటర్' కార్యాచరణ
- ఏప్రిల్ 15 నుంచి వాటర్ స్పెషల్ డ్రైవ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

వేసవిలో తాగు నీటి ఎద్దడి ఏర్పడకుండా ఉండేందుకు సాధ్యమైన అన్ని మార్గాలపై జలమండలి ప్రత్యే దష్టి సారించింది. ఇప్పటి వరకు తాగునీరు సరఫరాలో ఎలాంటి కొరత లేనప్పటికి కొందరు వినియోగదారుల తీరుతో 'లో ప్రెషర్' (తక్కువ ఒత్తిడి)తో నీటి సరఫరా సమస్య ఉత్పన్నం కావడాన్ని జలమండలి సీరియస్‌గా పరిగణించింది. నల్లాకు అక్రమంగా మోటర్లు బిగించే కనెక్షన్ దారులపై కొరఢా ఝులిపించాలని నిర్ణయించింది.

వాస్తవ పరిస్థితిపై థర్డ్ పార్టీ ద్వారా ఆరా..

కొందరు నల్లాలకు మోటర్లు బిగిస్తుండటంతో 60 శాతం కనెక్షన్ దారులకు హైప్రెషర్‌తో సమద్ధిగా నల్లా నీరు సరఫరా అవుతోంది. ఇక మోటరు లేని 40 శాతం వినియోగదారులల్లో 20 శాతం సాధారణంగా, మరో 20 శాతం లోప్రెషర్‌తో కూడిన నీరు సరఫరా అవుతుండటంతో మెట్రో కస్టమర్ సెంటర్(ఎంసీసీ)కు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. దాంతో జలమండలి వాస్తవ పరిస్థితిపై థర్డ్ పార్టీ ద్వారా ఆరా తీసింది. ఈ క్రమంలో నీటి సరఫరా సమయంలో నల్లాలకు మోటర్లు బిగిస్తున్నట్లు గుర్తించింది. నీటి ప్రెషర్ కోసం కోసం వినియోగించే సాధారణ మోటర్లతోపాటు తాజాగా మార్కెట్‌లో వచ్చిన ఆటోమెటిక్ మెటర్ల కూడా వినియోగిస్తుండటంతో హైస్పీడ్ ప్రెషర్ పెరిగి దిగువ, చివరి కనెక్షన్‌దారులకు నీటిసరఫరా అంతంతమాత్రంగా తయారైనట్లు బయట పడింది. నల్లాలకు బిగించే సాధారణ మోటర్లు ఆన్‌చేస్తే పనిచేస్తుండగా, ఆటోమెటిక్ మోటర్లు నల్లా సరఫరా ప్రారంభంకాగానే ఆటోమెటిక్‌గా పనిచేయడం ప్రారంభిస్తుండటంతో మిగితా కనెక్షన్లకు ప్రెషర్‌తో కూడిన నీటి సరఫరా సమస్యగా తయారైంది.

జూమ్ మీటింగ్‌ల ద్వారా ఆదేశాలు

జలమండలి ద్వారా సరఫరా జరిగే నల్లా నీరు లో ప్రెషర్‌తో కాకుండా ఎప్పటిక మాదిరిగానే సరఫరా జరిగే విధంగా జలమండలి ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. రెండు రోజుల క్రితం లో ప్రెషర్ ఫిర్యాదులు అధికంగా గల ఓ అండ్ డివిజన్ 6లోని సుమారు 110 లైన్‌మెన్లతో ఎండీ అశోక్ రెడ్డి ప్రత్యేక జూమ్ మీటింగ్ నిర్వహించారు. కారణాలను అడిగి తెలుసుకున్నారు. గతంలో నీటి సరఫరా, ప్రస్తుతం నీటి సరఫరా ఎంజీడీలు, సమయాల్లో ఎలాంటి తేడా లేనప్పటికి కొన్ని కనెక్షన్‌కు 80 శాతం నీరు, మరికొని కనెక్షన్లకు 20 శాతం నీరు సరఫరా కావడమేమిటని ప్రశ్నించారు. మోటర్లు బిగించే నల్ల కనెక్షన్ల దారులను గుర్తించి, తక్షణమే మోటర్లను సీజ్ చేసి జరిమానా విధించాలని సూచించారు.

నాలుగు దశలుగా తనిఖీలు (బాక్స్)

వేసవిలో 'మోటర్ ఫ్రీ టాప్ వాటర్' లక్ష్యంగా నాలుగు దశల తనిఖీలకు జలమండలి సిద్ధమైంది. నల్లా నీటి సరఫరాలో లో ప్రెషర్‌కు చెక్ పెట్టి సాధారణ స్థాయి వత్తిడితో నీటి సరఫరా జరిగే విధంగా 'మోటర్ ఫ్రీ టాప్ వాటర్' పేరుతో ఈ నెల 15 నుంచి వాటర్ స్పెషల్ డ్రైవ్ అమలు శ్రీకారం చుట్టాలని నిర్ణయించింది. క్షేత్ర స్థాయిలో నల్లానీటి సరఫరా సమయంలో లైన్‌మెన్ నుంచి ఎండీ వరకు పర్యటించి తనిఖీలు నిర్వహించనున్నారు. వేసవి ముగిసే వరకు ఆకస్మిక తనిఖీలు కొనసాగనున్నాయి.

▸▸ లైన్‌మెన్లు వాటర్‌వాల్వ్ తిప్పగానే సరఫరా చేసే లైన్లలో కనెక్షన్ టూ కనెక్షన్ పరిశీలించి వాటర్ ప్రెషర్, మోటర్ల వినియోగాన్ని గుర్తిస్తారు.

▸▸ రెండో దశలో మరుసటిరోజు (రోజు విడిచి రోజు) సెక్షన్ మేనేజర్ అదే లైన్‌లో నల్లా నీటిసరఫరా.. మోటర్ల వినియోగాన్ని గుర్తించి నల్లాకు మోటర్ బిగిస్తే రూ.5 వేలు జరిమానా విధించి తక్షణమే మోటర్ సీజ్ చేస్తారు. క్యాన్ నెంబర్‌ను బ్లాక్ లిస్టులు పెడుతారు. ఆ తర్వాత లైన్ల వారిగా (క్యాన్‌నెంబర్ల జాబితా)తో 'మోటర్ ఫ్రీ టాప్‌వాటర్' లైన్లుగా జీఎంలకు ఆన్‌లైన్ నివేదిక సమరిస్తారు.

▸▸మూడో దశలో మేనేజర్ల నివేదిక ఆధారంగా జీఎంలు క్షేత్ర స్థాయిలో లైన్లను ర్యాండమ్‌గా పరిశీలించి సంతప్తి వ్యక్తమైతే సీజీఎంలకు నివేదిక సమర్పిస్తారు. అక్కడ నుంచి డెరెక్టర్, డైరెక్టర్‌నుంచి మేనేజింగ్ డైరెక్టర్ లాగిన్ కు రోజువారిగా ఆన్‌లైన్ నివేదిక సమర్పిస్తారు.

▸▸నాలుగో దశలో ఆ నివేదికలను బట్టి క్రాస్ చెక్ కోసం సీజీఎం, డైరెక్టర్, ఎండీలు క్షేత్ర స్థాయిలో ర్యాండమ్‌గా తనిఖీలు నిర్వహిస్తారు. జరిమానాలు విధించడం, మోటర్లు సీజ్ చేయడంకొనసాగిస్తారు.

తప్పుడు నివేదిక సమర్పిస్తే...

మోటర్ ఫ్రీ టాప్ వాటర్ సర్వేలో ఏ స్థాయిలో కూడా సమగ్ర పరిశీలన జరపకుండ తప్పుడు నివేదిక సమర్పిస్తే మాత్రం ఆ స్థాయి అధికారి పనితీరు అంచనా వేసి ర్యాంకింగ్ విధించడంతోపాటు మోమోను జారీ చేయాలని జలమండలి నిర్ణయించింది. అదేవిధంగా ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసే డ్యాష్ బోర్డులో ఆన్‌లైన్ ఆధారంగా ప్రతిరోజు నివేదికలను పర్యవేక్షిస్తారు. ఇప్పటికే వాటర్ వాల్వ్‌ను జీయోట్యాంగింగ్ చేసి ఆన్‌లైన్ లాగిన్‌కు అనసుసంధానం చేశారు. సెక్షన్‌నంచి ఎండీ వరకు పర్యవేక్షించేందుకు వెసులు బాటు కల్పించారు.

ప్రత్యేకమైన యాప్ రూపకల్పన..:

నీటి నల్లాలకు మోటార్లను బిగించి అక్రమంగా నీటిని తోడుతున్న వారికి జరిమానా విధించడానికి, జలమండలి సరఫరా చేస్తున్న నీటిని తాగు నీటికి కాకుండా ఇతర అవసరాలకు వినియోగించే వారి పై కఠిన చర్యలు తీసుకోవడానికి ప్రత్యేకమైన మొబైల్ యాప్‌ను రూపొందించింది. ఈ యాప్ ద్వారా నీటి నల్లాలకు మోటార్లను బిగించినా, తాగడానికి కాకుండా ఫ్లోర్లు కడగడం, వాహనాలు శుభ్రం చేయడం, గార్డెనింగ్, ఓవర్ హెడ్ ట్యాంక్ నుంచి ఓవర్ ఫ్లో, నిర్మాణ పనుల కోసం నీటిని వధా చేస్తే జరిమానా విధించడానికి ఈ యాప్‌ను రూపొందించారు. రెండు రోజుల్లో ఈ యాప్‌ని జీఎంనుంచి క్షేత్ర స్థాయిలోని లైన్ మెన్ల వరకు అందరికీ అందుబాటులోకి తెస్తారు. వీరు ఆ ప్రాంతాల్లో ఇల్లీగల్ మోటార్లను బిగించి అక్రమంగా నీటిని తోడుతున్న వారిని, నీటి వధా చేస్తున్న వినియోగదారులను గుర్తించి ఫోటోతో సహా యాప్ లో అప్లోడ్ చేయడం.. సదరు కనెక్షన్ గుర్తించి ట్యాగ్ చేయడం తో వెంటనే ఆ కన్స్యూమర్ కనెక్షన్ నెంబర్ పై జరిమానా మంజూరు చేయడంతో సదరు వినియోగ దారుడి కనెక్షన్ అకౌంట్‌కు పెనాల్టీ జమవుతుంది. అలాగే ఈ మొత్తం వచ్చే నెల బిల్ లో చెల్లించేలాగా రూపొందించారు. అనంతరం రెండో దశలో నీటి సంరక్షణ కోసం చేసేందుకు ఏ పౌరులకు సైతం వాలెంటర్ గా యాప్ ద్వారా ఫిర్యాదు చేసే అవకాశం కల్పిస్తారు.

నల్లా మోటర్ బిగించడం చట్టరీత్యా నేరం ..!

నల్లాలకు అక్రమంగా మోటార్లు విధించడం చట్టరీత్యా నేరం. కొందరి వల్ల మిగిలిన వినియోగదారులకు లో ప్రెషర్‌తో నీటి సరఫరా జరుగుతోంది. ఎవరైనా వినియోగదారులు ఇలా తమ నల్లాలకు మోటార్లు బిగించి పట్టుబడితే.. వారిపై జలమండలి నిబంధనల ప్రకారం జరిమానా విధించడంతోపాటు మోటార్లు సీజ్ చేస్తారు. ఒకటికి రెండు సార్లు పట్టుబడితే కేసులు పెడుతారు. వినియోగదారులెవరూ నల్లాకు మోటార్లు బిగించవద్దు. ఒకవేళ తక్కువ ప్రెషర్‌తో నీరు సరఫరా అయినా.. లేదా నీటి సరఫరాలో ఏవైనా ఇతర సమస్యలు తలెత్తినా.. సంబంధిత మేనేజర్, డీజీఎం, జీఎం అధికారులను సంప్రదించాలి. లేదా జలమండలి కస్టమర్ కేర్ నంబర్ 155313కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. వాటిపై తగిన చర్యలు తీసుకుని సమస్యల్ని పరిష్కరిస్తారు.

తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించాలి: ఎండీ

నల్లాల నుంచి మోటార్ల ద్వారా నీటిని తోడితే కఠిన చర్యలు తీసుకుంటామని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం జలమండలి ప్రధాన కార్యాలయంలో ఓ అండ్ ఎమ్ సీజీఎం, జీఎం లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ జలమండలి ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి జలమండలి సుదూర ప్రాంతాల నుంచి నీటిని శుద్ధిచేసి సరఫరా చేస్తోందని, నీటిని వధా చేయకుండా వాటిని తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించాలని కోరారు. ఇప్పటికే నగరంలో భూగర్భ జలాలు అడుగంటిపోగా కొన్ని ప్రాంతాల్లో ట్యాంకర్లకు డిమాండ్ పెరిగిందన్నారు. రానున్నరోజులలో నీటికి ఇబ్బంది అయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు తాగునీటికై సరఫరా చేసే శుద్ధమైన నీటిని వధా చేయకూడని విజ్ఞప్తి చేశారు. నల్లలకు మోటార్లు బిగించి నీటిని తోడితే మిగితా వినియోగదారులకు లో ప్రెషర్ తో నీటి సరఫరా కావడంతో ఇబ్బంది పడుతున్నారని వివరించారు. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్, ఈఎన్సీ-ఆపరేషన్ డైరెక్టర్ -2 వీఎల్ ప్రవీణ్ కుమార్, ఆపరేషన్ డైరెక్టర్ -1 అమరేందర్ రెడ్డి, సీజీఎంలు, జీఎంలు, డీజీఎంలు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలు ప్రాణదాతలతో సమానం

- గుమ్మడి వెన్నెల, మోతె శ్రీలత శోభన్ రెడ్డి, రోహిన్ రెడ్డి



నవతెలంగాణ-ఓయూ

అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు రక్తదానం చేసేవారు ప్రాణదాతలతో సమానమని రాష్ట్ర సాంస్కృతిక సారథి కార్పొరేషన్ చైర్ పర్సన్ గుమ్మడి వెన్నెలగద్దర్, గ్రంథాలయ కార్పొరేషన్ చైర్మెన్ రియాజ్, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత రెడ్డి, కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు రోహిన్ రెడ్డి అన్నారు. బుధవారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో అధ్యక్షుడు మేడ శ్రీను ఆధ్వర్యంలో ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని వారు ప్రారంభించారు. రక్తదానం చేయడం ద్వారా శరీరానికి ఆరోగ్యం కలుగుతుందని, అపోహలను నమ్మొద్దని, యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం గత 55 ఏండ్లుగా ఎన్ఎస్‌యూఐ అలుపెరగని పోరాటం నడుపుతుందన్నారు. యువత మహనీయుల స్పూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగ నియామకాలు చేపట్టిందన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకే రాజీవ్ యువ వికాసం పథకం రూపొందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రితేష్ రావు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మిట్టపల్లి వెంకటేష్, తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుడు మోతే శోభన్ రెడ్డి, నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉషా కిరణ్ ,తెలంగాణ మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి నిర్మలారెడ్డి, జేఏసీ రాష్ట్ర కన్వీనర్ శ్రీరాముల శివ, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రచనా రెడ్డి, సింగరేణి ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు గొల్ల రమేష్, ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కొండ నాగేశ్వర్ రావు, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకులు, హెచ్‌యూసీ, ఎన్ఎస్‌యూఐ నాయకులు, హైదరాబాద్ జిల్లా ఎన్ఎస్‌యూఐ నాయకులు, రంగారెడ్డి జిల్లా ఎన్ఎస్‌యూఐ నాయకులు, ఓయూ ఎన్ఎస్‌యూఐ నాయకులు వికాస్ యాదవ్ పాల్గొన్నారు.

మత సామరస్యానికి మారుపేరు ఈద్ మిలాప్

- ఓయూ వీసీ ప్రొ. కుమార్



నవతెలంగాణ-ఓయూ

మత సామరస్యనికి మారు పేరు ఈద్ మిలాప్ అని ఓయూ వీసీ ప్రొ. కుమార్ అన్నారు. బుధవారం ఓయూ మూడు ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఓయూ నాన్ టీచింగ్ హోంలో ఏర్పాటు చేసిన ఈద్ మిలాప్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. నరేశ్ రెడ్డి, ఓఎస్డీ ప్రొ. జితేందర్ నాయక్, డైరెక్టర్ డా.హమీదబీలు ప్రసంగించారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు కె.భీమాయ్య, ఎ. రవి, కె.ఎస్.నాగరాజా రావు, ఎస్.విజయ్ కుమార్, టి.శివ కుమార్, అక్బుక్ బేగ్, మూడు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం ఉద్యోగులు ఆనవాయితీగా ఏర్పాటు చేసి షేర్ కర్మను సేవించారు.

15న మన ఆలోచన సమితి ఆవిర్భావ సదస్సు



- కటకం నర్సింగ్ రావు

నవతెలంగాణ-బంజారాహిల్స్

47 ఏండ్ల సంఘ పరివారంలో సేవలందించిన గుర్తింపు లేదనీ కటకం నర్సింగ్ రావు ఆవేదన వ్యక్త పరిచారు. మన ఆలోచిన సాధన సమితినీ ఆవిష్కరించిన ఆయన బీసీ సంక్షేమ లక్ష్యసాధన కోసం ఈ సమితి పనిచేస్తుందని ఈనెల 15న చలో ఎగ్జిబిషన్ గ్రౌండ్ నాంపల్లిలో జరిగే ఆవిర్భావ సదస్సు రాజకీయాలకు అతీతంగా జరుగుతున్న నేపథ్యంలో తెలంగాణ నలదిక్కుల నుంచి తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ప్రధానోపాధ్యాయులు గడ్డం నరసింహ గౌడ్, మాజీ ఆర్టీసీ అధికారి ఆర్టీసీ తెలంగాణ దొంత ఆనందం, నేరెళ్ల దేవేందర్, పూస నరసింహలతో కలిసి గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయ, బద్దం బాల్‌రెడ్డి, టైగర్ నరేంద్ర, ప్రస్తుత కేంద్ర మంత్రులు రాజ్యసభ సభ్యులు డా. లక్ష్మణులతో కలిసి ఓబీసీ మోర్చాలో సుదీర్ఘకాలం పనిచేసిన తాను ప్రస్తుత రాజకీయాలు పార్టీలో వరుసగా జరుగుతున్న ఘటనలు తనను మనస్థాపానికి ఉరిచేశాయని తెలియజేస్తూ బీజేపీ రాజీనామా లేక సమర్పించి రాజకీయాలకు అతీతంగా బీసీ కులాల ఆర్థిక, ఉద్యోగ అభివృద్ధి ఐక్యత కోసం పనిచేస్తానని తెలిపారు. ఈ వేదికపై బీసీ వాదం కోసం పనిచేసే సామాజిక, ఉద్యోగ, సంఘాల ముఖ్య నాయకులు పాల్గొని పరిచయ వేదికలో ప్రసంగించినట్టు ప్రకటించారు.

సమయానికి చికిత్స అందిస్తే.. భవిష్యత్తుకు పునాదులు వేయగలం



- మానసిక స్థితిగతులను అరికట్టాలంటే వైద్య సేవలు ముఖ్యం
- సైకియాట్రిస్ట్ శివ అనూప్ ఎల్లా

నవతెలంగాణ-బంజారాహిల్స్

పిల్లలు జన్మించిన రెండేండ్ల లోపు ఆటిజం లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వారికి వైద్యం అందించవలసిన అవసరం ఎంతైనా ఉందని అనన్య చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రముఖ సైకియాట్రిస్ట్ శివ అనుప్ ఎల్లా తెలిపారు. ఈ మేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌ల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో అనన్య సీడీసీ వ్యవస్థాపకురాలు ఆది మల్ల మాధవి, డాక్టర్ అనిల్ కుమార్, లక్ష్మీ ప్రసన్న ప్రణవ్ కుమారులు మాట్లాడారు. ఆటిజం ఉన్న చిన్నారులలో వారు జన్మించిన రోజు నుంచి రెండేండ్లలోపు లక్షణాలను గుర్తించి సరైన జాగ్రత్తలు పాటించడంలో తల్లిదండ్రులకు అవగాహన ఎంతో ముఖ్యమని అన్నారు. లేనిపక్షంలో ఆటిజం ప్రభావంతో కాలక్రమేనా పిల్లలలో ఎదుగుదల ఆగిపోతుందని తెలిపారు. అందుకే అనన్య చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో మూడు నెలలు ఆటిజం ఉన్న పిల్లలకు ఉచిత స్క్రీనింగ్ అందించనున్నామని ఆటిజం సొసైటీ ఆఫ్ ఏపీ, తెలంగాణ మాధవి తెలియజేస్తూ.. రెండు తెలుగు రాష్ట్రాల తల్లిదండ్రులు ఈ ఉచిత స్క్రీనింగ్ కొరకు అనన్య చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ వెబ్‌సైట్ www.asap.org.in లో సంప్రదించవచ్చని తెలిపారు.

కిమ్స్-సన్‌షైన్ ఆధ్వర్యంలో రీనల్ డెనర్వేషన్ థెరపీ సెంటర్





నవతెలంగాణ-బేగంపేట్

దేశంలోనే మొట్టమొదటి సారిగా బేగంపేట్‌లోని కిమ్స్-సన్ షైన్ హాస్పిటల్ మెడ్రానిక్ సంస్థతో కలిసి రీనల్ డెనర్వేషన్ థెరపీ క్లినిక్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నట్టు కిమ్స్-సన్‌షైన్ హాస్పిటల్స్ హెడ్ ఆఫ్ కార్డియాలజీ అండ్ కార్డియోథోరాసిక్ సర్జన్ డా. శ్రీధర్ కాస్తూరి తెలిపారు. బుధవారం కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్‌లో ప్రపంచస్థాయి వైద్య సాంకేతికత రంగంలోని ఒకటైన మెడ్ట్రానిక్ సంస్థతో కలసి రీనల్ డెనర్వేషన్ థెరపీ కోసం ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ భాగస్వామ్యం మేమొరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్ (ఎంఓయూ) ద్వారా అధికారికంగా కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ డా. బి. భాస్కర్ రావు ఈ మాట్లాడుతూ.. సాంప్రదాయ చికిత్సలతోనూ నియంత్రణ లోకి రాని హైపర్‌టెన్షన్ నేడు అత్యంత తీవ్ర ఆరోగ్య సమస్యగా మారిందని, మెడ్ట్రానిక్‌తో మేము చేస్తున్న ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం ఆధునిక, ఆధారిత చికిత్సలను అందించడంలో విప్లవాత్మక ముందడుగుగా పిలుస్తుందన్నారు. ఇది కేవలం సాంకేతికత విషయమే కాదు, ఇది మా వైద్యులకీ, రోగులకీ సమగ్ర శిక్షణ, జ్ఞానం, అనుభవాలను కలిసివచ్చే హోలిస్టిక్ కేర్ వ్యవస్థను నిర్మించాలనే దిశగా ముందుకు తీసుకెళ్తోందదని మేము హైపర్‌టెన్షన్ నిర్వహణకు కొత్త ప్రమాణాలను స్థాపించేందుకు కృషి చేస్తున్నామని ఈ సందర్భంగా తెలిపారు. కిమ్స్-సన్‌షైన్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డా.ఏవి గురవారెడ్డి మాట్లాడుతూ.. ఈ భాగస్వామ్యంతో నియంత్రించలేని రక్తపోటుతో బాధపడే రోగులకు ఆధునిక చికిత్సను అందించాలనే ప్రయత్నంలో ఒక గొప్ప ముంద డుగు అన్నారు. మెడ్ట్రానిక్ సంస్థ అందించే టెక్నాలజీని మా నిపుణత్వంతో కలిపి, హైపర్‌టెన్షన్ నిర్వహణలో కొత్త యుగానికి దారితీస్తున్నాము. మా లక్ష్యం కేవలం వైద్య ఫలితాలను మెరుగుపరచటం మాత్రమే కాదు, ఔషధ చికిత్సలకు మించి శాశ్వతమైన పరిష్కారాలను అందించడం ద్వారా రోగులను శక్తివంతులుగా చేయడమే అన్నారు. మెడ్ట్రానిక్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, వైస్ ప్రెసిడెంట్ మందీప్ సింగ్ కుమార్ మాట్లాడుతూ.. మెడ్ట్రానిక్‌లో మేము స్థిరమైన ఆవిష్కరణలు, సమర్థవంతమైన భాగస్వామ్యాల ద్వారా ఆరోగ్య సంరక్షణను రూపాంతరం చేయాలనే నిబద్ధత కలిగి ఉన్నామని తెలిపారు. కిమ్స్-సన్‌షైన్ హాస్పిటల్‌తో భాగస్వామ్యం ద్వారా, మెడికల్ ప్రొఫెషనల్స్‌కు అభివృద్ధి చెందిన శిక్షణను అందించడమే కాకుండా, రీనల్ డెనర్వేషన్ థెరపీపై అవగాహన పెంచడానికీ ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. కిమ్స్-సన్‌షైన్ హాస్పిటల్స్ హెడ్ ఆఫ్ కార్డియాలజీ అండ్ కార్డియోథోరాసిక్ సర్జరీ డా. శ్రీధర్ కాస్తూరి మాట్లాడుతూ.. హై బీపీ కారణంగా హార్ట్ ఫెయిల్యూర్, కిడ్నీ ఫెయిల్యూర్, పక్షవాతం, మెదడులో రక్తస్రావం సంబవిస్తున్న 100 మరణాల్లో 10 మరణాలు ఉంటున్నాయని తెలిపారు. అడల్ట్స్‌లో ప్రతి ముగ్గురిలో ఒకరికి హైబీపీతో బాధపడుతున్నారని ఐసీఎంఆర్ గైడ్‌లైన్స్ ప్రకారం తెలుస్తుందన్నారు. రెగ్యులర్‌గా మందులు వాడుతున్న రక్తపోటు కోసం రెండు లేదా అంతకంటే ఎక్కువ మందులు వాడుతున్న వారికి రీనల్ డెనర్వేషన్ థెరపీ ప్రొసీజర్ ద్వారా చికిత్స అందించడం ద్వారా రక్తపోటు కంట్రోల్లోకి రావడంతో పాటు వారు రోజు వారుగా వాడే మందులను కూడా తగ్గించుకోవచ్చు అని తెలిపారు. ఈ సమావేశంలో కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్స్ సీఓ ఓ సుధాకర్ జాదవ్ తో పాటు కార్డియాలజిస్టులు డా. శైలేందర్ సింగ్, డా. విజయకుమార్, డా. కావ్యతో పాటు డిపార్ట్‌మెంట్ వివిధ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు పాల్గొన్నారు.



అమీర్‌పేట్ ఎల్లారెడ్డి గూడలోని శ్రీ ధనలక్ష్మి సోనా బాయి దేవాలయ 161 సందర్భంగా వేలం పాటలో దేవి అలంకరణలో ఉన్న పట్టు చీరను రూ. 55 వేలకు సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్ దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈవో నరేందర్ రెడ్డి, అర్చకులు మధుసూదన్, కిరణ్, మనోజ్, విజయ్ యాదవ్, మాజీ చైర్మెన్ శరత్ గౌడ్, చిన్న, మహేష్ ముదిరాజ్ లు(హనుమాన్ టెంపుల్ చెర్మన్), గణేష్, ఇతరులు పాల్గొన్నారు. -నవతెలంగాణ, బంజారాహిల్స్

మహనీయుల జయంతి ఉత్సవాలు పోస్టరావిష్కరణ

నవతెలంగాణ-హయత్ నగర్

ఈ నెల 11న కొత్తపేటలోని బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ల జయంతి, బీపీ మండల్ వర్ధంతి కార్యక్రమాలను విజయవంతం చేయాలని పలువురు వక్తలు కోరారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఎల్బీనగర్‌లోని మహాత్మా పూలే విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ సమాజం సమూల అభివృద్ధికి, బడుగుల ఆత్మగౌరవానికి పోరాటం చేసిన మహనీయులు మహాత్మ జ్యోతిరావు పూలే, అంబేద్కర్, బీసీ రిజర్వేషన్ల ప్రదాత బీపీ మండల్ అని కొనియాడారు. వారు వేసిన బాటలో పయనించడం వల్లే నేడు అభివృద్ధి ఆత్మ గౌరవం అందుకోగలుగుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ బీసీ నేతలు పంజాల జైహింద్ గౌడ్, చామకూర రాజు, కె వి గౌడ్, వీరమల్ల లింగయ్య గౌడ్, ఆప్కా గజేంద్ర యాదవ్, వాసు కె యాదవ్, వేముల కొండల గౌడ్, బోయపల్లి లింగస్వామి, నకిరేకంటి శ్రీనివాస్ గౌడ్, తండా ఉపేంద్ర యాదవ్, ఘోర శ్యాంసుందర్ గౌడ్, కుమార్, బైరు శేఖర్, వెంకటాచారి, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలపై నమ్మకం కలిగేలా సేవలు అందించాలి



- పిల్లల హాజరు శాతం పెరగాలి.. పనిచేయని టీచర్లకు మెమోలు జారీ చేయాలి
- కేంద్రాల్లో సీడీపీవోలు, సూపర్‌వైజర్ల నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలి
- పోషణ పక్షోత్సవాలు విజయవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- పోషణ పక్షోత్సవాల పోస్టరావిష్కరణ

నవతెలంగాణ-సిటీబ్యూరో

పోషక విలువలు ఉన్న ఆహారాన్ని అందించడంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలపై నమ్మకం కలిగేలా అంగన్‌వాడీ టీచర్లు పనిచేసి హైదరాబాద్ జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ పథకాలపై మహిళా సంక్షేమ అధికారి అక్కేశ్వరరావుతో కలిసి ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు అత్యధికంగా పిల్లలు హాజరయ్యేలా చూడడంతో పాటు వారికి పోషక విలువలతో కూడిన ఆహారం, మెరుగైన సేవలు అందించి కేంద్రాలపై నమ్మకం కలిగేలా చూడాలన్నారు. హైదరాబాద్ జిల్లాను రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. లక్ష్యం మేరకు ప్రతి సూపర్‌వైజర్ నెలకు 15 సెంటర్లను, సీడీపీవో 10 సెంటర్లను క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలు, గర్భిణీలు వచ్చేలా చూడాలని, కేంద్రాల్లో పిల్లల హాజరు శాతం తక్కువగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు తమ పనితీరు మెరుగుపరుచుకోవాలనీ, కేంద్రాలకు వచ్చే పిల్లల్లో ఆరోగ్యరీత్యా నాణ్యమైన పోషక విలువల గల ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. రాష్ట్రంలో అన్ని అంశాల్లో 80శాతం ఉందని కేంద్రాలకు వచ్చే పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు ఇంకా మెరుగైన సేవలు అందించి 95 శాతం వరకు పెంచాలన్నారు. ప్రతి సెగ్మెంట్ కింది నుంచి నుంచి ఐదో స్థానంలో ఉన్న టీచర్లకు మెమోలు జారీ చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలపై నమ్మకం కలిగేలా పనిచేయాలన్నారు. కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలకు అనుమతులు తీసుకోవాలని, విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఏరియాతో పాటు మరికొన్ని అంగన్‌వాడీల్లో పిల్లల హాజరు శాతం పెంచాలనీ, లేనిపక్షంలో సిబ్బందిపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఇప్పటి వరకు వచ్చిన ఫోక్సో కేసులకు సంబంధించి ఇంకా ఎంత చెల్లించవలసి ఉన్నదని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. హైదరాబాద్ జిల్లాలోని సీసీఐ, శిశు విహార్, అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలోని 0-5 సంవత్సరాలలోపు పిల్లలకు ఆర్‌బీఎస్‌కే వైద్యులచే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఆరోగ్యరీత్యా వివిధ రకాల టీకాలు అందించాలన్నారు. అలాగే పుట్టుక లోపాలు, ఎదుగుదల లోపాలు, అనుకున్న దాని కంటే ఎక్కువ బరువుతో పాటు వివిధ సమస్యలతో బాధపడుతున్న వారికి గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. స్లమ్ ఏరియాలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు అల్పాహారం అందించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నివేదికలను ఆన్‌లైన్ ద్వారా పంపాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, శిశు విహార్, చిల్డ్రన్ హెూం, రెస్క్యూ హెూం అలాగే సఖి కేంద్రం నిర్వహణ, పోస్కో చట్టం అమలు, భేటీ బచావో - బేటి పడావో, హెల్ప్‌లైన్ నిర్వహణపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా పోషణ పక్షం గోడపత్రికను ఆవిష్కరించారు. పోషణ పక్షోత్సవాలను విజయవంతం చేయాలనీ, ఆ దిశగా అనుబంధ శాఖల అధికారులు నిబద్ధతతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో అక్కేశ్వరరావు, డీఐవో డాక్టర్ శ్రీధర్, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో జై భీమ్- జై బాపు-జై సంవిధాన్ ర్యాలీ





నవతెలంగాణ-కాప్రా

అంబేద్కర్‌ను అవమానించేలా మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్ షాను భర్తరఫ్ చేసి, పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాల మేరకు జై భీమ్, జై బాపు, జై సంవిధాన్ నినాదంతో రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీని కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి, కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి, డివిజన్ అధ్యక్షులు కొబ్బనూరి నాగేషు ఆధ్వర్యంలో కాప్రా పరిధిలోని గాంధీనగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. రాజ్యాంగంపై గాని రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పట్ల కేంద్ర హెూమ్ మంత్రి అవహేళనగా మాట్లాడటం సిగ్గు చేటన్నారు. దేశం పట్ల ప్రేమ గౌరవంలేని వారుమాత్రమే రాజ్యాంగాన్ని విమర్శిస్తాని తెలిపారు. ఇలాంటి వారు చట్టసభల్లో ఉంటే దేశానికే ప్రమాదమన్నారు. డివిజన్ అధ్యక్షులు కొబ్బనూరి నాగేషు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగా వ్యతిరేక పార్టీ అనడానికి పార్లమెంట్‌లో అమిత్ షా మాట్లాడిన మాటలే నిదర్శనం అన్నారు. ప్రజలు బీజేపీకి బుద్ధిచెబుతారని తెలిపారు. పత్తికుమార్ మాట్లాడుతూ..రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత దేశంలోని ప్రతి పౌరుడు పై ఉందన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. రాజ్యాంగాన్ని మార్చడానికి బీజేపీ చేస్తున్న కుట్రలను ప్రజలకు అవగాహన కల్పించడానికి జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి పౌరుడు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్,మల్కాజిగిరి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పత్తికుమార్, మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ విఠల్ నాయక్, మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ఏఎంసీ డైరెక్టర్ పూర్ణ యాదవ్, మాజీ డైరెక్టర్ కొబ్బనూరి నాగరాజు, కృష్ణ, వెంకట్, ఆరీఫ్, విక్రమ్ గౌడ్, అలీ, అజయ్, సిద్దిక్, రామ్ చందర్, పి. విజయ్, ప్రవీణ్, జి. లక్ష్మి, జ్యోతి, అరుణ, శైలజ, షాబుద్దీన్, గుణశేఖర్, రాజన్, చిన్న ఉన్నారు.

గాంధీ, అంబేద్కర్, ఔన్నత్యాన్ని తెలిపేందుకు

జై బాపు, జై భీమ్, జై సంవిధాన్'



అదం సంతోష్ కుమార్

నవతెలంగాణ-ఓయూ

గాంధీ, అంబేద్కర్ ఔన్నత్యాన్ని తెలపడానికి, రాజ్యాంగ విలువను కాపడడానికి జై భీమ్, జై బాపు, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, కంటెస్టేడ్ ఎమ్మెల్యే అదం సంతోష్‌కుమార్ అన్నారు. బుధవారం సికింద్రాబాద్ నియోజకవర్గం బౌద్ధ నగర్ డివిజన్‌లో పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్మెన్ కల్వ సుజాత, హాజరయ్యారు. ఈ సందర్భంగా బాపూజీ, డాక్టర్ అంబేద్కర్, భారత రాజ్యాంగం చిత్రపటాలను చేతిలో పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు మహనీయుల గురించి, రాజ్యాంగం గురించి వివరించారు. అనంతరం అదం సంతోష్ మాట్లాడుతూ.. దేశ రాజ్యాంగం అమలుకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగాన్ని బీజేపీ పార్టీ అనాగదొక్కాలని చూస్తుందన్నారు. గాంధీ, అంబెద్కర్ ఆశయాలను సిద్ధాంతాలను దేశంలో అమలు చేయాల్సిన సమయం వచ్చిందన్నారు. ప్రధానికి పేద ప్రజల కంటే బడా బాబులే ముఖ్యం అన్నారు. రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం కాదు, అంబెద్కర్, గాంధీ పూలే లాంటి గొప్ప వాళ్ళ ఆలోచనలతో కూడిన ఒక పవిత్ర గ్రంథం అన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకొని రావాలన్నారు. యువకుల కోసం యువ వికాసం పథకం ద్వారా సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ కల్పిస్తున్నామన్నారు. కల్వ సుజాత మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన ప్రభుత్వం, ఆరు గ్యారెంటీలను ఒక్కొకటి అమలుపరుస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన అప్పులను తప్పులను సరిదిద్దుకుంటూ సీఎం రేవంత్ రెడ్డి ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధిని చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అనిల్ కుమార్, షకీల్, చక్రం, బబ్లూ, శ్రీకాత్, బాబు, మహేష్, కిరణ్, తుమ్మ రాజు, నాని, రాధ, గీతాంజలి, రజిత, కవిత, లడ్డు మహేందర్ పాల్గొన్నారు.

రేపు యూనివర్సిటీల బంద్

కాంట్రాక్టు అధ్యాపకులు

నవతెలంగాణ-ఓయూ

ఉన్నత విద్యామండలి వద్ద కాంట్రాక్టు అధ్యాపకులను అరెస్టుకు నిరసనగా కాంట్రాక్ట్ అధ్యాపకులు నేడు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని యూనివర్సిటీ బంధుకు పిలుపునిచ్చారు. అక్రమంగా అరెస్ట్ చేసి నగరంలో వివిధ పోలీసు స్టేషన్స్‌కు తరలించడం బాధాకరని అధ్యాపకులు వాపోయారు. బుధవారం సాయంత్రం కాంట్రాక్టు అధ్యాపకులు సమావేశం అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకులు పాల్గొన్నారు.

బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలి

● ఈడీ మయాంక్ మిట్టల్



నవతెలంగాణ-సిటీబ్యూరో

జలమండలి రెవెన్యూ పెంచాలని ఈడీ మయాంక్ మిట్టల్ అధికారులకు సూచించారు. బుధవారం ఖైరతాబాద్ ప్రధాన కార్యాలయంలో జలమండలి అధికారులతో రెవెన్యూ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడు తూ రెవెన్యూ పెంచేందుకు అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. ఇప్పటీవరకు అధిక బకాయి ఉన్న కనెక్షన్లను గుర్తించి ప్రత్యేక దృష్టి సారిస్తే ప్రతినెల బోర్డుకు మరింత ఆదాయం సమకూరనుందని ఈడీ తెలిపారు. అలాగే వాణిజ్య కనెక్షన్ల బకాయిలపైన దష్టి సారించాలని, దీర్ఘ కాలంగా బిల్లులు చెల్లించని వాణిజ్య కనెక్షన్ల నుంచి బకాయిలు వసూలు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జలమండలి ఈఎన్సీ- ఆపరేషన్ డైరెక్టర్-2 వీఎల్ ప్రవీణ్ కుమార్, ఆపరేషన్ డైరెక్టర్ -1 అమరేందర్ రెడ్డి, సీజీఎంలు, జీఎంలు, డీజీఎంలు తదితరులు పాల్గొన్నారు.

'26 బీసీ కులాలను బీసీ జాబితాలో చేర్చాలని సిఫార్సు చేయడం హర్షణీయం'

నవతెలంగాణ-హిమాయత్ నగర్

కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పొందుపరిచిన విధంగా తొలగించిన 26 బీసీ కులాలను బీసీ జాబితాలో చేర్చాలని తెలంగాణ ప్రభుత్వానికి బీసీ కమిషన్ సిఫార్సు చేయడం హర్షణీయమని తొలగించిన 26 బీసీ కులాల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ల రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయంపై పలుమార్లు కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ, రాష్ట్ర సీఎం ఎ.రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని గుర్తు చేశారు. దీనిపై వారు స్పందించి బీసీ కమిషన్ కు లేఖ రాయడం సంతోషించదగ్గ విషయమన్నారు. తొలగించిన 26 బీసీ కులాల డేటాను బీసీ కమిషన్ సేకరించి బుధవారం తెలంగాణ ప్రభుత్వానికి సిఫారసు చేసిందన్నారు. ఈ సందర్భంగా సీఎం ఎ.రేవంత్ రెడ్డి, మంత్రి మండలికి, బీసీ కమిషన్ చైర్మెన్ నిరంజన్, సభ్యులకు ఆళ్ల రామకృష్ణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆలె నరేంద్ర స్ఫూర్తితో ప్రజా అభ్యున్నతికి కృషి చేయాలి

● కార్పొరేటర్ పావని వినయ్ కుమార్



నవతెలంగాణ-ముషీరాబాద్

ఆలె నరేంద్ర స్ఫూర్తితో ప్రజాభ్యున్నతికి కృషి చేయాలని కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ అన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ క్రియాశీలక కార్యకర్త, మాజీ కేంద్ర మంత్రి స్వర్గీయ ఆలె నరేంద్ర వర్ధంతి సందర్భంగా బుధవారం గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో బీజేపీ సికింద్రా బాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, డివిజన్ బీజేపీ శ్రేణులతో కలిసి ఆలె నరేంద్ర చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పావని మాట్లాడుతూ నరేంద్ర స్ఫూర్తితో నాయకులు, కార్యకర్తలు ప్రజాభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షులు వి.నవీన్ కుమార్,సీనియర్ నాయకులు శ్రీకాంత్, దామోదర్, ఎం.ఉమేష్, సత్తి రెడ్డి, ప్రకాష్ యాదవ్, అశోక్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, సురేష్, లక్ష్మణ్ యాదవ్, దోనేటి సత్యం, డి.కుమార్, రహామత్ అలీ, నీరజ్ తదితరులు పాల్గొన్నారు.

జార్జ్‌రెడ్డి 53వ వర్ధంతి సభలను విజయవంతం చేయండి

● పీడీఎస్‌యు గ్రేటర్ హైదరాబాద్ కమిటీ



నవతెలంగాణ-ముషీరాబాద్

కామ్రేడ్ జార్జిరెడ్డి 53వ వర్ధంతి సభలను విజయవంతం చేయాలని పీడీఎస్‌యు గ్రేటర్ హైదరాబాద్ కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం విద్యానగర్ లోని మార్క్స్ భవన్‌లో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యు జాతీయ నాయకులు పి.మహేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష కార్యదర్శులు మంద రవి, కె. శ్రీనివాసులు మాట్లాడుతూ కామ్రేడ్ జార్జిరెడ్డి ఆశయాల సాధనకు విద్యార్థులు పోరాడాలని ఆయన 53వ అమరత్వాన్ని స్మరించుకుంటూ ఏప్రిల్ 10 నుంచి 14 తేదీ వరకు వర్ధంతి సభలను ఘనంగా జయప్రదం చేయాలని విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం గౌతమ్, ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షులు ఆసిఫ్, జిల్లా సహాయ కార్యదర్శి శ్యామ్, జిల్లా కోశాధికారి ఝాన్సీ, నాయకులు మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సొసైటీ బంజారాహిల్స్ షేక్‌పేట్ మండల కన్వీనర్‌గా రమేశ్ కోడిచెర్ల

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



హైదరాబాద్ మాసబ్ ట్యాంక్‌లో గల రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ శాఖకు చైర్మెన్ మామిడి భీమ్‌రెడ్డి, సామాజిక సేవకులు రమేష్ కోడిచెర్లను రెడ్ క్రాస్ సొసైటీ బంజారా హిల్స్ రోడ్ నెంబర్2, షేక్‌పేట్ మండలానికి కన్వీన ర్‌గా రమేష్‌ను నియమిస్తూ ధ్రువీకరణ పత్రం అందించి ఘనంగా సన్మానించారు. రమేష్ మాట్లాడుతూ.. నాపై నమ్మకంతో షేక్‌పేట్ మండల కన్వీనర్‌గా బాధ్యతలు అప్పగించినందుకు రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ శాఖ చైర్మెన్‌కు ధన్యవాదాలు ఈ బాధ్యతను సమర్థ వంతంగా నిర్వహిస్తానని తెలిపారు.

'ఒలంపియాడ్ ఫలితాల్లో నల్లకుంట శ్రీ చైతన్య విద్యార్థుల ప్రభంజనం'



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ఇంటర్నేషనల్ టాలెంట్ సర్చ్ ఒలంపియాడ్ పరీక్ష ఫలితాల్లో నల్లకుంట శ్రీ చైతన్య విద్యార్థులు విజయ ప్రభంజనం సృష్టించారు. బుధవారం విద్యానగర్ లోని నల్లకుంట శ్రీ చైతన్య స్కూల్ బ్రాంచీలో పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక బహుమతి ఒకరికి ప్రథమ స్థానం, రెండవ స్థానంలో ఇద్దరు, మూడవ స్థానంలో ఒకరు, నాలుగవ స్థానంలో ఇద్దరు, ఐదవ స్థానంలో ముగ్గురు, అదనంగా 61 మందికి కన్సోలేషన్ బహుమతులు, 140 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, 8 మందికి స్పెషల్ బహుమతులు, మెరిట్ సర్టిఫికెట్స్ అందచేశారు. మొత్తంగా 219 విద్యార్థులు ఈ ప్రతిష్టాత్మక పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యా సంస్థల నారాయణగూడ ఏజీఎం నూర్ మహమ్మద్ అలీ, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్, కో-ఆర్డినేటర్ పుల్లారావు, డీన్ నీలగిరి, ప్రైమరీ కో-ఆర్డినేటర్ సుధా, ఇన్‌చార్జిలు రవి, శాంతి, మాలతీ, తదితర ఉపాధ్యాయ బృందం పాల్గొని, విద్యార్థులను అభినందించారు.

ఫీజు కట్టలేదు.. పరీక్ష రాయనివ్వం..

- విద్యార్థులకు ప్రశ్నాపత్రం ఇవ్వకుండా నిరాకరణ
- హెూలీ మేరీ హై స్కూల్‌లో వెలుగు చూసిన వైనం ..
- మొదటిరోజు పరీక్ష రాయని విద్యార్థులు..
- వీరికి మళ్లీ పరీక్ష రాసే అవకాశం కల్పిస్తారా లేక ఫెయిల్ చేస్తారా..!
- ఆందోళనలో తల్లిదండ్రులు..



నవతెలంగాణ-ధూల్‌పేట్

ప్రభుత్వ ప్రయివేటు ఉన్నత పాఠశాలల్లో వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలను ప్రభుత్వం పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. పదవతరగతి తరహాలోనే ఈ ప్రశ్న పత్రాలను ప్రభుత్వం ఆయా ఉన్నత పాఠశాలలకు అందజేసింది. ఈ వార్షిక పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తున్నారు. మొదటి రోజు రాష్ట్ర వ్యాప్తంగా తెలుగు సబ్జెక్టు పరీక్ష జరిగింది. అదే క్రమంలో ఆసిఫ్ నగర్, గోల్కొండ, నాంపల్లి ఇలా నగరంలోని అన్ని మండల పరిధిలోని స్కూల్‌లలో జరిగాయి. అంతటా ఈ పరీక్ష ప్రశాంతమైన వాతావరణంలో పూర్తయిన మాసబ్ ట్యాంక్ లోని హెూలీ మేరీ హై స్కూల్‌లో వివాదానికి దారి తీసింది. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. స్కూలు ఫీజు చెల్లించలేదనే కారణంగా హెూలీ మేరీ హై స్కూల్ యాజమాన్యం విద్యార్థుల పట్ల అక్రోషాన్ని ప్రదర్శించింది. రూ.1000, రూ.2వేలు బకాయిలు ఉన్న విద్యార్థులను కూడా మొదటిరోజు పరీక్షలు రాయనివ్వకుండా అడ్డుకున్నారు. స్కూల్ ఫీజు చెల్లించని విద్యార్థులకు హాల్ టికెట్లను జారీ చేసిన, పరీక్ష రాయించినా ఉద్యోగంలో నుంచి పీకేస్తానంటూ ఉపాధ్యాయులకు ప్రిన్సిపాల్ మీనా వార్నింగ్ ఇచ్చారు. దీంతో ఉపాధ్యాయులు పరీక్ష హాల్‌లో కూర్చున్న ఫీజు చెల్లించని విద్యార్థుల చేతుల్లోని ప్రశ్నపత్రాలను జవాబు పత్రాలను లాక్కున్నారు. అంతటితో ఆగకుండా గంటలపాటు విద్యార్థులను పరీక్ష హాలు బయటే నిల్చో పెట్టారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు హెూలీ మేరీ హై స్కూల్ ప్రిన్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. అధిక సంఖ్యలో విద్యార్థులు తల్లిదండ్రులు ప్రిన్సిపాల్ కార్యాలయం వద్దకు చేరుకోవడంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తతకు దారి తీసింది. ప్రిన్సిపల్ డౌన్ డౌన్.. విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరి నశించాలంటూ నినాదాలు చేశారు. ప్రభుత్వం చేత గుర్తింపు పొందిన హైస్కూల్ లో కార్పొరేట్ స్థాయి ఫీజులను వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థులను పరీక్షలు రాయనివ్వకుండా వేధింపులకు గురిచేయడాన్ని తల్లిదండ్రులు తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం తక్షణమే హెూలీ మేరీ హై స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్వహించే పబ్లిక్ పరీక్షలను రాయనివ్వకుండా అడ్డుకోవడానికి వారు తీవ్రంగా ఖండించారు. మొదటిరోజు పరీక్షను విద్యార్థుల చేత రాయనివ్వకుండా అడ్డుకున్న ప్రిన్సిపాల్ పై తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరితోనే ప్రిన్సిపాల్ రెచ్చిపోతోందని ఆరోపించారు. ఆసిఫ్ నగర్ డిప్యూటీ ఈవోతో హై స్కూల్ ప్రిన్సిపల్ కుమ్మక్కయ్యారని, అధికారుల పర్యవేక్షణ లోపంతోనే ప్రభుత్వం ఇచ్చే ప్రశ్నాపత్రాన్ని విద్యార్థులు రాసే అవకాశం లేకుండా పోయిందని వాపోయారు. మొదటి రోజు పరీక్ష రాయని మా పిల్లల భవిష్యత్తు ఏమిటని తల్లిదండ్రులు ప్రిన్సిపాల్ మీనాపై గుస్సా చేయ డంతో శాంతించిన ప్రిన్సిపల్ పరీక్ష రాయని విద్యార్థులకు చివరి రోజున మళ్లీ పరీక్ష రాయించే అవకాశం కల్పిస్తామని సమాధానం ఇవ్వడంతో తల్లిదండ్రులు శాంతించి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

పరీక్ష రాయని విద్యార్థుల పరిస్థితి ఎంటి?

హెూలీ మేరీ హైస్కూల్లో ఆరవ తరగతి నుంచి తొమ్మిదవ తరగతి వరకు స్కూల్ ఫీజు కట్టని విద్యార్థులు వందల్లో ఉన్నారు. వీరందరూ మొదటి రోజు తెలుగు పరీక్షను రాయలేకపోయారు. దీంతో మొదటి రోజు తెలుగు సబ్జెక్టు పరీక్ష రాయని విద్యార్థులు తల్లిదండ్రులు అయోమయంలో పడ్డారు. వీరికి ప్రభుత్వం మరొక ప్రశ్న పత్రాన్ని తయారు చేసి ఇస్తుందా? లేక అదే ప్రశ్న పత్రాన్ని రాసేందుకు వెసులుబాటు కల్పిస్తుందా అనే సందేహం తల్లిదండ్రుల్లో వ్యక్తం అవుతుంది. ఈ విషయమై జిల్లా విద్యా శాఖ అధికారిని ఫోన్‌లో వివరణ కోరగా ఆమె స్పందించలేదు.

రైతులకు సెలవులు లేనట్టే ఏఈఓలకు సెలవులు లేవు

● రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మెన్ ఎ.కోదండరెడ్డి



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

వ్యవసాయ విస్తరణ అధికారుల (ఏఈఓ) ఉద్యోగం చాలా పవిత్రమైందని, రైతులకు సెలవులు లేనట్లే ఏఈఓలకు సెలవులు లేవని రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మెన్ ఎ.కోదండరెడ్డి అన్నారు. తెలంగాణ వ్యవసాయ విస్తరణ అధికారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఐక్యవేదిక రూపొందించిన నూతన సంవత్సరం-2025 క్యాలెండర్, డైరీలను ఎ.కోదండరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా, వైద్యం చేయి దాటి పోయిందని, అదే మాదిరిగా వ్యవసాయాన్ని చేయి దాటి పోనివ్వకుండా కాపాడాలని సూచించారు. ఆదర్శ రైతులు, విస్తరణ అధికారుల సమస్యలను సీఎం ఎ.రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని, తాను మధ్యవర్తిగా వ్యవహరి స్తానని హామీ ఇచ్చారు.వ్యవసాయంలో పెను మార్పులు, రైతు సంక్షేమానికి కృషి చేస్తున్న ఏఈఓలను అభినం దించారు. ఐక్యవేదిక అధ్యక్షులు దారావత్ రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి కళ్యాణి మాట్లాడుతూ వ్యవసాయ క్లస్టర్లను సాగుభూమి ఆధారంగా విభజించాలని, రైతు వేదిక నిర్వహణ పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని, నూతనంగా నియమించబోయే గ్రామపాలనా అధికారులను వ్యవసాయ శాఖకు అనుసంధానం చేయాలని కోరారు. కొత్త ట్యాబ్‌లు ఇవ్వాలని, ఏఈఓలకు ప్రమాద, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు తిరుపతి నాయక్, కోశాధికారి పి.ప్రవీణ్, మహిళా విభాగం అధ్యక్షు రాలు సునీత, ఆదర్శ రైతు సంఘం అధ్యక్షులు లింగయ్య, అధికార ప్రతినిధి రవితేజ, పలు జిల్లాల నుంచి ఏఈఓలు పాల్గొన్నారు.

అరుణోదయ వ్యవస్థాపకులు 'కానూరి' ఆశయాలను సాధించాలి

● అరుణోదయ హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు కోలా స్వప్న



నవతెలంగాణ-ముషీరాబాద్

అరుణోదయ వ్యవస్థాపకులు 'కానూరి' ఆశయాలకు సాధించాలని అరుణోదయ హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు కోలా స్వప్న తెలిపారు. అరుణోదయ వ్యవస్థాపకులు విప్లవ సంస్కృతిక రంగ యోధుడు కామ్రేడ్ కానూరు వెంకటేశ్వర రావు 10వ వర్ధంతి సందర్భంగా నేడు విద్య నగర్ లోని మార్క్స్ భవన్‌లో జరిగే సంస్మరణ సభను జయప్రదం చేయాలని బుధవారం బుధవారం పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అరుణోదయ వ్యవస్థాపకుడు, సమరంలో అమరత్వం చెందిన మృతవీరుల త్యాగాల గానానికి ప్రాణం పోసి గత కాల స్మృతులను తట్టి లేపేందుకు మట్టి పొత్తులలో పూసినవాడు, అణగారిన ప్రజల పక్షాన తన కలాన్ని గలాన్ని ఎక్కుపెట్టిన వాడు కామ్రేడ్ కానూరు వెంకటేశ్వరరావు అని తెలిపారు. ఆటపాటలు అంగడి సరుకుగా మారిన ప్రస్తుత వ్యాపారం అనేదాన్ని తరుణంలో నినాదించాల్సిన కళాలను, గలాలను రాజ్యం కట్టడి చేస్తున్న పరిస్థితి. ప్రగతిశీల కవులు, కళాకారులు, మేధావులు, రచయితలపై జరుగుతున్న దాడులను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమయంలో కళ కళ కోసం కాదు కళ ప్రజల కోసం అని నినాదించిన కానూరి లాంటి అమర కళాకారులను అందించిన స్ఫూర్తితో కళాకారులను సంఘటితంగా తమ కళారూపాలను బదులు పెట్టి తిరోగ మన వాదాన్ని తిప్పి కొట్టాలన్నారు. ప్రజా కళలు, విప్లవ కళా రంగాన్ని కాపాడుకోవాలని ఆమె కోరారు.

విద్యార్థుల ఫీజు బకాయిలను చెల్లించకపోతే అసెంబ్లీ ముట్టడి

● రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య హెచ్చరిక



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నప్పటికి ప్రభుత్వం ఇంత వరకు 14 లక్షల ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల ఫీజు బకాయిలను చెల్లించలేదని వెంటనే పెండింగ్‌లో ఉన్న రూ.4 వేల కోట్ల బకాయిలను చెల్లించాలని, లేకపోతే రాష్ట్ర అసెంబ్లీని ముట్టడిస్తామని రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్ అధ్యక్షతన బుధవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఒక వైపు వార్షిక పరీక్షలు దగ్గర పడుతున్నాయని, మరొక వైపు కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు హాల్ టిక్కెట్లు ఇవ్వడం లేదని, విద్యార్థులు పరీక్షలు రాస్తామా లేదా అనే సందిగ్ధంలో పడి తీవ్ర మనస్థాపానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నప్పటికి నేటికి విద్యా శాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే ఫీజు బకాయిలు రూ.4 వేల కోట్లు దశల వారిగా విడుదల చేయాలని, హాస్టల్స్ కు సొంత భవనాలు నిర్మించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు మణికంఠ, సి.రాజేందర్, మోడీ రాందేవ్, కట్టె లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ బహిరంగ సభను విజయవంతం చేయండి

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



నవతెలంగాణ-అంబర్‌పేట

బీఆర్ఎస్ రజతోత్సవంలో భాగంగా ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న బహిరంగ సభకు భారీ ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కాలేరు వెంకటేష్ అన్నారు. బుధవారం శివం రోడ్డులోని ఓ హెూటల్‌లో నల్లకుంట డివిజన్ బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న ఈ భారీ బహిరంగ సభకు అంబర్‌పేట నియోజకవర్గంలోని ప్రతి బస్తీ, ప్రతి గల్లీ, ప్రతి కాలనీ నుంచి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని పిలుపునిచ్చారు. పార్టీ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకొని నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలలో పార్టీ జెండాలను ఎగురవేయాలని చెప్పారు. జెండా ఎగరవేసి దండీగా కదలి రావాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ కూడా గులాబీ కలర్ షర్ట్ ధరించి రావాలన్నారు. నియోజకవర్గ మొత్తం పండగ వాతావరణం కనిపించాలని పేర్కొన్నారు. ఉదయం 8:30కు ఫీవర్ హాస్పిటల్ చౌరస్తాలో జండా ఎగరవేసిన అనంతరం బస్తీలలో జెండా ఎగరవేయాలని సూచించారు. అందరికీ భోజనాల వసతి కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. నియోజకవర్గ మొత్తం జెండాలతో గులాబీ మయంగా మారాలన్నారు. హెచ్‌సీయు సంఘటనలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రాఫ్ పూర్తిగా పడిపోయిందని ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ సమావేశంలో డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వి. రవీంద్రరావు, భూపతినాథ్, కిషన్‌రావు, విజయేంద్ర సాగర్, భాస్కర్ గౌడ్, గోనె ప్రదీప్‌రావు, కూర నరేందర్, పులిజాల గెలవయ్య, ఓం ప్రకాష్ యాదవ్, ఎర్రబోలు నరసింహారెడ్డి, డివిజన్ అధ్యక్షులు సిద్ధార్థ ముదిరాజ్, చంద్రమోహన్, భీష్మదేవ్, సాయిని మూర్తి, రమణ నాయుడు, శోభ ముదిరాజ్, సుల్తానా, లావణ్య, వన్నడి రమ్య, స్వప్న తదితరులున్నారు.

సెట్విన్‌తో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యం



● పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాష్‌రెడ్డి

నవతెలంగాణ-ధూల్‌పేట్

రాష్ట్ర ప్రభుత్వం సెట్విన్‌తో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే ప్రభుత్వ ధ్యేయమని పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వరంగ సెట్విన్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న మోతిగల్లీ, సీతాఫల్ మండి శిక్షణ కేంద్రాలను సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.వేణుగోపాల్ రావుతో కలిసి ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాలలో నిర్వహిస్తున్న కోర్సుల వివరాలను, శిక్షణ పొందుతున్న విద్యార్థినీ, విద్యార్థులు గురించి వారికి అందిస్తున్న శిక్షణ తీరు, అనంతరం వారికి జాబ్ మేళ ద్వారా ఉద్యోగ అవకాశాల కల్పనా తదితర అంశాలను ఎండీ వేణుగోపాల్ రావు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించడంతో పాటు నైపుణ్య శిక్షణ అందించడానికి చర్యలు తీసుకుంటుందన్నారు. సెట్విన్ సహకారంతో జాబ్ మేళా నిర్వహించి నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనకు సెట్విన్ ఒక ఆశాదీపంగా వెలుగునివ్వడం సంతోషంగా ఉందన్నారు. ఈ సంస్థకు ప్రభుత్వం తరపున ఎటువంటి సహకారం ఆవసరమున్నా ముందుంటానన్నారు. ఈ కార్యక్రమంలో సెట్విన్ ట్రైనింగ్ ఇన్‌చార్జి ఎం.నవీన్ కుమార్, మోతిగల్లీ, సీతాఫల్ మండి కేంద్రాల ఇన్‌చార్జిలు వెంకటేశ్వర్లు, అనిత, కేంద్రాల ఫ్యాకల్టీలు తదితరులు పాల్గొన్నారు.

బహుజనుల పట్ల జరుగుతున్న అన్యాయాలను వ్యతిరేకిద్దాం

● బహుజన్ ముక్తి పార్టీ జాతీయ అధ్యక్షులు అంసోల్ లక్ష్మణ్



నవతెలంగాణ-ముషీరాబాద్

బహుజనుల పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా ఉద్యమించాలని బహుజన్ ముక్తి పార్టీ జాతీయ అధ్యక్షులు అంసోల్ లక్ష్మణ్ తెలిపారు. బహుజన్ ముక్తి పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు భారత్ ముక్తి మోర్చా, బహుజన్ క్రాంతి మోర్చా ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వనికి వ్యతిరేకంగా 'జైల్ భరో' ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిక్కడపల్లి పోలీసులు అంసోల్ లక్ష్మణ్‌ను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎంలు తొలగించి, బ్యాలెట్ పేపర్ ద్వారా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బహుజనుల పట్ల జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరు ఉద్యమించాలని కోరారు. ఓబీసీల జనాభా లెక్కలు తేల్చకపోవడం బాబాసాహెబ్ డా.బి.ఆర్.అంబేద్కర్‌ను కించపరిచే విధంగా మాట్లాడిన హెూం మంత్రిగా అమిత్ షానీ మంత్రి పదవి నుండి తొలగించాలన్నారు. అక్రమ అరెస్టులతో మా ఉద్యమాన్ని ఆపలేరని హెచ్చరించారు.

స్వప్న సుందరి చే నాట్యంపై అవగాహన శిబిరం

నవతెలంగాణ-కల్చరల్

విఖ్యాత నర్తకి నాట్య గురువు పద్మభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ స్వప్న సుందరి (ఢిల్లీ), చే నవ్య నాటక సమితి నిర్వహణలో నాట్యం పై చైత్ర చంద్రిక పేరిట అవగాహన శిబిరం ఏర్పాటు చేస్తున్నామని సమితి అధ్యక్షుడు వేమరాజు విజయ కుమార్ సమన్వయ కర్తలు సుధా మాల, మధుమతి కులకర్ణి తెలిపారు. అవగాహన శిబిరం ఈ నెల 18 నుంచి 20 వ తేది వరకు శ్రీ కష్ణ దేవరాయ భాషా నిలయంలో ఉంటుందని వారు చెప్పారు. నత్య సాహిత్యం అభినయనం అంశాలపై సోదాహరణంగా స్వప్న సుందరి వివరిస్తారన్నారు. నాట్య రంగంలో అభినివేశం ఉన్నవారు, నూతనంగా నేర్చుకునే వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. 23న తెలంగాణ సారస్వత పరిషత్ మందిరం లో స్వప్న సుందరి చే లాస్య లతిక శీర్షికన నత్య ప్రదర్శన ఉంటుందని



తెలిపారు. ఇందుకు సంబంధించిన గోడ పత్రిక ను రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ ఉప సంచాలకులు జి.వసుంధర సమితి సభ్యులు విజయ కుమార్, సుధా మాల, డాక్టర్ ఇందిర, హేమ, సంజయ్ కుమార్ జోషి, మాధవీ మాల లతో కలసి విడుదల చేశారు.

హైందవ భక్తి కళా సమ్మేళనాన్ని జయప్రదం చేయండి



నవతెలంగాణ-ముషీరాబాద్

హైందవ భక్తి కళా సమ్మేళనంను జయప్రదం చేయాలని అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయ శంకర స్వామీజీ పిలుపునిచ్చారు. సంకీర్తన సాంప్రదా యమే సనాతన ధర్మానికి ఊపిరనే లక్ష్యంతో ఇందిరాపార్క్ వద్ద హైందవ భక్త కళా సమ్మేళనం మే 7న నిర్వహించనున్నామని కళాకారులు భజన భజన కోలాటం కళాకారులందరూ అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు బుధవారం హైందవ కళా సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్‌ను ఆలయ ప్రధాన ఆచార్యులు శ్రీ లక్ష్మీ నరసింహ చార్యులు ఆవిష్కరించారు. ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయ శంకర స్వామీజీ హాజరై మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవ స్థానం మాదిరిగా యాదాద్రి లక్ష్మి నారసింహ స్వామి ఆలయ సన్నిధిలో నిత్య అఖండ హరి నామ సంకీర్తన జరిపించాల్సిన అవసరం ఉందన్నారు. భజన గురువులకు గుర్తింపు కార్డులిచ్చి కళారంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు, సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మేడ్చల్ జిల్లాల కళాకారులు ఆలపించిన భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. హైందవ కళా సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో అన్నమయ్య ట్రస్ట్ ఇన్‌చార్జి మీనాక్షి అలాగే మల్లికా వల్లభ, బాలు, నాగటి మారన్న, జనార్ధన్, కళ్యాణ్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.



హాట్ సమ్మర్‌లో కూల్‌గా..

మే నెల రాకముందే ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. అలా కాసేపు బయటికి వెళ్లినా ఒంట్లోని శక్తి మొత్తం ఎవరో స్ట్రా వేసి పీల్చినట్లే అనిపిస్తుంది. ఇక వేసవి తాపం కారణంగా డీహైడ్రేషన్, వడ దెబ్బ, అతిసారం వంటి అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి. ఇలా వేసవితో ముడిపడి ఉండే ఇటువంటి సమస్యలకు బార్లీ, మజ్జిగతో చెక్ పెట్టొచ్చు. అలాగే ఈ వేడిని తట్టుకోలేక పిల్లలు ఎక్కువగా ఐస్‌క్రీం అడుగుతుంటారు. అలాంటప్పుడు ఇంట్లోనే ఆరోగ్యకరంగా ఐస్‌క్రీం కూడా చేసి పెట్టొచ్చు.

బార్లీ జావ

ఉపయోగాలు: బార్లీలో శరీర వేడిని తగ్గించి తక్షణ శక్తిని అందించే గుణాలు పుష్కలంగా ఉంటాయి. దీనిలో కాల్షియం, ఫైబర్, ఇనుము, మెగ్నీషియం, మాంగనీస్, జింక్, కాపర్, విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు మెండుగా ఉంటాయి. ఈ పోషకాలు గుండె ఆరోగ్యం, అజీర్తి, డీహైడ్రేషన్, డయాబెటిస్ కంట్రోల్‌తో పాటు



బరువు తగ్గడానికి ఉపయోగపడతాయి.

కావాల్సిన పదార్థాలు: బార్లీ - ఒకటిన్నర గ్లాసు, నీళ్లు - 3 గ్లాసులు, ఉప్పు - రుచికి సరిపడా, పెరుగు - గ్లాసు, పచ్చిమిర్చి - 4, క్యారెట్ తురుము - కొద్దిగా, అల్లం - చిన్న ముక్క, కొత్తిమీర తరుగు - కొద్దిగా, నూనె - అర చెంచా, ఆవాలు - అర చెంచా, జీలకర్ర - అర చెంచా, ఇంగువ - చిటికెడు.

తయారీ విధానం: ముందుగా కుక్కర్‌లోకి బార్లీ తీసుకుని శుభ్రంగా కడగాలి. ఆ తర్వాత ఒక గ్లాసుకు బార్లీకి రెండు గ్లాసుల వాటర్ పోసుకోవాలి. అంటే ఇక్కడ గ్లాసున్నర కాబట్టి మూడు గ్లాసుల వాటర్ పోసుకోవాలి. తర్వాత రుచికి సరిపడా ఉప్పు వేసి మూత పెట్టి మీడియం ఫ్లేమ్‌లో మూడు విజిల్స్ వచ్చే వరకు ఉడికించుకోవాలి. ఈలోపు పచ్చిమిర్చి, అల్లం, కొత్తిమీరను సన్నగా కట్ చేసుకోవాలి. అలాగే క్యారెట్ సగ భాగాన్ని సన్నగా తురుముకుని పక్కన ఉంచాలి. బార్లీ ఉడికిన తర్వాత స్టవ్ ఆఫ్ చేసి పూర్తిగా చల్లార్చుకోవాలి. తర్వాత ఉడికించిన బార్లీని మిక్సీజార్‌లోకి తీసుకుని కచ్చాపచ్చాగా గ్రైండ్ చేసుకోవాలి. ఒకవేళ ఈ మిశ్రమం కాస్త గట్టిగా అనిపిస్తే రుబ్బుకునేటప్పుడు కొన్ని నీళ్లు పోసుకోవచ్చు. బార్లీని గ్రైండ్ చేసుకుని ఓ గిన్నెలోకి తీసుకోవాలి. అందులోకి పెరుగు, మరో గ్లాస్ వాటర్ పోసి బాగా కలుపుకోవాలి. ఆ తర్వాత కొత్తిమీర తరుగు, క్యారెట్ తురుము వేసి మిక్స్ చేసుకుని పక్కన ఉంచాలి. స్టవ్ ఆన్ చేసి కడాయి పెట్టి నూనె వేసుకోవాలి. ఆయిల్ కాగిన తర్వాత ఆవాలు, జీలకర్ర వేసి వేయించాలి. ఆ తర్వాత ఇంగువ వేసి మగ్గించాలి. చివరగా పచ్చిమిర్చి, అల్లం తరుగు వేసి ఓ నిమిషం వేపి బార్లీలో కలుపుకోవాలి. తాలింపును బార్లీలో కలిసేలా కలుపుకుని సర్వ్ చేసుకుంటే ఎండాకాలం ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే బార్లీ జావ రెడీ.

టిప్స్: బార్లీ గింజలను రాత్రంతా నానబెట్టుకుంటే త్వరగా ఉడుకుతాయి. జావను తయారుచేసేటప్పుడు గింజలు పూర్తిగా ఉడికేలా చూసుకోవాలి. జావను మరింత రుచికరంగా చేయడానికి నిమ్మరసం, పండ్ల ముక్కలు కూడా కలుపుకోవచ్చు.

కరివేపాకు మజ్జిగ

కావల్సిన పదార్థాలు: కరివేపాకు - గుప్పెడు, ఉప్పు - అరటీస్పూన్, జీలకర్ర పొడి - అరటీస్పూన్, అల్లం - అర అంగుళం ముక్క, పెరుగు - కప్పు.

తయారు చేసే విధానం: ముందుగా తాజా కరివేపాకును తీసుకొని శుభ్రంగా కడిగి పక్కన పెట్టుకోవాలి. తర్వాత మిక్సీ జార్ తీసుకొని అందులో కడిగి పెట్టుకున్న కరివేపాకును కాడల నుంచి దూసి వేసుకోవాలి. అందులో ఉప్పు, జీలకర్ర పొడి, అల్లం, పెరుగు, తగినన్ని నీరు పోసుకొని మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. ఆ తర్వాత మిశ్రమం చిక్కగా ఉందనిపిస్తే మరికొద్దిగా నీళ్లు వేసుకొని కలుపుకోవాలి. అనంతరం గ్లాసులలో పోసుకొని చివర్లో కొద్దిగా కొత్తిమీర తరుగు వేసుకొని సర్వ్ చేసుకుంటే చాలు. అంతే ఎంతో రుచికరంగా ఉండే హెల్దీ 'కరివేపాకు బటర్ మిల్క్' మీ ముందు ఉంటుంది.

ఆరోగ్య ప్రయోజనాలు: కరివేపాకులో కాల్షియం, ఐరన్, మెగ్నీషియం, ఫాస్ఫరస్, జింక్, పీచు పోషకాలతో పాటు విటమిన్-సి, విటమిన్-బి, విటమిన్-ఇలు సమృద్ధిగా ఉంటాయి. కాబట్టి దీన్ని తీసుకోవడం ద్వారా బోలెడన్ని ఆరోగ్య



ప్రయోజనాలు పొందవచ్చు. ముఖ్యంగా కరివేపాకులో విటమిన్-ఎ అధికంగా ఉండడం వల్ల కంటి చూపును మెరుగుపరచుకోవచ్చు. అలాగే దీనిలో చర్మాన్నీ, జుట్టునీ ఆరోగ్యంగా, అందంగా ఉంచే యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలం. కాబట్టి జుట్టు ఆరోగ్యానికి ఇది ఎంతో మేలు చేస్తుంది. బరువు తగ్గాలనుకునేవారూ కరివేపాకు తింటే మంచి ప్రయోజనం ఉంటుంది. ముఖ్యంగా దీనిలో ఉండే 'కార్బజోల్ అల్కలాయిడ్స్' బరువు నియంత్రణలో ఎంతగానో సహాయ పడుతుంది. ఇంకా శరీరంలోని వ్యర్థాల్నీ బయటకు పంపిస్తూ, జీర్ణశక్తిని పెంచడంలోనూ కరివే పాకు ముందు వరుసలో ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

సబ్జా క్యాండీ ఐస్‌క్రీమ్

కావాల్సిన పదార్థాలు: సబ్జా గింజలు - అర టీ స్పూన్, పటిక బెల్లం - అర కప్పు, నిమ్మకాయ - 1, ఉప్పు - చిటికెడు, వాటర్ - పావు లీటర్, పుదీనా ఆకులు - కొద్దిగా

తయారీ విధానం: ఓ బౌల్‌లోకి సబ్జా గింజలు తీసుకోవాలి. అందులో అర కప్పు నీళ్లు పోసుకుని సుమారు అర గంట సేపు నానబెట్టుకోవాలి. ఈలోపు మిక్సీజార్‌లోకి పటిక బెల్లం తీసుకుని మెత్తని పొడిలా చేసుకోవాలి. సబ్జా గింజలు నానిన తర్వాత మిగిలిన ప్రాసెస్ పూర్తి చేసుకోవాలి. మిక్సింగ్ బౌల్ తీసుకుని అందులోకి పటిక బెల్లం పొడి, నిమ్మరసం, ఉప్పు, నానబెట్టిన సబ్జా గింజలు, వాటర్, సన్నగా తరిగిన పుదీనా ఆకులు వేసి బాగా మిక్స్ చేసుకుని ఓ 10 నిమిషాలు పక్కన ఉంచాలి. పది నిమిషాల తర్వాత ఐస్‌క్రీమ్ మౌల్డ్స్ తీసుకుని ఈ వాటర్‌ను వాటిలో పోసి అల్యూమినియం పాయిల్‌తో క్లోజ్ చేసుకోవాలి. ఒకవేళ మీ దగ్గర ఐస్‌క్రీమ్ మౌల్డ్ లేకపోతే చిన్న చిన్న స్టీల్ గ్లాసులలో కూడా వీటిని పోసి పేపర్ చుట్టేసి ఫ్రీజర్‌లో పెట్టుకోవచ్చు. తర్వాత ఆ వాటర్‌లోకి ఐస్‌క్రీమ్ పుల్లలు గుచ్చి సుమారు 6 గంటలు లేదా రాత్రంతా ఫ్రీజర్‌లో పెట్టాలి. ఐస్‌క్రీమ్ తయారైన తర్వాత ఫ్రిజ్ నుంచి బయటికి తీసి ఓ నిమిషం తర్వాత డీమౌల్డ్ చేస్తే పుల్లగా, తియ్యగా ఉండే సబ్జా క్యాండీ ఐస్ రెడీ.

టిప్స్: పటిక బెల్లం ప్లేస్‌లో పంచదార లేదా



తేనెను కూడా యాడ్ చేసుకోవచ్చు. అలాగే నీళ్లకు బదులు ఇతర పండ్ల జ్యూస్‌లు ఉపయోగించినా టేస్ట్ మరింత బాగుంటుంది. ఆకర్షణీయంగా కనిపించడం కోసం చిన్నగా కట్ చేసి స్ట్రాబెర్రీ, చెర్రీ ముక్కలను కూడా వేసుకోవచ్చు.

జామకాయ ఐస్‌క్రీమ్

కావాల్సిన పదార్థాలు: జామకాయలు - 4, పాలు - అర కప్పు, బీట్‌రూట్ జ్యూస్ - 4 చుక్కలు, పటిక బెల్లం - 3 చెంచాలు, ఉప్పు - చిటికెడు, పాల పొడి - 1/3 కప్పు, డ్రైఫ్రూట్స్ పలుకులు - కొద్దిగా.

తయారీ విధానం: పాలను బాగా మరిగించి పూర్తిగా చల్లారిన తర్వాత అరగంట సేపు ఫ్రిజ్‌లో ఉంచాలి. జామకాయలను బాగా కడిగి, తడి లేకుండా తుడవాలి. ఆ తర్వాత వాటి పైభాగాన్ని అంటే కాడలు ఉన్నవైపు కొద్దిగా కట్ చేయాలి. స్పూను సహాయంతో జామకాయల లోపలి గుజ్జు, గింజలు తీసి, వాటిని ఒక బౌల్‌లో వేయాలి. మిక్సీజార్‌లోకి జామకాయ గుజ్జు, కాచి చల్లార్చిన చిల్డ్ మిల్క్, బీట్‌రూట్ జ్యూస్ డ్రాప్స్ వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. అందులోకి పటిక బెల్లం, ఉప్పు, పాల పొడి వేసి మరోసారి బ్లెండ్ చేసుకోవాలి. ఈ జ్యూస్‌ను ఓ బౌల్‌లోకి తీసుకోవాలి. అనంతరం డ్రైఫ్రూట్స్ పలుకులు వేసుకుని కలుపుకోవాలి.



ఇప్పుడు ఈ మిశ్రమాన్ని జామకాయలలో నింపి, వాటి పైభాగాలను మూసివేయాలి. వాటిని ఫ్రీజర్‌లో 6 -7 గంటలు ఉంచి ఆ తర్వాత బయటికి తీసి పొడుగ్గా కట్ చేసుకుని తేనె, డ్రైఫ్రూట్స్‌తో గార్నిష్ చేసుకుని సర్వ్ చేసుకుంటే సరి.

ఆరోగ్య ప్రయోజనాలు: జామకాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిలోని విటమిన్లు, ఫైబర్, పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లు సహా ఇతర పోషకాలు బరువు తగ్గడం, డయాబెటిస్ కంట్రోల్, చర్మంపై ముడతలు తగ్గించడం లాంటి ఎన్నో ప్రయోజనాలను అందిస్తాయి. ▪

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

ప్రస్తుతం మేకప్ ప్రతి ఒక్కరి జీవనశైలిలో భాగమైంది. అయితే ఈ విషయంలో కొంతమంది కొన్ని షార్ట్‌కట్స్ ఫాలో అవుతుంటారు. అవి ఎంతవరకు మనకు మంచిదో చూద్దాం...

ఆఫీస్ పూర్తవగానే అటు నుంచి అటే ఫంక్షన్‌కు వెళ్ళాల్సి వస్తుంది. అపుడు ఉదయం వేసుకున్న మేకప్‌పై నుంచే తిరిగి టచప్ ఇస్తుంటారు చాలామంది. కానీ అలా చేయకూడదంటున్నారు నిపుణులు. ఎందుకంటే మేకప్ పైన వేసే మేకప్ సరిగా సెట్ అవ్వదు. పైగా ఎబ్బెట్టుగా కనిపిస్తుంది. చర్మం బాగా ఎండిపోయినట్లు నిర్జీవంగా మారిపోవడమే కాకుండా మొటిమలు కూడా వచ్చే అవకాశాలు ఎక్కువంటున్నారు.

సన్‌స్క్రీన్ తప్పనిసరి..!

చాలామంది మేకప్ వేసుకున్నాం కదా.. ఇంక సన్‌స్క్రీన్ అవసరం లేదనుకుంటారు. మిగతా సమయాల్లో ఎలా ఉన్నా మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లాల్సి వస్తే తప్పకుండా సన్‌స్క్రీన్ రాసుకోవాలి. ఎందుకంటే సూర్యుడి నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాల నుంచి చర్మాన్ని రక్షించగలిగేది సన్‌స్క్రీన్ మాత్రమే. సన్‌స్క్రీన్ రాసుకున్న తర్వాత దాని మీద మామూలుగా మేకప్ వేసుకున్నా సెట్ అవుతుంది.

బ్రష్‌లు శుభ్రం చేస్తున్నారా..?

మీరు ఉపయోగించే మేకప్ బ్రష్‌లను తరచూ శుభ్రం చేసుకోవాలి. శుభ్రం చేయకపోతే వాటిపై బ్యాక్టీరియా చేరుతుంది.. వాటిని తిరిగి ఉపయోగిస్తే లేనిపోని చర్మ సమస్యలు కొని తెచ్చుకున్నట్టే! అందుకే మేకప్‌కు ఉపయోగించే బ్రష్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి.

డ్రయర్‌తో తల ఆరబెడుతున్నారా?

పొద్దున్నే లేచి, తలస్నానం చేసే సరికే ఆఫీసు టైం దగ్గరపడుతుంది. ఇక తల ఆరబెట్టుకునే టైం ఎక్కడుంటుంది? అందుకే గబగబా హెయిర్ డ్రయర్‌తో ఆరబెట్టేసి, స్ట్రెయిట్‌నర్‌తో స్ట్రెయిట్ చేసేసి, నచ్చిన హెయిర్ స్టైల్ వేసేసుకుంటారు చాలామంది. కానీ దానివల్ల జుట్టు ఆరోగ్యానికి నష్టం వాటిల్లుతుంది. హెయిర్ డ్రయర్స్, స్ట్రెయిట్‌నర్స్, కర్లర్స్.. ఇవన్నీ ఎక్కువ వేడిని విడుదల చేస్తాయి. ఫలితంగా జుట్టులో ఉండే సహజ నూనెలు ఆవిరైపోతాయి. కాసేపటికే జుట్టు గరుకుగా, నిర్జీవంగా తయారవుతుంది.

నిద్రపోయే ముందు..

పార్టీకో, ఫంక్షన్‌కో వెళ్లొచ్చి బాగా అలసిపోయారు. ఇక, ఏ పనీ చేసే ఓపిక లేక అలాగే వెళ్లి మంచం ఎక్కేస్తారు. ఇలా చేస్తే మీ చర్మానికి మీరే హాని తలపెట్టినట్లవుతుంది. ఎందుకంటే ముందు మీ ముఖానికి ఉన్న మేకప్‌ను పూర్తిగా తొలగించుకోవాలి. లేదంటే మేకప్ అవశేషాలతో చర్మ రంధ్రాలు మూసుకుపోయి మృతకణాలు, మొటిమల సమస్యలు వస్తాయి.

గడువు తేదీ గమనిస్తున్నారా?

మేకప్ సామగ్రి కొన్న తర్వాత అవి ఎన్ని రోజులు ఇంట్లో అలానే ఉన్నా వాటిని ఉపయోగిస్తూనే ఉంటాం. కానీ, వీటి గడువు తేదీ కూడా ఎప్పటికప్పుడు గమనించాలంటున్నారు నిపుణులు. ఒకవేళ ఎక్స్‌పైరీ దాటిన ఉత్పత్తులను ఉపయోగిస్తే అలర్జీలు, చర్మ సంబంధిత సమస్యలు తలెత్తే ప్రమాదం ఎక్కువంటున్నారు. కాబట్టి గడువు తేదీని బట్టి ఏడాదికోసారి మేకప్ ఉత్పత్తులు మార్చడం మంచిది. ▪

వడ్డీ రేట్లు మరో పావు శాతం తగ్గింపు

(మొదటిపేజీ తరువాయి)

సుంకాల ప్రభావంపై మల్హోత్రా ఆందోళన వ్యక్తం చేశారు. భౌగోళికంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుత వాణిజ్య యుద్ధ భయాలు, ముఖ్యంగా అమెరికా నుంచి సుంకాల పెంపు కారణంగా ఈ పరిస్థితి నెలకొందన్నారు. ఫలితంగా వృద్ధి రేటు నెమ్మదించవచ్చన్నారు. అధిక సుంకాలతో ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడనుంది. తయారీ రంగం పునరుద్ధరిస్తున్న సంకేతాలు కన్పిస్తున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 6.5 శాతానికి తగ్గొచ్చన్నారు. ఇంతక్రితం అంచనాతో పోల్చితే 20 బేసిస్ పాయింట్లు తక్కువ కావడం గమనార్హం. తొలి త్రైమాసికం (క్యూ1)లో 6.5శాతం, క్యూ2లో 6.7శాతం, మూడు, నాలుగు త్రైమాసికాల్లో వరుసగా 6.6శాతం, 6.3శాతంగా ఉండొచ్చన్నారు. ఏప్రిల్ 4వ తేదీ నాటికి విదేశీ నిల్వలు 676 బిలియన్ డాలర్లుగా ఉన్నాయని.. ఇవి రాబోయే 11 నెలల దిగుమతులకు సరిపోతాయన్నారు.

ఫ్రాన్స్ నుంచి రాఫెల్ మెరైన్ జెట్‌లు

(మొదటిపేజీ తరువాయి)

ప్రధాన మంత్రి క్రిషి సించాయి యోజన (పీఎంకెఎస్‌వై) ఉప పథకంగా 2025-26 కాలానికి రూ.1600 కోట్ల తొలి కేటాయింపులతో ఇరిగేషన్ నెట్‌వర్క్ ఆధునీకరణను చేపట్టనున్నారు. నిర్దేశిత క్లస్టర్‌లో ప్రస్తుతమున్న కాలవల నుంచి లేదా ఇతర వనరుల నుంచి సాగునీటి సరఫరా కోసం నెట్‌వర్క్‌ను ఆధునీకరించడమే ఈ పథకం లక్ష్యంగా వుంది. దీనికి కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. దీంతో పాటు

తిరుపతి-పాకాల-కాట్పాడి మధ్య 104 కిలోమీటర్ల మేర డబ్లింగ్ పనులకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిందని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. రూ.1,332 కోట్లతో తిరుపతి-పాకాల-కాట్పాడి డబ్లింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రాజెక్టులకు సంబంధించిన వివరాలను కేంద్ర మంత్రి వివరించారు.

ముదిరిన వాణిజ్య యుద్ధం

(మొదటిపేజీ తరువాయి)

చేసుకుంటుంది.

అమెరికా బ్లాక్‌మెయిల్ : చైనా ఫిర్యాదు

అమెరికా చర్యలపై చైనా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అధిక సుంకాలు విధిస్తున్న అమెరికా తీరుపై చైనా ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ)కు ఫిర్యాదు చేసింది. చైనాపై విధిస్తున్న సుంకాలు అంతర్జాతీయ వాణిజ్యాన్ని అనిశ్చితిలోకి నెడుతాయని మంగళవారం యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డిర్ లేయన్‌తో జరిగిన ఫోన్ కాల్‌లో చైనా ప్రీమియర్ లీ కియాంగ్ అన్నారు. సుంకాల పేరుతో అమెరికా బ్లాక్‌మెయిల్‌కు పాల్పడు తోందన్నారు. ఎలాంటి అనిశ్చితులనైనా తట్టుకునేలా తమ ఆర్థిక విధానాలను రూపొందించినట్టు తెలి పారు. తమ దేశంపై అధిక సుంకాలు విధిస్తున్న అమె రికాకు తగిన విధంగా బదులిచ్చేందుకు తమ వద్ద విధానపరంగా అన్ని ఆయుధాలు ఉన్నాయని హెచ్చ రించారు. అమెరికా వాణిజ్య భాగస్వాములపై ట్రంప్ తీసుకుంటున్న ఇలాంటి నిర్ణయాలు.. ఏకపక్షవాదం, రక్షణవాదం, ఆర్థికపరంగా బలవంతపు చర్యలుగా అభివర్ణించారు. దీనిపై తమ నుంచి తప్పకుండా ప్రతిస్పందన ఉంటుందని హెచ్చరించారు. అమెరికా ఉడత ఊపులకు భయపడేది లేదని చైనా స్పష్టం చేసింది.

ప్రపంచ దేశాలు చీలిపోవచ్చు

ప్రపంచంలోని రెండు అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య నెలకొన్న ఈ వైరం ముమ్మాటికీ విచారకరమైనదే. ఎందుకంటే వాణిజ్య ప్రపంచంలో ఇప్పటికే తీవ్ర సంక్షోభం నెలకొని ఉంది. అమెరికాలో మాంద్యం ఏర్పడే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. చైనా వస్తువులపై అమెరికా 104 సుంకం విధించడమంటే ఒక రకంగా వాణిజ్యపరమైన నిషేధం అన్న మాటే. ఇరు దేశాల మధ్య ఇక ప్రత్యక్ష వ్యాపార వాణిజ్యాలు కొనసాగే అవకాశాలు లేనట్లే. ఇప్పుడు రెండు దేశాల మధ్య నెలకొన్న వివాదం స్వల్పకాలిక మార్కెట్ అస్థిరతకు దారి తీసే ప్రమాదం ఉంది. ఒకవేళ అది తీవ్ర రూపం దాలిస్తే దీర్ఘకాలంలో ప్రపంచమే రెండుగా చీలిపోవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రపంచ దేశాలు ఇప్పుడు అమెరికాను విశ్వసించడం లేదని భావిస్తున్నారు.

చైనానే ప్రత్యామ్నాయం..

అమెరికా విధించిన సుంకాల నుంచి ఇతర దేశాలు ఎలా బయటపడతాయో ఇంకా స్పష్టంగా తెలియనప్పటికీ చైనా నుంచి కొన్ని వస్తువులు వియత్నాం లేదా మెక్సికో వంటి మూడో దేశం నుంచి అమెరికాలో ప్రవేశించే అవకాశం మాత్రం ఉంది. అంటే అమెరికా ఎంత గరిష్ట స్థాయిలో సుంకాలు విధించినా అక్కడి ప్రజలు చైనా వస్తువు లను కొనుగోలు చేయగలరు. గత సంవత్సరం చైనాతో అమెరికా 5,824 లక్షల కోట్ల డాలర్ల విలువ కలిగిన వస్తు వ్యాపారం చేసింది. చైనాకు 1,435 లక్షల కోట్ల డాలర్ల విలువ కలిగిన అమెరికా వస్తువులు ఎగుమతి అయ్యాయి. చైనా నుండి 4,389 లక్షల కోట్ల డాలర్ల విలువ కలిగిన వస్తువులను అమెరికా దిగుమతి చేసుకుంది. కాగా ట్రంప్ యూ టర్న్ తీసుకున్నారు. 75 దేశాలపై సుంకాలను తాత్కాలికంగా నిలిపివేశారు.

త్వరలో ఔషధాలపై యూఎస్ టారిఫ్‌ల మోత

వాషింగ్టన్ : ప్రతీకార సుంకాలతో వాణిజ్య యుద్ధానికి తెరలేపిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తాజాగా ఔషధ రంగాన్ని టార్గెట్ చేసుకున్నారు. త్వరలోనే ఔషధ ఉత్పత్తులపై సుంకాల మోత మోగించనున్నట్టు ప్రకటించారు. అమెరికాకు దిగుమతయ్యే ఔషధ ఉత్పత్తులపై భారీ ఎత్తున సుంకాలు విధించనున్నట్టు తెలిపారు. మంగళవారం రాత్రి నేషనల్ రిపబ్లికన్ కాంగ్రెషనల్ కమిటీ కార్యక్రమంలో మాట్లాడుతూ.. యూఎస్ ఫార్మా ఉత్పత్తులు తయారు కావడం లేదన్నారు. అందుకే ఇతర దేశాల నుంచి వచ్చే ఔషధ ఉత్పత్తులపై సుంకాలు విధించనున్నట్టు తెలిపారు. ఈ చర్యతో చైనా సహా వివిధ దేశాల్లోని ఫార్మా కంపెనీలన్నీ అమెరికాకు తరలివస్తాయని, ఇక్కడ తమ ప్లాంట్లను తెరుస్తాయని పేర్కొన్నారు. ట్రంప్ నిర్ణయంతో భారత్‌కు పెద్ద ఎదురుదెబ్బే అని నిపుణులు పేర్కొంటున్నారు. అమెరికాకు భారత్ నుంచి 9 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.78వేల కోట్లు)విలువైన ఔషధాలు ఎగుమతి అవుతున్నాయి. భారత్ చేసుకుంటున్న దిగుమతులతో పోల్చితే ఇది 10 రెట్లు అధికం. అమెరికాలో లభించే జనరిక్ ఔషధాల్లో దాదాపు 70 శాతం దిగుమతి అయినవే. ఇందులో సుమారు 50 శాతం భారత్ నుంచి వెళ్లినవే కావడం విశేషం.

సాధారణ వర్షపాతమే

(మొదటిపేజీ తరువాయి)

సంకేతాలు ఇప్పుడు మసకబారటం ప్రారంభించాయి. సాధారణంగా రుతుపవనాలను ప్రభావితం చేసే ఎల్‌నినో సంభవించే అవకాశం తోసిపుచ్చబడింది" అని స్కైమెట్ మేనేజింగ్ డైరెక్టర్ జతిన్ సింగ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సీజన్ రెండో భాగం.. మొదటి భాగం కంటే మెరుగ్గా ఉంటుందని భావిస్తున్నట్టు వివరించారు. లా నినా సాధారణంగా పెరిగిన వర్షపాతంతో ముడిపడి ఉంటుంది. ఎల్ నినో ఇందుకు విరుద్ధంగా ఉంటుంది.

దక్షిణ, పశ్చిమ భారతంలో తగినంత వర్షాలు

పశ్చిమ, దక్షిణ భారతంలో కావాల్సినంత చక్కటి వర్షాలు కురుస్తాయని స్కైమెట్ అంచనా వేసింది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో 'తగినంత' వర్షపాతం నమోదు కానున్నది. పశ్చిమ కనుమల వెంబడి అత్యధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నది. కేరళ, తీరప్రాంత కర్నాటక, గోవాలలో అధిక వర్షాలు నమోదయ్యే పరిస్థితులున్నాయి. ఇక వాయువ్య ప్రాంతం, ఉత్తర భారతంలోని కొండప్రాంత రాష్ట్రాలలో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

జూన్‌లో వానలు తక్కువే

వర్షాకాలం మొదటి నెల అయిన జూన్‌లో సాధారణం కంటే నాలుగుశాతం తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నది. ఇక అత్యధిక వర్షపాతం



నమోదయ్యే నెలలైన జులైలో రెండు శాతం, ఆగస్టులో ఎనిమిది శాతం ఎక్కువ వర్షాలు కురిసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. సెప్టెంబర్‌లో నాలుగు శాతం అధికంగా వర్షాలు కురిసే అవకాశమున్నది. ఇక భారత వాతావరణ శాఖ (ఐఎండీ) దేశంలో వర్షాభావ పరిస్థితుల గురించి తన అంచనాలను వచ్చేవారం తర్వాత విడుదల చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2024లో, భారత్‌లో జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య సాధారణం కంటే 8 శాతం ఎక్కువగా వర్షాలు కురిశాయి.

జనాగ్రహం

(మొదటిపేజీ తరువాయి)

నిరసన వ్యక్తం చేశారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టారు. ఘట్‌కేసర్‌లో ఆటోకు తాళ్ళు పట్టి లాగారు. షాపూర్‌నగర్‌లో రైతుబజార్ నుంచి శుభం హోటల్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. షాపూర్ నగర్ ప్రధాన రోడ్‌పై రాస్తారోకో చేశారు.

మహబూబ్‌నగర్ పట్టణంలో సిలిండర్‌తో నిరసన తెలిపారు. నాగర్‌కర్నూల్ బస్టాండ్ సెంటర్‌లో కట్టెల పొయ్యి, సిలిండర్ పెట్టి నిరసన తెలిపారు. కల్వకుర్తి, వంగూరు, పెంట్లవెల్లి, ఉప్పు నుంతల మండలాల్లో నిరసనలు తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తా నందు గ్యాస్ సిలిండర్లతో నిరసన వ్యక్తం చేశారు. వనపర్తి జిల్లా పానగల్ మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. వీపనగండ్ల, అమరచింత మండలాల్లో నిరసన వ్యక్తం చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని గీతాభవన్ చౌరస్తాలో గ్యాస్ సిలిండర్‌ను నెత్తిపై పెట్టుకుని, ప్లకార్డులతో నిరసన తెలిపారు. నిజామాబాద్ నగరంలోని ధర్నాచౌక్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.

బ్రిటిషర్ల కంటే బీజేపీనే ప్రమాదకరం

(మొదటిపేజీ తరువాయి)

ఆరు నెల్లలోనే గాడ్సే వారసులు గాంధీజీపై తుటా పేల్చి ఆయనను హత్య చేశారని చెప్పారు. మోడీకి వ్యతిరేకంగా పోరాడేందుకు తామంగా సిద్ధంగా ఉన్నామనీ, సీడబ్ల్యూసీ చింతన బైఠక్ నుంచి అదే ఆశ, ఆదేశాలతో తిరిగి వెళ్తున్నామని అన్నారు. రానున్న రోజుల్లో బీజేపీని ఓడించే బాధ్యత ప్రతి కాంగ్రెస్ కార్యకర్త తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.

వ్యర్థాల నిర్వహణలో కేరళ ఆదర్శం

- సీఎం పినరయి విజయన్
- వృత్తి-2025 కాన్‌క్లేవ్ ప్రారంభం

తిరువనంతపురం : వ్యర్థాల నిర్వహణలో కేరళను ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలపాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. తిరువనంతపురంలోని కనకకున్ను ప్యాలెస్‌లో జరిగిన 'వృత్తి-2025' నేషనల్ క్లీన్ కేరళ కాన్‌క్లేవ్‌ను ముఖ్యమంత్రి పినరయి విజయన్ బుధవారం ప్రారంభించి ప్రసంగించారు. రాష్ట్రంలో వ్యర్థాల నిర్వహణ పట్ల ప్రజలకు ఉన్న ఆందోళనలను పరిష్కరించేందుకు ఈ సదస్సు ఒక వేదికగా పనిచేస్తుందని పేర్కొన్నారు. వ్యర్థాల నిర్వహణలో కేరళ గణనీయమైన విజయాలు సాధించిందని చెప్పారు. సమిష్టి ప్రయత్నాలు అద్భుతమైన పురోగతిని సాధించాయని, స్థానిక స్వపరిపాలన సంస్థలు చాలా వరకు వ్యర్థ రహితంగా ప్రకటించబడ్డాయని ఆయన నొక్కి చెప్పారు. మార్చి 2025 నుండి తాజా గణాంకాల ప్రకారం, క్లీన్ కేరళ కంపెనీ ద్వారా 61,664 టన్నులకు పైగా వ్యర్థాలను సేకరించి ప్రాసెస్ చేయబడ్డాయని తెలిపారు. ఇంకా 8.9 మిలియన్లకు పైగా గృహాల్లో ఉన్న వ్యర్థాల నిర్వహణ కార్యకలాపాలను డిజిటల్ ట్రాకింగ్ వ్యవస్థలోకి మారాయని వివరించారు. ఇది దేశంలో ఒక మార్గదర్శక చర్య అని చెప్పారు. ఈ పురోగతులు ఉన్నప్పటికీ, వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్ల సామర్థ్యం, పనితీరుపై సందేహాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. వృత్తి 2025 సమావేశం ప్రజలు, ప్రజా ప్రతినిధుల ఆందోళనలను పరిష్కరించడానికి కూడా ఒక వేదిక అని వెల్లడించారు. ప్రజా-కేంద్రీకృత కార్యక్రమాల ద్వారా ఆరోగ్యం, విద్య వంటి రంగాల్లో కేరళ పలు విజయాలు సాధించిందని చెప్పారు. వ్యర్థాల నిర్వహణలోనూ ఇలాంటి నమూనా విజయాలను పున రావృతం చేసి కేరళను



'వృత్తి-2025' నేషనల్ క్లీన్ కేరళ కాన్‌క్లేవ్‌ను జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న సిఎం పినరయి విజయన్

దేశంలోని మిగిలిన ప్రాంతాలకు ఆదర్శంగా నిలపవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సదస్సు ఆ దిశగా మొదటి అడుగు అవుతుందన్నారు. స్థానిక స్వపరిపాలన, ఎక్సైజ్, శాసనసభ వ్యవహారాల మంత్రి ఎంబి రాజేష్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో 'వ్యర్థ రహిత నవ కేరళ' ప్రచారం కింద కార్యకలాపాలను వివరించే సమగ్ర నివేదికను ముఖ్యమంత్రి విడుదల చేయగా, నవ కేరళ కార్యాచరణ ప్రణాళిక సమన్వయకర్త టిఎన్ సీమా నివేదికను స్వీకరించారు. మంత్రులు కె రాజన్, ఎకె ససీంద్రన్, జీఆర్ అనిల్, పిఎ మహ్మద్ రియాస్ ఈ సదస్సులో పలు కార్యక్రమాలను ప్రారంభించారు. ఎమ్మెల్యేలు వికె ప్రశాంత్, కడకంపల్లి సురేంద్రన్, ఆంటోని రాజు, కె అన్సాలన్, సికె హరీంద్రన్, వి జాయ్, డికె మురళి, వి శశి, ఐబి సతీష్, జి స్టీఫెన్, ఎం విన్సెంట్‌తోపాటు తిరువనంతపురం మేయర్ ఆర్య రాజేంద్రన్, జిల్లా పంచాయతీ అధ్యక్షులు అడ్వ పాల్గొన్నారు. కేరళ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శారద మురళీధరన్ ప్రారంభ ఉపన్యాసం చేశారు.


నవచిత్రం



'కన్నప్ప' రిలీజ్‌కి సిద్ధం

హీరో విష్ణు నటిస్తూ నిర్మిస్తున్న చిత్రం 'కన్నప్ప'. ఇప్పటికే ఈ సినిమాపై అంచనాలు భారీ స్థాయిలో నెలకొన్నాయి. ఈ సినిమా నుంచి వచ్చిన పోస్టర్లు, టీజర్లు సినిమాపై అంచనాలు పెంచాయి. మరీ ముఖ్యంగా పాటలు సినిమాపై పాజిటివ్ వైబ్ క్రియేట్ చేశాయి. ఈ నేపథ్యంలో ఈ చిత్ర బృందం యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది.

మోహన్ బాబు, విష్ణు, ప్రభుదేవా తదితరులు యూపీ సీఎంను కలిశారు. ప్రముఖ చిత్రకారుడు రమేష్ గొరిజాల గీసిన చిత్రపటాన్ని యూపీ సీఎంకు మోహన్ బాబు బహూకరించారు. అనంతరం ఈచిత్ర రిలీజ్ డేట్ పోస్టర్‌ను యూపీ సీఎం ఆదిత్య నాథ్ రిలీజ్ చేసి, అభినందించారు. ఈ సినిమా జూన్ 27న విడుదల చేయ బోతున్నారు. అవా ఎంటర్టైన్మెంట్స్, 24 ఫ్రేమ్ ఫ్యాక్టరీ బ్యానర్లపై మోహన్ బాబు దీన్ని నిర్మించారు. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మోహన్‌బాబు, మోహన్‌లాల్, అక్షయ్‌కుమార్, ప్రభాస్ వంటి భారీ తారాగణం నటించింది.


నాని

'వేటు వేసినా.. వేట సాగెనులె'

నాని, శ్రీ నిధి శెట్టి జంటగా నటిస్తున్న క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్ 'హిట్ 3 : ది థర్డ్ కేస్'. డాక్టర్ శైలేష్ కొలను దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని వాల్ పోస్టర్ సినిమా, నాని యూనానిమస్ ప్రొడక్షన్స్ బ్యానర్స్ పై ప్రశాంతి తిపిర్నేని నిర్మిస్తున్నారు. మిక్కీ జె మేయర్ సంగీతం అందిస్తున్నారు.

తాజాగా బుధవారం ఈ చిత్రంలోని సెకెండ్ సింగిల్ ' వేటు వేసినా.. వేట సాగెనులె.. అబ్కీ బార్ అర్జున్ సర్కార్'ని రిలీజ్ చేశారు. ఈ పాట అర్జున్ సర్కార్ పాత్రకు ప్రాణం పోసింది.

కృష్ణకాంత్ రాసిన సాహిత్యంతో పాత్ర సారాంశాన్ని పాట ద్వారా అద్భుతంగా చూపించారు. మిక్కీ జె మేయర్ ఆకట్టుకునే ట్రాక్‌ను, ఎలక్ట్రిఫైయింగ్ ఆర్కెస్ట్రేషన్‌తో కంపోజ్ చేశారు. అనురాగ్ కులకర్ణి డైనమిక్ వాయిస్ సాంగ్‌ని మరోస్థాయికి తీసుకెళ్తుంది. సాను జాన్ వర్గీస్ మ్యాజికల్ కెమెరా వర్క్ అందిస్తూ, ప్రతి మూమెంట్‌ని అద్భుతంగా తీర్చిదిద్దాడు. అలాగే ఈనెల 14న ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు మేకర్స్ పాట ద్వారా అనౌన్స్ చేశారు. మూవీ మే 1న విడుదలకు సిద్ధమవుతోంది.

నేడే విడుదల



'నారి నారి నడుమ మురారి'


శర్వానంద్

శర్వానంద్ నటిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'నారి నారి నడుమ మురారి'. 'సామజవరగమన' ఫేమ్ రామ్ అబ్బరాజు దర్శకత్వం వహిస్తున్నారు. అనిల్ సుంకర ఎకె ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై రామబ్రహ్మం సుంకర, అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రంలో సాక్షి వైద్య, సంయుక్త కథానాయికలుగా నటించారు. ఇప్పటికే ఈ సినిమా నుండి ఫస్ట్ లుక్, ఇతర పోస్టర్లు విడుదలై మంచి బజ్ క్రియేట్ చేశాయి. తాజాగా మేకర్స్ సినిమాలోని ఫస్ట్ సింగిల్ 'దర్శనమే..'ను రిలీజ్ చేసి, మ్యూజిక్ ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు.

విశాల్ చంద్ర శేఖర్ ఈ పాట కోసం క్లాసిక్ మెలోడీని ఫ్రెష్ బీట్స్‌తో అద్భుతంగా కంపోజ్ చేశారు. మనసుని కట్టిపడేసే ట్రాక్ ఇది. యాజిన్ నిజార్ వోకల్స్ పాటను మరో స్థాయికి తీసుకెళ్ళాయి. ఆయన వాయిస్ మెస్మరైజ్ చేసింది. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం శర్వా ఎమోషన్స్‌ని అద్భుతంగా వర్ణించింది. స్క్రీన్ పై శర్వా చరిస్మాటిక్ ప్రజెన్స్ కట్టిపడేసింది. సంయుక్త అందంగా కనిపించింది. వారు తమ ప్రేమకథను ప్రేక్షకులను అలరించే విధంగా పెర్ఫామ్ చేశారు. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది అని చిత్ర యూనిట్ తెలిపింది.



విలన్లపై వినూత్న ప్రేమగీతం

దర్శకుడు బాబ్జీ రూపొందిస్తున్న చిత్రం 'పోలీస్ వారి హెచ్చరిక'. ఈ చిత్రం నుంచి ఒక వినూత్నమైన ప్రేమగీతం ఆవిష్కరణ జరిగింది. ఈ పాటను రాజేంద్ర ప్రసాద్ లాంచ్ చేశారు. తూలికా తనిష్క్ క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మాత బెల్లి జనార్ధన్ ఈ చిత్రాన్ని నిర్మించారు.

ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, 'సాధారణంగా సినిమాల్లో హీరో-హీరోయిన్లు ప్రేమగీతాలు పాడుకుంటారు. కానీ ఈ సినిమాలో విలన్లు డ్యూయెట్‌లు పాడుకోవడం ఒక వెరైటీ కాన్సెప్ట్. ఈ సినిమా విడుదలైన తర్వాత విలన్లకు కూడా డ్యూయెట్‌లు పెట్టే ట్రెండ్ మొదలవుతుందని నా నమ్మకం' అని అన్నారు.

'త్వరలో సెన్సార్ పనులు పూర్తి చేసి, ఈ చిత్రాన్ని గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధం చేస్తున్నాం' అని దర్శకుడు బాబ్జీ తెలిపారు. నిర్మాత బెల్లి జనార్ధన్ మాట్లాడుతూ, 'ఈ సినిమాను తెలుగు రాష్ట్రాల్లో వీలైనన్ని ఎక్కువ థియేటర్లలో రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం. ప్రేక్షకులకు ఈ చిత్రం ఒక కొత్త అనుభవాన్ని అందిస్తుందని ఆశిస్తున్నాం' అని తెలిపారు.


ప్రదీప్ మాచిరాజు

క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

హీరో ప్రదీప్ మాచిరాజు నటించిన నూతన చిత్రం 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'. డైరెక్టర్స్ నితిన్, భరత్ దర్శకత్వం వహించారు.

మాంక్స్ అండ్ మంకీస్ బ్యానర్ నిర్మించింది. దీపికా పిల్లి కథానాయికగా నటించిన ఈ చిత్రం ఈనెల 11న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా హీరో ప్రదీప్ మాచిరాజు మీడియాతో ముచ్చటించారు.

ఇదొక చందమామ కథ..

ఈ సమ్మర్లో ఫ్యామిలీ అంతా కూర్చుని హ్యాపీగా చూసే సినిమా. పైగా వాళ్ళు మా నుంచి ఎలాంటి కంటెంట్‌ని ఆశిస్తారో అలాంటి కంటెంట్ ఇందులో ఉంది. ఇదొక చందమామ కథ. అనగనగా ఒక ఊరు. అక్కడ ఓ అమ్మాయి. ఆ ఊరికి వెళ్ళిన ఒక సివిల్ ఇంజనీర్. ఆ ఊర్లో కొన్ని కట్టుబాట్లు ఉంటాయి. ఆ రూల్స్ మధ్య హీరో ఎలా ఇరుక్కున్నాడు? అనేది చాలా ఇంట్రెస్టింగ్‌గా ప్రజెంట్ చేశాం. ఇది పవన్ కళ్యాణ్ సినిమా టైటిల్. అందుకే అన్ని జాగ్రత్తలు తీసుకుని ఈ సినిమా చేశాం.


నేను పడే కష్టాలు నవ్విస్తాయి

ఇందులో కృష్ణ అనే పాత్రలో కనిపిస్తాను. చాలా స్మార్ట్ క్యారెక్టర్. ఇందులో నేను పడే కష్టాలు చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంటూ ప్రేక్షకుల్ని నవ్విస్తాయి. డైరెక్టర్స్ నితిన్, భరత్ ఈ కథని, నా క్యారెక్టర్‌ని చాలా బ్యూటీఫుల్‌గా డిజైన్ చేశారు.హీరోయిన్ దీపికా పిల్లి చాలా అద్భుతంగా నటించింది. ఆడియన్స్ డెఫినెట్‌గా సర్‌ప్రైజ్ అవుతారు. ఈ సినిమాలో మ్యూజిక్‌కి చాలా మంచి స్కోప్ ఉంది. ప్రతి సాంగ్‌ని ఒక డిఫరెంట్ జోనర్‌లో చేశాం. రథన్ బ్యూటీఫుల్ ఆల్బమ్ ఇచ్చారు. మైత్రి మూవీ మేకర్స్ ఈ సినిమా చూశారు. సినిమా పూర్తవ్వగానే డీల్ క్లోజ్ చేశారు. ఇది సమ్మర్‌కి ఫ్యామిలీ అంతా కలసి చూడాల్సిన సినిమా అని, రిలీజ్ డేట్‌ని వారే లాక్ చేశారు. ఇది మాకు మరింత కాన్ఫిడెన్స్‌ని ఇచ్చింది.

వక్ఫ్ నిరసనలపై యోగి సర్కారు ఉక్కుపాదం

- నల్లటి బ్యాండ్లు ధరించినందుకు పలువురిపై చర్యలు
- నిశబ్ద నిరసనలనూ సహించని యూపీ ప్రభుత్వం
- బీజేపీ సర్కారు తీరుపై విమర్శల వెల్లువ

పలు రాజకీయ, మత నాయకులకు నోటీసులు, బాండ్లు



లక్నో : వక్ఫ్ చట్టంలోని సవరణలపై విమర్శలను యూపీలోని యోగి సర్కారు సహించటం లేదు. అన్ని రకాల నిరసనలపై ఉక్కుపాదం మోపుతున్నది. ఆందోళనకారుల గొంతును అణచివేస్తున్నది. ఇందుకు ప్రభుత్వం తన వద్ద ఉన్న అధికారాన్ని వాడుకుంటూ వారి ప్రజాస్వామిక హక్కును హరించివేస్తున్నది. చట్ట సవరణలపై విమర్శలు, నల్లటి బ్యాండ్‌లు ధరించటం వంటి నిశబ్ద నిరసనలు చేసినా.. వారికి నోటీసులు పంపుతున్నది. పలువురికి రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు విలువ చేసే బాండ్లు అందుతున్నాయి. ఇప్పటికే పలువురు రాజకీయ, మత నాయకులపై యూపీ బీజేపీ సర్కారు ఈ విధమైన చర్యలు తీసుకున్నది. ఇప్పటి వరకు ముజఫర్‌నగర్, లక్నో, సీతాపూర్ వంటి ప్రాంతాల్లో ఇలాంటి చర్యలు తీసుకున్నారు.

ఎస్పీ నేతలు, కార్యకర్తలకు నోటీసులు, బాండ్లు

లక్నోలో.. యూపీలోని ప్రధాన ప్రతిపక్షం సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ)కి చెందిన వ్యక్తులకూ నోటీసులు జారీ అయ్యాయి. బక్షీ కా తలాబ్ మేజిస్ట్రేటు.. తమ ముందు హాజరుకావాలంటూ నలుగురు ఎస్పీ కార్యకర్తలు మహేంద్ర యాదవ్, వహీయుద్దీన్, జావేద్, అంకిత్ యాదవ్‌లకు నోటీసులు పంపింది. వారు రూ.లక్ష చొప్పున వ్యక్తిగత బాండ్లను, సమాన మొత్తంలో రెండు ష్యూరిటీలను ఎందుకు సమర్పించకూడదో కారణం చూపాలని ఆదేశించింది.

ఎస్పీ నాయకురాలు, ప్రముఖ రచయిత మునావర్ రాణా కూతురు అయిన సుమైయ రాణాకు సైతం లక్నో పోలీసులు నోటీసులు పంపారు. రూ.10లక్షల బాండ్‌తో పాటు అదే మొత్తానికి ఇద్దరు ష్యూరిటీలు సమర్పించాలని ఆదేశించారు. ఆమె ప్రజాశాంతికి విఘాతం కలిగించొచ్చనే కారణంతో నోటీసులు అందించటం గమనార్హం. "పరిస్థితి చాలా ఉద్రిక్తంగా ఉన్నది. ఆమె శాంతిని ఉల్లంఘించే అవకాశం ఉన్నది" అని నోటీసు పేర్కొన్నది. కాగా, రాణా ఈ నోటీసును తిరస్కరించగా.. ఆ తర్వాత ఆమెకు వాట్సప్ ద్వారా దీనిని అందించారు. దీనిపై తాను కోర్టును ఆశ్రయిస్తాననీ, ఇది యూపీ ప్రభుత్వం, పోలీసుల నియంతృత్వమని రాణా ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు తీసుకునే ప్రతి చెడు చర్యకు వ్యతిరేకంగా తాను గొంతెత్తుతానని ఒక వీడియో స్టేట్‌మెంట్ ద్వారా రాణా వెల్లడించారు.

నల్లటి బ్యాండ్లు ధరించినందుకు నోటీసులు

నల్లటి బ్యాండ్ ధరించాడని ముజఫర్‌నగర్‌లోని మదర్సా వైస్-ప్రెసిడెంట్ నయీమ్ త్యాగికి నోటీసులు జారీ అయ్యాయి. అయితే, తనకు తన ప్రాంతంలోని అలాంటి నిరసనల గురించి తెలియదని నయీమ్ త్యాగి తెలిపాడు. "మదర్సాలోని మసీదు వద్ద నాలుగైదువేల మంది వరకు నమాజ్ చేస్తారు. ప్రతి ఒక్కరినీ నేనెలా గమనిస్తాను. ఇద్దరో, నలుగురో నల్లని బ్యాండ్‌లు ధరించి ఉండొచ్చు. నాకు దాని గురించి తెలియదు" అని నయీమ్ త్యాగి వివరించాడు. ఈద్-ఉల్-ఫితర్ రోజున నమాజ్ సమయంలో నల్ల బ్యాండ్లు ధరించినందుకు సీతాపూర్‌లో 60 మందిపై పోలీసులు చర్యలు తీసుకున్నారు. నిరసన హక్కును హరించివేస్తున్న యోగి సర్కారు తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి.

ముజఫర్‌నగర్‌లో 300 మందికి నోటీసులు

ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా ముజఫర్‌నగర్‌లో 300 మందికి నోటీసులు అందించినట్టు ఒక సీనియర్ పోలీసు అధికారి వెల్లడించారు. ఇందులో ముజఫర్‌నగర్‌లోని అయేషా మసీదు సంరక్షకుడైన ముజీబ్ శిబ్లి ఉన్నారు. వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా నల్లటి బ్యాండ్‌లు ధరించినందుకు శిబ్లితో పాటు మరో ముగ్గురికి ఈ నోటీసులు అందాయి. ఈనెల 16న కోర్టు ముందు హాజరుకావాలంటూ శిబ్లికి ముజఫర్‌నగర్ సిటీ మేజిస్ట్రేటు నోటీసు పంపింది. అలాగే, ఆయన రూ.2 లక్షల బాండ్, అదే మొత్తానికి ఇద్దరు ష్యూరిటీలను ఎందుకు సమర్పించకూడదో వివరించాలని అందులో ఆదేశించింది. ఈద్-ఉల్-ఫితర్ నమాజ్, అల్విదా జుమ్మా సందర్భంగా ప్రార్థనల అనంతరం శిబ్లితో పాటు మరికొందరు నల్లటి బ్యాండ్‌లు ధరించారన్న పోలీసు నివేదిక ఆధారంగా ఈ నోటీసు జారీ కావటం గమనార్హం. వారు ప్రజలకు తప్పుడు సందేశాన్ని పంపుతున్నారని, శాంతి భద్రతలను ఉల్లంఘించారని పోలీసులు ఆరోపించారు.

శాంతి భద్రతల నిర్వహణలో భాగంగా 300మంది 'సంఘ విద్రోహ శక్తులను గుర్తించినట్టు ముజఫర్‌నగర్ నగర ఎస్పీ సత్యనారాయణన్ ప్రజాపత్ వెల్లడించటం గమనార్హం. శాంతికి విఘాతం కలిగించిన వారికి భారతీయ నాగరిక సురక్ష సంహితలని సెక్షన్ 126, సెక్షన్ 130 కింద నోటీసులు జారీ చేసినట్టు చెప్పారు. జామియత్-ఉలేమా-ఎ-హింద్ నగర కార్యదర్శిగా ముజీబ్ శిబ్లి వ్యవహరిస్తున్నాడు. అయితే, నిశబ్దంగా నిరసనలు తెలియ జేస్తున్నా.. ముస్లింలకు భారీమొత్తంలో బాండ్లను జారీ చేయటంపై శిబ్లి ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశాడు. " ముస్లిం పర్సనల్ లా బోర్డు అప్పీలు మేరకు గత శుక్రవారం బ్లాక్ రిబ్బన్లతో మేము నిశబ్దంగా నిరసనలు చేశాం. ఆ సమయంలో ఎలాంటి శబ్దమూ, ప్రదర్శనా, నినాదాలూ, గొడవా జరగలేదు" అని శిబ్లి వివరించాడు. " ఇది ప్రజాస్వామ్యం. నిశబ్దంగా నిరసన వ్యక్తం చేసే హక్కు ప్రతి ఒక్కరికీ ఉన్నది" అని అన్నాడు.

ఆటలు

సత్తా చాటిన సాయి సుదర్శన్

రాజస్థాన్‌పై గుజరాత్ గెలుపు



అహ్మదాబాద్: ఐపిఎల్ సీజన్-18లో గుజరాత్ జెయింట్స్ బ్యాటర్ల హవా కొనసాగుతోంది. నరేంద్ర మోడీ స్టేడియంలో రాజస్తాన్ రాయల్స్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ ఓపెనర్ సాయి సుదర్శన్(82; 53బంతుల్లో 8ఫోర్లు, 3సిక్సర్లు) అర్ధసెంచరీకి తోడు బట్లర్(36), షారుక్ ఖాన్(36) బ్యాటింగ్‌లో రాణించారు. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 217పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో రాజస్థాన్ జట్టు 19.2ఓవర్లలో 159పరుగులకే కుప్పకూలింది. రాజస్తాన్ బ్యాటర్ హెట్‌మైర్(52) అర్ధసెంచరీకి తోడు కెప్టెన్ సంజు(41) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. గుజరాత్ బౌలర్లు ప్రసిధ్ కృష్ణకు మూడు, రషీద్ ఖాన్, సాయి కిశోర్‌కు రెండేసి వికెట్లు దక్కాయి.

అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్‌ను ఆరంభం నుంచే కట్టడి చేయాలని రాజస్థాన్ భావించింది. మూడో ఓవర్‌లోనే తొలి వికెట్‌ను తీసింది. 2.1 ఓవర్‌లో జోఫ్రా ఆర్చర్ వేసిన బంతికి శుభమన్ గిల్(2) బౌల్డ్ అయ్యాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన జోస్ బట్లర్ (36)తో కలిసి సాయి సుదర్శన్ (82) చెలరేగాడు. జట్టును భారీ స్కోర్ దిశగా తీసుకెళ్లాడు. అయితే వీరిద్దరి విజృంభణకు10వ ఓవర్‌లో బ్రేక్ పడింది. ఆ ఓవర్‌లో చివరి బంతికి బట్లర్ ఎల్బీడబ్ల్యూ అయ్యాడు. తొలుత ఎంపైర్ దీన్ని ఔట్‌గా ప్రకటించలేదు. రాజస్థాన్ రాయల్స్ రివ్యూ కోరడంతో థర్డ్ ఎంపైర్ ఔట్‌గా నిర్ణయించింది. బట్లర్ తర్వాత క్రీజులోకి వచ్చిన షారుక్‌ఖాన్ కూడా దూకుడుగా ఆడాడు. 20 బంతుల్లో 36 పరుగులు చేశాడు. కానీ తీక్షణ బౌలింగ్‌లో 15.4 బంతికి షారుక్ ఖాన్ స్టంపౌట్ అయ్యాడు. షారుక్ ఖాన్ తర్వాత వచ్చిన రూథర్‌ఫోర్డ్(7) వచ్చి రాగానే సిక్స్‌తో విరుచుకుపడ్డాడు. కానీ ఆ దూకుడు ఎక్కువసేపు కొనసాగించలేకపోయాడు. 16.1వ ఓవర్‌లో సందీప్ శర్మ బౌలింగ్‌లో వికెట్ కీపర్ శాంసన్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరాడు. ఇక 19వ ఓవర్‌లో రెండో బంతికి సాయి సుదర్శన్ కూడా ఔటయ్యాడు. తుషార్ దేశ్‌పాండే వేసిన బంతికి శాంసన్‌కు క్యాచ్ ఇచ్చాడు. ఆ వెంటనే రషీద్ ఖాన్ (12) కూడా ఔటయ్యాడు. రాహుల్ తెవాటియా (24) ఫర్వాలేదనిపించాడు. ఫలితంగా నిర్ణీత 20ఓవర్లు ముగిసేసరికి ఆరు వికెట్ల నష్టానికి గుజరాత్ 217 పరుగులు చేసింది. రాజస్థాన్ బౌలర్లు తీక్షణ, దేశ్‌పాండేకు రెండేసి, ఆర్చర్, సందీప్ శర్మకు ఒక్కో వికెట్ దక్కాయి.

స్కోర్‌బోర్డు :

గుజరాత్ టైటాన్స్

ఇన్నింగ్స్: సాయి సుదర్శన్ (సి)సంజు (బి)దేశ్‌పాండే 82, శుభ్‌మన్ గిల్ (బి)జోఫ్రా ఆర్చర్ 2, జోస్ బట్లర్ (ఎల్‌బి)తీక్షణ 36, షారుక్ ఖాన్ (స్టంప్)సంజు (బి)తీక్షణ 36, రూథర్ఫోర్డ్ (సి)సంజు (బి)సందీప్ శర్మ 7, రాహుల్ తెవాటియా (నాటౌట్) 24, రషీద్ ఖాన్ (సి)జైస్వాల్ (బి)దేశ్‌పాండే ఆర్షాద్ ఖాన్ (నాటౌట్) 0, అదనం 18 (20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 217పరుగులు.

వికెట్ల పతనం: 1/14, 2/94, 3/156, 4/163, 5/187, 6/201

బౌలింగ్: జోఫ్రా ఆర్చర్ 4-0-30-1, ఫారుఖీ 4-0-38-0, తుషార్ దేశ్‌పాండే 4-0-53-2, సందీప్ శర్మ 4-0-41-1, తీక్షణ 4-0-54-2.

రెండోరౌండ్‌కు సింధు, ప్రణయ్

ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్స్



నింగ్బో(చైనా): ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్స్‌లో భారత్‌కు మిశ్రమ ఫలితాలు దక్కాయి. బుధవారం జరిగిన పోటీల్లో లక్ష్యసేన్‌తోపాటు కిదాంబి శ్రీకాంత్ తొలిరౌండ్‌లోనే ఓటమిపాలవ్వగా.. మహిళల సింగిల్స్‌లో పివి సింధు రెండోరౌండ్‌లోకి దూసుకెళ్లింది. మూడు సెట్ల హోరాహోరీ పోరులో సింధు 18-21, 21-14, 21-19తో జె.డబ్ల్యు.గో(కజకిస్తాన్)పై చెమటోడ్చి నెగ్గింది. మరో పోటీలో మాల్విక బన్సోద్ 18-21, 19-21తో వై.జె.సిమ్(కొరియా) చేతిలో ఓటమిపాలైంది. ఇక పురుషుల సింగిల్స్‌లో హెచ్ఎస్ ప్రణయ్ 17-21తో తొలిగేమ్‌ను చేజార్చుకున్నా.. ఆ తర్వాత రెండు గేమ్‌లను 23-21, 23-21తో చైనాకు చెందిన లూను చిత్తుచేసి రెండోరౌండ్‌కు చేరాడు. ఇతర పోటీల్లో కిదాంబి శ్రీకాంత్ 14-21, 13-21తో గింటింగ్(ఇండోనేషియా), ప్రియాన్షు రాజ్‌వత్ 9-21, 13-21తో జడ్.జె.లీ(మలేషియా) చేతిలో వరుససెట్లలో ఓడాడు. మరో పోటీలో లక్ష్యసేన్ 19-21, 15-21తో చైనా షట్లర్ షీ చేతిలో ఓడి ఇంటిదారి పట్టాడు. ఇక పురుషుల డబుల్స్‌లో కెపి గరగ-ప్రీత్ జంట 14-21, 17-21తో చైనా షట్లర్ల చేతిలో, రథినసబపతి-అంసకరువన్ జంట 15-21, 14-21తో మలేషియా జంట చేతిలో పరాజయాన్ని చవిచూశారు.

షూటర్ సురుచికి స్వర్ణం

ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్ షూటింగ్



బ్యూనస్‌ఎయిర్ (అర్జెంటీనా): ఐఎస్-ఎస్ఎఫ్ ప్రపంచకప్ షూటింగ్‌లో భారత్‌కు మరో స్వర్ణ పతకం దక్కింది. మంగళవారం రాత్రి జరిగిన మహిళల 10మీ. ఎయిర్ పిస్టోల్ విభాగంలో 18ఏళ్ల యువ షట్లర్ సురుచి ఇందర్ సింగ్ బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఆమె 583 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరింది. ఫైనల్‌లోనూ సురుచి అదే జోరు కొనసాగించింది. ఆరంభంలో కాస్త వెనుకబడినా.. ఆ తర్వాత అద్భుతంగా పుంజుకుంది. 8మంది షూటర్ల మధ్య జరిగిన ఫైనల్లో 244.6 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ ఈవెంట్‌లో సిఫ్ట్ కౌర్,10 మీటర్ల ఎయిర్ రైఫిల్ కేటగిరీలో రుద్రాంక్ష్ పాటిల్ ఇప్పటికే గోల్డ్ మెడల్ సాధించిన విషయం తెలిసిందే.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.